

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 189 | మంగళవారం | 30-12-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00


## సెంగార్‌ను విడుదల చేయొద్దు

- ఉన్నావ్ అత్యాచార కేసులో దోషికి సుప్రీం షాక్: జీవిత ఖైదు నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే

05

## ఆరావళిపై సుప్రీం కోర్టు పాత మార్గదర్శకాలు నిలిపివేత

# 'విబి – జి రామ్ జి'పై 2న అసెంబ్లీలో చర్చ

## కేంద్ర ప్రభుత్వ కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక తీర్మానం?

- నూతన చట్టంతో రాష్ట్రంపై ఏటా రూ.1200 నుంచి 1500 కోట్ల భారం
- జనవరి 7వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



శాసనసభ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభలో ముందుగా సూర్యాపేట మాజీ ఎంఎల్‌ఎ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, చేవేళ్ల మాజీ ఎంఎల్‌ఎ కొండా లక్ష్మా రెడ్డి మరణం పట్ల శాసనసభ సభ సంతాపం ప్రకటిస్తూ కొద్ది సేపు మౌనం పాటించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.అనంతరం జిరో అవర్ ముగియగానే సభను స్పీకర్ గడ్డం ప్రసాద కుమార్ జనవరి 2వతేదీ ఉదయం 10గంటలకు వాయిదా వేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ (విబి జి రామ్ జి) చట్టంపై జనవరి 2న శాసనసభలో చర్చించనున్నారు. ఉపాధి హామీ చట్టం స్థానంలో వచ్చిన ఈ నూతన చట్టం ద్వారా ప్రతి ఏటా రాష్ట్రంపై రూ.1200 కోట్ల నుంచి తరువాయి 2లో



# బిఆర్‌ఎస్... ఉనికిని కాపాడుకుంటోంది

- సభలో ప్రతిపక్షాల విమర్శలకు ధీమాగా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలి
- ప్రతిపక్షం అడిగే ప్రతిపశ్నకు సమాధానం ఇవ్వాలి
- మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన
- కెసిఆర్‌ను మర్యాద పూర్వకంగానే కలిసినట్లు మీడియా ఇష్టాగోష్టిలో వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. సభలో ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం చెప్పేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని అన్నారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు ప్రాధాన్యత ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని సూచించారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'మాజీ సిఎం, ప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖర్ రావును అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశాను. ప్రతి సభ్యుడిని మేం గౌరవిస్తాం. కెసిఆర్‌ను అసెంబ్లీలోనే కాదు ఆస్పత్రిలో కూడా కలిశాను. అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో తరువాయి 2లో



## పాలమూరు – రంగారెడ్డిపై బిఆర్‌ఎస్ కక్ష

- గత పదేళ్ల హయాంలో ఖర్చు చేసింది రూ.27వేల కోట్లు మాత్రమే
- 90% నిధుల ఖర్చు చేశామనడం అబద్ధం
- 90 టిఎంసిల నీటి కేటాయింపుతో ఎత్తిపోతలను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మీడియా ఇష్టాగోష్టిలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పునరుద్ఘాటన



ప్రజాపక్షం/హైదరాబాద్


బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు (పిఆర్‌ఎల్‌ఐఎస్)పై కక్ష కట్టి కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాలని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుకు 90 శాతం నిధులను ఖర్చు చేశామని బిఆర్‌ఎస్ నాయకులు చెప్పడం పెద్ద అబద్ధమని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసింది కేవలం 30 శాతం మాత్రమేనని, అయినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్ర భారతదేశంలోనే అత్యధిక శాతం వడ్డీలకు నీటి ప్రాజెక్టుల కోసం అప్పులను తీసుకువచ్చారని ఆయన తెలిపారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పిఆర్‌ఎల్‌ఐఎస్) నీటి కేటాయింపు 90 టిఎంసిలతో పూర్తి చేయడానికి తరువాయి 2లో

శాసన సభ సమావేశంలో తెలంగాణ వస్తువుల,సేవల పన్ను (సవరణ) ఆర్డినెన్స్-2025, హైదరాబాద్ మహానగర పాలక రెండవ సవరణ ఆర్డినెన్స్, తెలంగాణ పురపాలిక రెండవ సవరణ ఆర్డినెన్స్, తెలంగాణ పబ్లిక్ సర్వీసులకు, నియామకములు క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూపం హేతుబద్ధం సవరణ తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలోని 294(2)వ సెక్షన్ పత్రాలతో పాటు తెలంగాణ సమగ్ర శిక్ష(టిఎస్‌ఎస్) ఆడిట్ ,తెలంగాణ పిఎం స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా-పిఎం ఆడిట్ నివేదిక,, తెలంగాణ ఉద్యాన అభివృద్ధి సంస్థ లిమిటెడ్ వార్షిక నివేదికలను సభలో ప్రవేశపెట్టారు.

## కెసిఆర్ ఇలా వచ్చి... అలా వెళ్లారు

**ప్రతిపక్షనేత స్థానానికి వచ్చి కరచాలనం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

శాసనసభ సమావేశాలకు ప్రధానప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు సోమవారం సభకు హాజరయ్యారు. సుమారు ఉదయం 10:14 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న కెసిఆర్‌ను బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు స్వాగతం పలుకుతూ అసెంబ్లీ లోపలికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో వెళ్లి, అక్కడి నుంచి శాసనసభలోకి వెళ్లారు. ఆ తర్వాత సభలోకి వచ్చిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రధానప్రతిపక్ష' స్థానంలో కెసిఆర్ కూర్చొడాన్ని గమనించి, ఆయన స్వయంగా ప్రధాన ప్రతిపక్ష' స్థానం వద్దకు వెళ్లి కెసిఆర్‌తో కరచలనం చేశారు. ఈ సందర్భంగా కెసిఆర్ ఆరోగ్య పరిస్థితిని రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు కూడా కెసిఆర్ వద్దకు వెళ్లి కరచలనం చేశారు. కాగా సభ ప్రారంభమైన కొద్ది సేపటికే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాజీ తరువాయి 2లో




దెయ్యాలు వేదాలు వల్లించినట్లు : శ్రీధర్ బాబు 03

## మహిళ హత్య కేసులో దోషికి మరణశిక్ష

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి



ఓ మహిళను దారుణంగా హతమార్చిన కేసులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడవ అదనపు జిల్లా సెషన్స్ (కూకట్‌పల్లి న్యాయస్థానం) దోషికి మరణశిక్ష , రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పు ఇచ్చారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన కరణ్‌సింగ్ జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి ఇనుప పనిముట్లు తయారీ చేస్తుంటాడు. 2001 జూల్ 18న సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్‌లో ఓ మహిళపై దాడి చేసి దారుణంగా హతమార్చాడు. తీవ్ర సంచలనంగా మారిన ఈ కేసును సవాల్‌గా తీసుకొని కొద్ది రోజుల వ్యవధిలోనే నిందితుడు కరణ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని కీలకమైన ఆధారాలు సేకరించారు. అనంతరం న్యాయస్థానంలో దర్యాప్తు వివరాలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేసారు. సుదీర్ఘకాలం విధిస్తూ తీర్పు ప్రకటించింది.



## సమస్యలు పరిష్కరించకుంటే సింగరేణి కనుమరుగే

- సంస్థ ప్రైవేటు పరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి
- సింగరేణి ప్రాంతానికి, కార్మికులు ఉంటున్న ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులతో సిఎం సమావేశమవ్వాలి
- శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ పక్షనేత కూనంనేని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

వివిధ కారణాలతో సింగరేణి కార్మిక వర్గాలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, సింగరేణి ప్రాంతానికి, కార్మికులు ఉంటున్న ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమై, సమస్యలను పరిష్కరించాలని, తద్వారా రాష్ట్రంలోనే అత్యంత పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణిని కాపాడుకోవచ్చని తరువాయి 2లో



## రీజినల్ రింగ్‌రోడ్డు వంకరగా అలైన్‌మెంట్

- రెండు రహదారుల మధ్య కొన్ని ప్రాంతాల్లో 25 కి.మీ మరికొన్ని చోట్ల 50,100 కి.మీ దూరం
- సరైన ప్రమాణాలు పాటించకుండా పార్మాకంపెనీలకు లాభం చేకూరేలా డిపిఆర్‌లు
- శాసన మండలి దృష్టికి తెచ్చిన సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఔటర్ రింగ్ రోడ్డు (ఒఆర్‌ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్య దూరం కొన్ని ప్రాంతాల్లో 25 కిలోమీటర్లు, 50,100 కిలోమీటర్ల దూరం ఉండేలా రూపొందిస్తున్నారని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శాసనమండలి జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా చౌటుప్పల్‌కు ఓఆర్‌ఆర్ కు 25కి.మీ దూరం మాత్రమే తరువాయి 2లో

# 4 కమిషనరేట్లు

**పోలీస్ కమిషనరేట్ల పునర్ వ్యవస్థీకరన**

- కమిషనరేట్ల పరిధి నుంచి భువనగిరి జిల్లా మినహాయింపు
- హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల ఏర్పాటు
- ఫ్యూచర్ సిటీ సిపిగా సుధీర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్




రాష్ట్రంలో పోలీసు కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరించారు. గతంలో ఉన్న మూడు కమిషనరేట్లను పునర్ వ్యవస్థీకరిస్తూ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ, సెక్రటేరియట్, బేగంపేట, శంషాబాద్ ఎయిర్ పోర్టు, బుద్వేల్ హైకోర్టు లాంటి కీలక ప్రాంతాల ను హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటి ప్రాం తాలు గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్ గూడ, మాదాపూర్, రాయదుర్గ్, పారిశ్రా క ప్రాంతాలు పఠాన్ చెరువు, జీనోమ్ వ్యాలీ, ఆర్‌సిపురం, అమీన్‌పూర్ తదితర ప్రాంతాలు సైబరాబాద్ కమిషనరేట్ తరువాయి 12లో

# డెహ్రాడూన్‌లో జాత్యహంకార దాడి

- త్రిపుర విద్యార్థి హత్య
- భయంకరమైన ద్వేషపూరిత నేరం అని రాహుల్‌గాంధీ మండిపాటు
- ద్వేషం రాత్రికి రాత్రే పుట్టదు : బాధ్యతారహితమైన కథనాల ద్వారా యువత మెదళ్లలోకి జొప్పిస్తున్నారని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా బిజెపి విద్వేష రాజకీయాలకు పాల్పడుతుందని, అందుకు త్రిపుర విద్యార్థి హత్యే నిదర్శనమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మోదీ సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో త్రిపుర విద్యార్థి హత్యను 'భయంకరమైన ద్వేషపూరిత నేరం'గా ఆయన అభివర్ణించారు, అధికార బిజెపి ద్వేషాన్ని సాధారణీకరిస్తోందని ఆరోపించారు. పశ్చిమ త్రిపుర జిల్లాలోని నందన్‌నగర్‌కు చెందిన 24 ఏళ్ల ఏంజెల్ చక్మా ఈనెల 9న డెహ్రాడూన్‌లో తనపై చేసిన జాతి వివక్ష వ్యాఖ్యలను వ్యతిరేకించినందుకు ఆరుగురు వ్యక్తుల బృందం అతనిపై దాడి చేసింది. నిందితులు చక్మాపై కత్తులు, ఇత్తడి పిడికిళ్లతో దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. తీవ్రంగా గాయపడిన అతను చికిత్స పొందుతూ ఈనెల 26న మృతి చెందాడు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో మణిపూర్‌లో పనిచేస్తున్న ఏంజెల్ తండ్రి తరుణ్ చక్మా మాట్లాడుతూ నిందితులు తన కొడుకును 'చైనీస్' అని పిలుస్తూ 'జాత్యహంకార దూషణలు' చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ స్పందిస్తూ ద్వేషం రాత్రికి రాత్రే పుట్టదన్నారు. 'డెహ్రాడూన్‌లో ఏంజెల్ చక్మా, అతని సోదరుడు మైఖేల్‌కు జరిగింది ఒక భయంకరమైన ద్వేషపూరిత నేరం' అని ఆయన అన్నారు. 'ద్వేషం రాత్రికి రాత్రే పుట్టదు. సంవత్సరాలుగా, విషపూరితమైన కంటెంట్, బాధ్యతారహితమైన కథనాల ద్వారా దీనిని ప్రతిరోజూ పెంచి పోషిస్తున్నారు. ముఖ్యంగా మన యువతలో మెదళ్లలోకి జొప్పిస్తున్నారని, అధికార బిజెపికి చెందిన ద్వేషాన్ని వెదజల్లే నాయకత్వం దీనిని సాధారణీకరిస్తోంది' అని రాహుల్ మండిపడ్డారు. భారతదేశం భయం, దుర్వినియోగంపై కాకుండా గౌరవం, ఐక్యతపై నిర్మించబడిందని ప్రతిపక్ష నాయకుడు అన్నారు. మనది ప్రేమ, వైవిధ్యం ఉన్న దేశమని, తోటి భారతీయులపై దాడి జరుగుతున్నప్పుడు చూస్తూ ఊరుకునే నిర్జీవ సమాజంగా మనం మారకూడదని తరువాయి 12లో



## సిజెఐ చంద్రచూడ్ అని చెప్పి డిజిటల్ అరెస్ట్

- రూ.3.71 కోట్లు కోల్పోయిన 68 ఏళ్ల మహిళ
- ముంబయి అంధేరీ ఈస్ట్‌లో ఘటన

**న్యూఢిల్లీ :** ముంబయికి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలిని.. సైబర్ నేరగాళ్లు దారుణంగా మోసం చేశారు. బెదిరింపులకు పాల్పడి ఆమె అకౌంట్ నుంచి సుమారు 3.71 కోట్లు కాజేశారు. డిజిటల్ అరెస్టుకు చెందిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ అని చెప్పి సైబర్ నేరగాడు ఆ మహిళను మోసం చేశాడు. సిబిఐ, పోలీసు అధికారులమని ఆమెను నమ్మించారు. అంధేరీ ఈస్ట్‌లో ఆ బాధిత మహిళ 26 ఏళ్లుగా జీవిస్తోంది. ఆగస్టులో ఆమెకు తొలిసారి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పోలీసులమని చెప్పి ఆమెతో పరిచయం తరువాయి 12లో

## తెలంగాణలో 'కేరళ మోడల్'

- అత్యంత పేదరిక నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు
- మహిళా సంఘాల భాగస్వామ్యంతో 'పూరెస్ట్ ఆఫ్ ద పూర్' కుటుంబాల గుర్తింపు
- మంత్రి అనసూయ సీతక్క ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

కేరళ రాష్ట్రం తరహాలో తెలంగాణలో కూడా పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ సిఇఒ తరువాయి 2లో



## 'ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులు'



- పరిరక్షణకు పకడ్బందీ చర్యలు
- ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దు
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశం
- జూబ్లీహిల్స్ ఎన్నికల హామీలు, స్మశానవాటికలు తదితర అంశాలపై మంత్రి అజార్, ఎమ్మెల్సీ నవీన్‌తో కలిసి సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటి పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం సహచర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జూబ్లీ హిల్స్ ఎంఎల్‌ఎ నవీన్ యాదవ్‌తో కలిసి జూబ్లీహిల్స్ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## నర్సింగ్ హోంలో అగ్ని ప్రమాదం
### 16 మంది వృద్ధుల సజీవ దహనం

**జకర్తా:** ఉత్తర ఇండోనేషియాలోని ఒక వృద్ధుల ఆశ్రమంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 16 మంది మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తర సులవేసి రాష్ట్ర రాజధాని మనడోలోని పదవీ విరమణ చేసిన ఉద్యోగులుండే సిటీ నర్సింగ్ హోంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో చాలామంది వృద్ధులు విశ్రాంతి తీసుకుంటున్నారు, వారంతా వారి వారి గదుల్లోనే సజీవదహనమై కనిపించారని అగ్నిమాపకదళ అధికారి జిమ్మీ రోటిన్సులు చెప్పారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఏమిటో తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మరణించినవారిలో చాలామంది మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనం అంతటా వ్యాపించాయి. ఈ నెలారంభంలోనే జకార్తానగరంలో ఏడు అంతస్తుల భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 22 మంది సజీవదహనమయ్యారు.

## మళ్ళీ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కాంబోడియా



**బ్యాంకాక్:** కాంబోడియా మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని థాయ్‌లాండ్ ప్రభుత్వం ఆరోపించింది. ఆదివారం రాత్రి పొద్దుపోయాక దాదాపు 250 మానవ రహిత గగనతల వాహనాలు తమ సరిహద్దుల్లోకి దూసుకువచ్చినట్లు ఆరోపించింది. రాయల్ థాయ్ ఆర్మీ సమాచారం ప్రకారం కాంబోడియా కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ఈ పరిస్థితుల్లో జులై నుండి థాయ్‌లాండ్ స్వాధీనం చేసుకున్న 18 మంది కాంబోడియా సైనికులను విడుదల చేసే విషయంపై పునరాలోచన చేయాల్సి ఉంటుందని కూడా ప్రభుత్వం ప్రకటించింది. సరిహద్దు వివాదం కారణంగా కొన్ని వారాలుగా రెండు దేశాలమధ్యా పరస్పర దాడులకు, సాయుధ ఘర్షణలకు నస్పష్టి చెలరేగిన థాయ్‌లాండ్, కాంబోడియా స్పెషల్ జనరల్ బోర్డర్ కమిటీ సమావేశంలో కాల్పుల విరమణకు కొత్త ఒప్పందంపై సంతకాలు చేశాయి. గడచిన శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు సైనిక చర్యలు నిలిపివేయాలి. అదనపు సైనిక కదలికలు చేపట్టకూడదు. అలాగే పరస్పర దేశాలూ గగనతలాలను ఉల్లంఘించరాదని స్పష్టంగా పేర్కొన్నారు. శనివారం ఒప్పందం తర్వాత ఆది, సోమ వారాలలో యూనన్‌లో రెండు దేశాల నాయకులు సమావేశమయ్యారు. ఈ దశలోనే మళ్ళీ కాల్పుల విరమణ ఉల్లంఘన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కాల్పుల విరమణ ఒప్పందంలో చైనా కూడా 'ఏసియన్' తరపున చురుకైన పాత్ర వహించింది. గడచిన జులై నుండి మూడుసార్లు యుద్ధం రెండు దేశాల మధ్యా తలెత్తింది. సరిహద్దులో దాదాపు 10 లక్షలమంది ప్రజలు ఇళ్ళు వదలి పారిపోయారు.

## రెండు చోట్ల నుండి తారిఖ్ రెహ్మాన్ పోటీ
### నామినేషన్లు దాఖలు



**ఢాకా:** బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక చైర్మన్, మాజీ ప్రధానమంత్రి ఖలీదాజియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ (60) పార్లమెంటు ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుండి పోటీ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నామినేషన్ పత్రు దాఖలు చేశారు. ఢాకా–17 నియోజకవర్గం, బోగ్రా–6 (సాదర్) నియోజకవర్గాలలో పోటీకి నామినేషన్ పత్రాలను సమర్పించారు. సెగుంబగిచాలోని ఢాకా డిప్యూటీ కమీషనర్‌కు ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు. ప్రధాన మంత్రి పదవికి ఆయన పోటీ పడనున్నారు. ఇప్పుడు దేశంలో ఆయన ఒక్కరే సర్వమత సామరస్యాన్ని కాపాడే నాయకుడుగా, ఒక ఆశాదీపంగా కనిపిస్తున్నారు. గడచిన గురువారం ఆయన స్వదేశానికి చేరుకోవడంతో ఆ దేశ రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. భార్యా పిల్లలతో కలిసి లండన్ నుండి గురువారం ఢాకా విమానాశ్రయంలో దిగిన తర్వాత తారిఖ్ రెహ్మాన్‌కు లక్షలాదిమంది అభిమానులు, కార్యకర్తలు విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం పలికారు. మరునాడు శుక్రవారం ఉదయం ఆయన తన తండ్రి, బిఎన్‌పి వ్యవస్థాపకుడు జియా వుర్ రెహ్మాన్ సమాధివద్ద 19 సంవత్సరాల తర్వాత మొదటి సారి నివాళులు అర్పించారు. ఇన్నాళ్ళుగా ఉన్న కేసులన్నీ మహ్మద్ యూనుస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేయడంతో ఆయన దేశానికి తిరిగి వచ్చారు. 'జులై ఉద్యమం' తర్వాత షేక్‌హసీనా ప్రభుత్వం పతనమయ్యాక దేశంలో ఫిబ్రవరి 12న జరిగే ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికల్లో ఆయన ప్రధానమంత్రి పదవికి పోటీ పడనున్నారు. షేక్ హసీనా అధికారంలో ఉన్నంతకాలం ఆయన లండన్‌లోనే ఉండిపోయారు. "ఇప్పుడు అందరికీ మాట్లాడే హక్కు వచ్చింది, హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బుద్ధిస్టులు అందరిదీ ఈ దేశం, రెచ్చగొట్టేవారిని సహించేదిలేదు" అని ఆయన ప్రకటించారు. ఆయన తల్లి ఖలీదాజియా దాదాపు మరణావస్థలో కొద్దికాలంగా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి మరీ ప్రమాదకరంగా ఉంది.

## కొసావోలో ప్రధానమంత్రి కుర్తి అధికారపార్టీ మూడోసారి జయకేతనం




**ప్రిస్టినా :** ఆగ్నేయ ఐరోపాదేశం కొసావోలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అధికార సెల్ఫ్ డిటర్మినేషన్ వెటెవెండోస్జే పార్టీ వరుసగా మూడో సారి కూడా ఘన విజయం సాధించింది. ప్రధానమంత్రి అల్బిన్ కుర్తి తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నారు. 90 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయేసరికి అల్బిన్ కుర్తి పార్టీకి 50.8 శాతం ఓట్లు లభించాయి. ఆయనకు వ్యతిరేకంగా పోటీకి దిగిన సెంటర్–రైట్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొసావోకు 20.98 శాతం ఓట్లు లభించగా, డెమొక్రటిక్ లీగ్ ఆఫ్ కొసావో పార్టీకి 13.89 శాతం ఓట్లు లభించాయి. ప్రధానమంత్రి కుర్తి విజయంతో దేశంలో రాజకీయ ప్రతిష్ఠంభనకు తెర పడినట్లయింది. ఈ ఏడాదిలో రెండోసారి ఆదివారం కొసావోలో పోలింగ్ జరిగింది. దాదాపు ఏడాదికాలంగా ఏర్పడిన రాజకీయ ప్రతిష్ఠంభన చివరకు పరిష్కారమైంది. 2025 ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన ఎన్నికల్లో ప్రధానమంత్రి అల్బిన్ కుర్తి నాయకత్వాన గల వెటె వెండోస్జే పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విఫలమైంది. 2021లో అధికారంలోకి వచ్చినప్పటినుండి కుర్తి ప్రభుత్వం నిరంతర విధానాల ద్వారా మిత్రదేశాలైన అమెరికా, యూరోపియన్ యూనియన్‌లను దూరం చేసే పరిస్థితులు సృష్టిస్తోందని కొసావోలో కీలక ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. 120 స్థానాలున్న జాతీయ అసెంబ్లీలో మైనార్టీ తెగలకు ఇరవైశాతం సీట్లు కేటాయించారు.

## తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు



**బీజింగ్ :** తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు ప్రారంభించింది. ఈ వారం అంతా తైవాన్ జలాల్లో సైనిక విన్యాసాలు నిర్వహిస్తామని చైనా ప్రకటించింది. తైవాన్‌కు 11 బిలియన్ డాలర్ల మేరకు భారీ ఆయుధ ఒప్పందాన్ని అమెరికా ఖరారు చేసిన తర్వాత చైనా తీవ్ర ఆగ్రహంతో ఉంది. వెంటనే ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని, తైవాన్‌కు ఆయుధాలను సరఫరా చేయవద్దని అమెరికాకు చైనా డిమాండ్ చేసింది. తదుపరి పరిణామంగా చైనా తైవాన్ జలాల్లో సైనిక విన్యాసాలు చేపట్టింది. తైవాన్ దీవుల్లోని మధ్య ప్రాంతాల్లో వివిధ రకాల విన్యాసాలు చేయడంతో తైవాన్ నౌకలు కూడా హెచ్చరికలు జారీ చేశాయి. ఈ విన్యాసాలను అడ్డుకునే ప్రయత్నం చేశాయి. చైనా పీపుల్స్ ఆర్మీ ఈస్టన్ థియేటర్ కమాండ్ ఫైటర్లు, బాంబర్లు, మనుషులు లేని గగనతల వాహనాలను ఎక్కువదూరం ప్రయాణించే రాకెట్లను ఉపయోగించి ఈ విన్యాసాలు కొనసాగించింది. తైవాన్ స్వయంపాలిత దీవులు చైనా ప్రధాన భూభాగంలో అంతర్భాగమని ఉద్ఘాటించింది. తైవాన్‌కు ట్రంప్ ఇవ్వజూపిన 11.1 బిలియన్ డాలర్లు విలువైన ఆయుధాల ప్యాకేజీని అమెరికా కాంగ్రెస్ ఇంకా ఆమోదించాల్సి ఉంది. ఈ ఆమోదం లభిస్తే తైవాన్‌కు కొత్త బలం చేకూరుతుంది. జపాన్–తైవాన్ మధ్య కూడా దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరుగుతాయి.

## పశ్చిమాసియా సమస్యలపై నెతన్యాహూతో ట్రంప్ సంభాషణ



**పామ్‌బీచ్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా పశ్చిమ ఆసియా సమస్యలపై దృష్టి సారించారు. ఉక్రేన్ శాంతి ప్రణాళికపై జెలెన్‌స్కీతో సంభాషణల మరునాడే సోమవారం ఆయన ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూతో సంభాషణలు జరిపారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన 11 నెలలలో నెతన్యాహూతో సమావేశం జరపడం ఇది ఆరోసారి. బహుశా ఈ విధంగా ట్రంప్‌ను ఎక్కువ సార్లు కలిసిన విదేశీ నాయకుడు నెతన్యాహూ ఒక్కరే. గాజాలో రెండోదశ శాంతి ప్రణాళక అమలు ప్రక్రియ, సిరియాతో ఇజ్రాయెల్ సంబంధాలు, తిరిగి ఆయుధాలు సమకూర్చుకుంటున్న ఇరాన్ చర్యలు, లెబనాన్‌లో హిజ్బుల్లా ఉగ్రవాదుల చర్యలు తదితర అంశాలపై నెతన్యాహూతో ట్రంప్ చర్చించారు. ఇంకా దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత నెతన్యాహూ చేయి వదిలిపెట్టకుండా ఆ దేశానికి పూర్తి అండదండలు సమకూర్చింది అమెరికా. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, ఆయుధ సామాగ్రితోపాటు ఉగ్రవాదుల కదలికలు, ఇతర సమాచారాన్ని కూడా ఉపగ్రహాల ద్వారా ఇజ్రాయెల్‌కు సమకూర్చింది. గాజాలో జరుగుతున్న యుద్ధంలో అమెరికా వేలు పట్టుకుని నెతన్యాహూను నడిపించినట్లయింది.

## సింగరేణి కనుమరుగే
(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. శాసనసభలో సోమవారం జరిగిన జీరో అవర్‌లో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోతే సింగరేణి సంస్థ కూడా కొద్ది రోజుల్లోనే కనుమరుగై, ప్రైవేటు పరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ సరైన పద్ధతిలో అమలు చేయడం లేదని, తద్వారా కార్మికుల్లో అసంతృప్తి ఉన్నదని, కారుణ్య నియామకాల వయో పరిమితిని 38 నుంచి 40 ఏళ్లకు పెంచారని, మెడికల్ బోర్డ్ సమావేశం కూడా నామమాత్రంగానే జరుగుతోందని, కార్మికుల పిల్లలకు అవకాశం కల్పించడం లేదని వివరించారు. సింగరేణి సంస్థలో సొంత ఇంటి పథకం లేదని,గతంలో మారు పేరుతో కార్మికులు ఉద్యోగాల్లో చేరారని, ప్రస్తుతం వారి పిల్లలు అన్యాయనికి గురవుతున్నారని, వీరికి కూడా అవకాశం కల్పించాలని సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టిన చట్టం ద్వారా మైన్స్ ప్రైవేటు పరం అవుతున్నాయని, ఇవి కూడా సింగరేణి సంస్థకే దక్కాలని, బొగ్గును సింగరేణి సంస్థనే చేయాలనే నిబంధనను ఉల్లంఘిస్తున్నారని వివరించారు. సింగరేణి సంస్థకు జెన్‌కో సంస్థ రూ 43 వేల కోట్లు బకాయి పడిందని, దీనిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కోల్ ఇండియా తరహా సింగరేణి సంస్థలో కూడా ట్యాక్స్ రిటర్న్ చేయాలని సూచించారు. సింగరేణిలో తరచూ రాజకీయ జోక్యం జరుగుతుందని, వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## వంకరగా అలైన్‌మెంట్
(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందన్నారు. ఓఆర్ఆర్ ట్రిబుల్ ఆర్ మధ్య సరైన ప్రమాణాలు పాటించకుండా కేవలం ఫార్మా కంపెనీలకు లాభం చేకురేలా చేస్తున్నారని అన్నారు. ఫార్మా కంపెనీలకు ఉపయోగపడే విధంగా ట్రిబుల్ ఆర్ ఆలైన్‌మెంట్ డిటైయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డిపిఆర్) వంకరటికరగా రూపొందించారని సత్యం సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉత్తర, దక్షిణ భాగాలు కూడా ఇదే విధంగా డిపిఆర్ రూపొందించారని అన్నారు. దీంతో నిర్వాసితులు అవుతున్న చిన్నకారు, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో విలువైన భూములు రైతులు కోల్పోతున్నారన్నారు. భూములకు నష్టపరిహారం కూడా మార్కెట్ విలువ ప్రకారం ఇవ్వకుండా అతి తక్కువ రేటుకు ప్రభుత్వం చెల్లించేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఉత్తర భాగం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పుడు దక్షిణ భాగంలో సంస్థాన్ నారాయణపురం, మునుగోడు, మర్రిగూడెం ఈ ప్రాంతం రైతులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. ఓఆర్ఆర్ నుంచి 50 కిలోమీటర్లు, 100 కిలోమీటర్లు చేయాలని, అంతే తప్పా తమకు నచ్చిన పద్ధతిలో ఫార్మా కంపెనీలకు ఉపయోగపడే విధంగా డిపిఆర్‌ను ఆ రకంగా చేయకూడదని కోరారు. న్యాయంగా సక్రమంగా నష్టపరిహారం మార్కెంట్ వ్యాల్యూ ప్రకారం ఇవ్వాలని నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు.

## కేరళ మోడల్ (మొదటి పేజీ తరువాయి)

దివ్య దేవరాజన్‌తో కలిసి గత నెలలో మహిళా సంఘాలు నిర్వహించిన కార్యకలాపాలను మంత్రి సమీక్షించారు.

**అత్యంత పేదలను గుర్తించడంలో మహిళలదే కీలక పాత్ర**

నూతన సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జి ) మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు మహిళా సంఘాలు కేవలం తమ ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి పెట్టాయని, ఇకపై సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలను ఆదుకోవడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాల్లో అత్యంత పేదరికంలో ఉన్న 'పూరెస్ట్ ఆఫ్ ద పూర్' కుటుంబాలను గుర్తించడం ప్రభుత్వ ప్రాధాన్యత, వారి అవసరాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తే, ప్రతి కుటుంబానికి ప్రత్యేక 'మైక్రో ప్లాన్' రూపొందించి వారిని పేదరికం నుండి బయటకు తీసుకువస్తామని మంత్రి తెలిపారు. కేరళ ప్రభుత్వం చేపట్టిన పేదరిక నిర్మూలన పథకాన్ని మంత్రి ఈ సందర్భంగా ఉదాహరించారు. కేరళలో 64,006 అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, సుమారు లక్ష మందికి పైగా సహాయం అందించారు. ఆహారం, ఆరోగ్యం, జీవనోపాధి, గృహ నిర్మాణం ప్రాతిపదికన ఈ కుటుంబాలను ఎంపిక చేశారు. ఇదే తరహాలో తెలంగాణలో కూడా పేద కుటుంబాలకు గుర్తింపు కార్డులు, ఇళ్లు, ఉపాధి అవకాశాలు, వైద్య సంరక్షణ అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే పేదలను గుర్తించేందుకు అవసరమైన ప్రొఫార్మాను సంఘాలకు అందజేస్తామన్నారు.

**మహిళా నేతలకు సన్మానం – సెర్ప్‌కు ప్రశంసలు**

ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన సూర్యాపేట, వనపర్తి జిల్లాల మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్లు సరిత, స్వరూపలను మంత్రి సీతక్క ప్రత్యేకంగా సన్మానించారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న సెర్ప్ విభాగం కృషిని ఆమె అభినందించారు. సమావేశం అనంతరం మహిళా సంఘాల సభ్యులతో కలిసి మంత్రి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల మహిళా ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్య కామన్ ఎంట్రెన్స్ పరీక్షల నిర్వహణకు కన్వీనర్లు నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న విద్యా సంవత్సరానికి ఉన్నత విద్య అడ్మిషన్లకుగాను కామన్ ఎంట్రెన్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించి తెలంగాణ ఉన్నత విద్యామండలి కన్వీనర్లను నియమించింది. ఇందుకు సంబంధించి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజనీరింగ్ (బిఇ, బిటెక్), బి ఫార్మ సీ, ఫార్మా డి , టిజిపిజిఇ సెట్ ( ఎంఇ, ఎం.టెక్, ఎం ఫార్మా, ఎం. ఆర్క్, ఫార్మాడి (పిబి) ఎంట్రెన్స్ టెస్ట్‌లకు సంబంధించి నిర్వహణ బాధ్యతలను జెఎన్‌టియుహెచ్ అప్పగించగా కన్వీనర్లుగా సీనియర్ ప్రొఫెసర్ కె. విజయ కుమార్‌రెడ్డిని, జెఎన్‌టియుహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావులను నియమించారు.

అదేవిధంగా టిజి ఎడ్ సెట్ (బి.ఇడి) బాధ్యతలను కాకతీయ విశ్వవిద్యాలయంకు అప్పగించ గా పరీక్షల కన్వీనర్‌గా విశ్వవిద్యాల యం ప్రొఫెసర్ బి. వెంకట్‌రామ్‌రెడ్డిని, టిజి సెట్‌ను (ఎంబిఎ, ఎంసిఎ) ఎంట్రెన్స్ పరీక్షల నిర్వహణను మహాత్మాగాంధీ విశ్వవిద్యాయం నిర్వహించనుండగా కన్వీనర్ బాధ్యతలను ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎ.రవికి అప్పగించారు. బిఇ, బిటెక్, బిఫార్మసీ రెండవ సంవత్సరం అడ్మిషన్ల ప్రవేశాలకు గాను పరీక్ష నిర్వహణను ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అప్పగించగా, కన్వీనర్‌గా ఒయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్‌ను నియమించారు. అదేవిధంగా టిజిలాసెట్ ఎల్‌ఎల్‌బి 3,5 ఏళ్ల ప్రవేశాలు), టిజి పిజిఎల్ సెట్ (ఎల్‌ఎల్‌బి)ల ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒయుకే అప్పగించగా కన్వీనర్‌గా లా కాలేజ్ ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి ని నియమించారు. టిజి పిఇసెట్ ( బిపి ఎడ్, జిడి ఎడ్) నిర్వహణ బాధ్యతలు శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించనుండగా కన్వీనర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు నియమించారు.

## ఇలా వచ్చి... అలా వెళ్లారు
(మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్‌ఎలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డి మరణం పట్ల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలోనే కెసిఆర్ సభ నుంచి వెళ్లిపోయారు.

## కాపాడుకుంటోంది
(మొదటి పేజీ తరువాయి)

కెసిఆర్‌నే అడగాలి' అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇద్దరూ ఏమి మాట్లాడుకున్నారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా 'మేమిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతాం? అని సిఎం వ్యాఖ్యానించారు.

**పార్లమెంట్ తరహాలో సెంట్రల్ హాల్**

పార్లమెంట్ తరహాలో సెంట్రల్ హాల్‌ను నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. శాసనమండలి భవన పునరుద్ధరణ పనులు, సెంట్రల్ హాల్ నిర్మాణం మార్చి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తామని సిఎం తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి శాసనమండలి భవన పునరుద్ధరణ, మరమ్మతు పనులను సిఎం రేవంత్ రెడ్డి సోమవారం పరిశీలించారు. పనుల నాణ్యత, వేగవంతంగా పనుల నిర్వహణపై సంబంధిత అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. సభ్యులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆధునిక సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులను సిఎం ఆదేశించారు. ఎంఎల్‌ఎలు, మంత్రులందరికీ సెంట్రల్ హాల్ యాక్సెస్ ఉంటుందని, మాజీ ఎంఎల్‌ఎలకు కూడా సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా, సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ ఏడవ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు, విప్‌లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు, శాసనమండలి, శాసనసభల కార్యదర్శులు ఘనంగా స్వాగతం పలికారు.

## 2న అసెంబ్లీలో చర్చ (మొదటి పేజీ తరువాయి)

రూ.1500 కోట్ల భారం పడనుందని, కూలీలు ఉపాధి హక్కును కోల్పోవడంతో పాటు, గ్రామాల అభివృద్ధికి గొడ్డలి పెట్టు లాంటిదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఈ కారణంగానే ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నట్టు సమాచారం. కాగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలను జనవరి 7వ తేదీ వరకు నిర్వహించాలని శాసనసభ సలహా కమిటీ (బిఎసి) నిర్ణయించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బిఎసి సమావేశం సోమవారం స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, బిఆర్‌ఎస్ తరపున టి.హరీష్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, బిజెపి ఎంఎల్‌ఎ ఎ.మహేశ్వర్ రెడ్డి ఎంఐఎం పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు. ఈ సమావేశంలో అసెంబ్లీ పని దినాలు, అజెండా ఖరారు తదితర అంశాలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ శాసనసభా పక్షం నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలను వారం రోజుల పాటు జరపాలని, సభలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తెచ్చిన విబి జి రామ్ జి చట్టం, నాలుగు లేబర్ కోడ్‌లపై చర్చించి వాటికి వ్యతిరేకంగా తీర్మానాలను చేయాలని, సిగాచీ కంపెనీలో పేలుడు, ఆర్‌టిసి, సింగరేణి సమస్యలు, ఐటి ఉద్యోగులకు పని గంటల పెంపు తదితర సమస్యలపై చర్చించాలని కోరినట్లు సమాచారం.

**ఎక్కువ రోజులు సమావేశాలు జరగాలి: నెల్లికంటి సత్యం**

శాసనమండలి శీతాకాల సమావేశాలు ఎక్కువ రోజులు నిర్వహించాలని, ప్రజా సమస్యలపై చర్చ జరగాలని సిపిఐ శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం కోరారు. శాసనమండలి వాయిదా పడిన అనంతరం జరిగిన మండలి బిజినెస్ అడ్వయిజనరీ కౌన్సిల్ (బిఎసి) సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అంశాలపై, ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) భూసేకరణలో రైతుల విషయంలో అన్యాయంపై, ఫార్మా కంపెనీలకు అనుకూలంగా జరుగుతున్న మార్పులపై చర్చ చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శాసనసభలో జిహెచ్‌ఎంసి విస్తరణ బిల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసే ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 28 స్థానిక సంస్థలను విలీనం చేసి , పునర్వ్యవస్థీకరించే ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో కీలకమైన ఓఆర్ఆర్ వరకు విస్తరించిన ప్రధాన పట్టణ ప్రాంతంలోని (క్యూర్) భౌగోళికంగా పరిమితంగా ఉన్నప్పటికీ ,స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తికి (జిఎస్‌డిపి)అసమానమైన తోడ్పాటును అందిస్తూ, నివాస, వాణిజ్య, పారిశ్రామిక సంస్థాగతమైన కార్యకలాపాలకుబలమైన మద్దతునిస్తుందని ప్రభుత్వం భావించింది. మెరుగైన పట్టణ పాలనను అందించేందుకు వీలుగా, సమగ్రమైన ప్రణాళికలను రూపొందించేందుకు ,వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రభుత్వం 28 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేసి, పునర్వ్యస్తీకరకించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## బిఆర్‌ఎస్ కక్ష (మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. ప్రాజెక్ట్ ప్రణాళికాబద్ధమైన డిజైన్‌ను సక్రమంగా అమలు చేయలేదని ప్రధాన ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరు– రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సిడబ్ల్యుసి, హైడ్రాలజీ, పర్యావరణ లేదా మరే ఇతర ముఖ్యమైన అనుమతులు సాధించకుండానే అధికారం నుండి వైదొలిగిందని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం తమ పదేళ్ల పాలనలో రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ, ఉమ్మడి మహబూబ్‌గర్, నల్గొండ జిల్లాల్లోని పిఆర్‌ఎల్ఐ ప్రాజెక్ట్, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్, ఎస్‌ఎలిబిసి టన్నెల్, దిండి ప్రాజెక్ట్ లేదా ఉదయ సముద్రం ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందని అసంతృప్తిని వ్యక్తం చేశారు. పైగా పనులను నెమ్మదిగా చేయాలని అప్పటి పిఆర్‌ఎల్ఐ ఇంజనీర్లకు ఆదేశాలు ఇచ్చారని ఆయన మంత్రి పేర్కొన్నారు. నిధుల కొరతను సాకుగా చూపి, 2021లో ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు, పిఆర్‌ఎల్ఐ ప్రాజెక్ట్ ఎస్‌ఈ విజయ భాస్కర్ రెడ్డికి, ఇతర ఇంజనీర్లకు పిఆర్‌ఎల్ఐ పనులను నెమ్మదిగా చేయాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారని ఉత్తంకుమార్ తెలిపారు. పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టులో కొన్ని అంశా లపై 7 టిఎంసిలను మాత్రమే అంగీకరించడాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడంలో విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పూర్తి చేసి పాలమూరుకు నీటిని అందిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు రూ.27,000 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా నీరు సరఫరా చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో రూ.7,000 కోట్లు ఖర్చు చేసి, 11 పంపులను (బిఆర్‌ఎస్ హయాంలో కేవలం ఒకదానితో పోలిస్తే) ఏర్పాటు చేసి, 67 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిపని, 7 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని, 9 కిలోమీటర్ల పొడవున ప్రెజర్ మెయిన్స్ వేయడం ద్వారా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసిందని మంత్రి వివరించారు. గతంలో ప్రారంభించిన పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు సిడబ్ల్యుసి, పర్యావరణ లేదా హైడ్రాలజీ అనుమతులు రాకపోయినా, తర్వాత ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతులు సాధించడం ద్వారా పక్షపాత వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. కాళేశ్వరం విషయంలో రోజువారీ సామర్థ్యాన్ని 2 టిఎంసిల నుండి 3 టిఎంసిలకు పెంచగా, పాలమూరు ప్రాజెక్టు సామర్థ్యాన్ని రోజుకు 2 టిఎంసిల నుండి 1 టిఎంసికి తగ్గించడానికి ప్రణాళిక వేశారని, గత ప్రభుత్వం పాలమూరు ప్రాంతంపై వివక్ష చూపించిందని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు.

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 18న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జిఓ246)ను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా పాటిస్తోందని నొక్కి చెప్పారు. ఈ జిఓ ప్రకారం, చిన్న నీటిపారుదల పథకాలలో ఆదా అయిన నీటి నుండి 45 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్ గోదావరి నీటిని మళ్లించడం వల్ల తెలంగాణకు దక్కాల్సిన వాటా నుండి మరో 45 టిఎంసిలు కలిపి మొత్తం 90 టిఎంసిల నీటిని ప్రతిపాదించారన్నారు. 'బిఆర్‌ఎస్ ప్రభుత్వమే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించి, కేంద్రానికి సమర్పించిన తమ నివేదికలలో 90 టిఎంసిల నీటిని కోరింది. మేము ఎలాంటి మార్పులు లేకుండా అదే జీఓను అనుసరిస్తున్నాం' అని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు స్థితిపై ప్రతిపక్ష బిఆర్‌ఎస్ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని, అబద్ధాలు ప్రచారం చేయడానికి కంకణం కట్టుకుందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ (ప్రస్తుతం నాగర్కర్నూల్, ఇతర జిల్లాలు), రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, నల్గొండ, ఖమ్మం జిల్లాలలోని కొన్ని ప్రాంతాలతో సహా కరువు పీడిత జిల్లాల్లో 12.3 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉన్నప్పటికీ, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నార్లాపూర్ నుండి ఎదుల వంటి కీలక లింకుల పనులను నిలిపివేసిందని, పంపిణీ కాలువలు, ఆయకట్టు కాలువల పనులను ప్రారంభించలేదని ఆయన ఎత్తి చూపారు. బిఆర్‌ఎస్ పాలనలో పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం వహించిందని, కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిస్తూ రూ.1 లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తూ పదేళ్ల కాలంలో పిఆర్‌ఎల్ఐఎస్‌కు కేవలం రూ.27,000 కోట్లు మాత్రమే కేటాయించడం వల్ల ఆ ప్రాజెక్టులో పరిమిత పురోగతి మాత్రమే సాధించిందని ఆయన విమర్శించారు. సుప్రీంకోర్టు విచారణలో ఉందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రూ. 35,000 కోట్ల ప్రారంభ అంచనాతో ప్రారంభించింది, కానీ ఏడేళ్ల జాప్యం తర్వాత సిడబ్ల్యుసికి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డిపిఆర్) సమర్పించే సమయానికి వారే ఖర్చును రూ.55,000 కోట్లకు పెంచారన్నారు. సిడబ్ల్యుసికి సమర్పించిన ఈ రూ. 55,000 కోట్ల అంచనాలో, ఆయకట్టు కాలువలకు అవసరమైన 30,000 ఎకరాల భూసేకరణ పూర్తి వ్యయం, ఆయకట్టు కాలువల పనుల పూర్తి వ్యయం మరియు పునరావాస పనుల పూర్తి వ్యయం కూడా చేర్చలేదని, ప్రస్తుత అంచనా ప్రకారం, పిఆర్‌ఎల్ఐ పథకం పూర్తి వ్యయం రూ.70,000 కోట్లకు పైగా చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో కోనేరు హంపి, అర్జున్ ఘన విజయంపై మంత్రి హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశి కాంస్య పతకాలు సాధించడం గర్వకారణమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కోనేరు హంపి స్థిరమైన ప్రదర్శనతో 11 రౌండ్లలో 8.5 పాయింట్లు సాధించి టైబ్రేక్‌లో మూడో స్థానంలో నిలవడం ఆమె అనుభవానికి, ప్రతిభకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. 38 ఏళ్ల వయసులోనూ అంతర్జాతీయ స్థాయిలో మెరిసి మరో పతకాన్ని సొంతం చేసుకోవడం దేశానికే గర్వకారణమన్నారు. అలాగే ఓపెన్ విభాగంలో అర్జున్ ఇరిగేశి 9.5 పాయింట్లతో కాంస్య పతకం సాధించి ప్రపంచ చెస్ వేదికపై తొలిసారి పోడియంపై నిలవడం యువతకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్సన్ పాల్గొన్న టోర్నీలో అర్జున్ సత్తా చాటడం విశేషమన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

● మీడియా పాయింట్

## కెసిఆర్ జీతం కోసమే అసెంబ్లీకి వచ్చారు : బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు జీతం కోసం తన సభ్యత్వాన్ని కాపాడుకోవడం కోసమే మాత్రమే అసెంబ్లీకి వచ్చారని, సమావేశాల్లో పాల్గొనేందుకు కాదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... సార్ వచ్చారు.. మొక్కుబడిగా సంతకం పెట్టారు. 3 నిమిషాల్లో తన ఫాంహౌజ్‌కు తిరిగి వెళ్లిపోయారన్నారు. మరణించిన సభ్యులకు సంతాపం ప్రకటిస్తుండగానే కనీసం వారికి నివాళ్లు కూడా అర్పించకుండానే వెళ్లిపోయిన కెసిఆర్‌కు ప్రతిపక్ష నేత హోదా ఎందుకు? ఎంఎల్‌ఎ పదవి ఎందుకు అని ప్రశ్నించారు. సభలో తామంతా తమ తమ నియోజకవర్గల్లోని ప్రజల సమస్యలను లెవనేత్తి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతే కెసిఆర్ తన నియోజకవర్గ ప్రజలను గాలికి వదిలేసి వెళ్లిపోయారన్నారు. ఒక్కరోజు సంతకం పెట్టడానికి కాకుండా, ప్రతిరోజు కేసీఆర్ అసెంబ్లీలో చర్చలో పాల్గొనాలి లేకపోతే ప్రతిపక్ష నాయకుడు హోదా ఆయన కొడుకు కెటిఆర్‌కు, అల్లుడు హరీష్‌రావుకో ఇస్తే వారైన చర్చలో పాల్గొంటారని సూచించారు. కెటిఆర్ తండ్రి చాటుగా ఎంఎల్‌ఎ అయ్యారు తప్ప స్వశక్తితో కాదని పేర్కొన్నారు. కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు పార్టీ ఫిరాయింపులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని బీర్ల అయిలయ్య ఎద్దేవా చేశారు.

**మరణించిన సభ్యులకు సంతాపం కూడ తెలపని కెసిఆర్ : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



మరణించిన ఎమ్మెల్యేలకు శాసన సభలో ఒకవైపు సంతాపం ప్రకటించకుండానే వెళ్లిపోయారంటే శాసన సభపై, సభ్యులపై కెసిఆర్‌కు ఉన్న గౌరవం ఏమిటో స్పష్టమైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా కెసిఆర్ అసెంబ్లీలో చర్చలో పాల్గొనాల్సిన బాధ్యత ఆయన ఉందన్నారు. కాని ఆయన మాత్రం రావడం, సంతకం పెట్టడం, వెళ్ళిపోవడం నిమిషాల వ్యవధిలో జరిగిపోయిందని తెలిపారు. దీనికే రేండేళ్లు గా అసెంబ్లీకి రాని కెసిఆర్ వస్తున్నారంటూ బిఆర్ఎస్ పెద్ద హడావిడి చేశారన్నారు. ఇప్పటికైనా పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలపై మాత్రమే కాదు అసెంబ్లీలో జరిగే అన్ని చర్చల్లో పాల్గొన్నాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా వాడుకోకుండా కెసిఆర్ సలహాలు, సూచనలు కేసీఆర్ ఇస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

**ఇంకా అవాకులు, చవాకులే మాట్లాడుతున్నారు : ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి**

అన్ని ఎన్నికల్లో వరసగా ఓటమి పాలవుతున్నా బిఆర్ఎస్ నాయకులు ఇంకా అవాకులు, చవాకులుగానే మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా చర్చలో పాల్గొంటారని అనుకుంటే, కెసిఆర్ అసెంబ్లీకి ఇలా వచ్చి అలా వెళ్ళారని ఎద్దేవా చేశారు. గతంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై జీవో ఇచ్చింది కాంగ్రెస్ పార్టేనని తెలిపారు. ఆ రీడిజైన్ పేరుతో ప్రాజెక్టు వ్యయం పెంచి పక్కన పెట్టిన ఘనత బిఆర్ఎస్ పార్టీదే అన్నారు. గత ప్రభుత్వం రైతుల రుణం మాఫీ చేయకపోతే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని తెలిపారు. త్వరలో జరగబోయే మున్సిపల్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలువబోందని తెలిపారు.

**ఉద్యోగుల పిఆర్‌సిపై స్పష్టత ఇవ్వాలి : ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

పెండింగ్‌లోఉన్న ఉద్యోగుల డిఎల చెల్లింపుతో పాటు పిఆర్‌సికి సంబంధించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల్లో ఉద్యోగ ఖాళీలతో పాటు విశ్వవిద్యాలయాల్లో ఉన్న 70 శాతం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. బహుళ అంతస్తులకు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారని, అక్కడ అనుకోని సంఘటనలు జరిగితే బాధ్యులు ఎవరు అని ప్రశ్నించారు. మరోవైపు రోడ్లు పరిస్థితి బాగాలేదని తెలిపారు. పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ అనుమతి వచ్చినా ఇంకా ఏర్పాటు చేయలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దెయ్యాలు వేదాలు వల్లించినట్టు..

మంత్రి శ్రీధర్‌బాబు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 20వ తేదీ వరకు వేతనాలు చెల్లించని వారు, ప్రస్తుతం ఉద్యోగుల గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నదని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర ఉద్యోగులకు చెందిన అంశంలో ఒక సిస్టమ్‌ను ఏర్పాటు చేసి అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన జిరో అవర్‌లో ప్రభుత్వ ఉద్యోగుల అంశంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మాట్లాడారు. దీనిపైన మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ గత ప్రభుత్వంలో ఉద్యోగులకు కనీసం ప్రతినెలా జీతాలు కూడా చెల్లించలేదన్నారు.



అంతకుముందు తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 5 డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నప్పటికీ ఇంతవరకు పిఆర్‌సి ఇవ్వలేదని, వెంటనే పిఆర్‌సిని విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. సిపిఎస్ కింద ప్రభుత్వం చెల్లించాల్సిన కాంట్రిబ్యూషన్ డబ్బులను రెండేళ్ల నుంచి దారి మళ్లిస్తున్నారని, తద్వారా 2 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పోలీసులకు ఉన్న ఆరోగ్య భద్రత స్కీమును బంద్ చేసి, కేవలం లక్ష రూపాయలకే పరిమితం చేశారని, ఆరోగ్య భద్రత పథకాన్ని పునరుద్ధరించి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందేలా చూడాలన్నారు. తక్షణమే ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, పోలీసులకు ఇచ్చిన హామీ ప్రకారం బకాయిలను విడుదల చేయాలన్నారు.



**గల్ఫ్ బాధితుల బాధ్యత కేంద్రప్రభుత్వానికీ ఉంది : మంత్రి పొన్నం ప్రభాకర్**



గల్ఫ్ బాధితుల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కూడా బాధ్యత ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గల్ఫ్ బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నామని వివరించారు. శాసనసభలో సోమవారం జరిగిన జీరో అవర్‌లో బిజెపి శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి గల్ఫ్ బాధితుల అంశాన్ని ప్రస్తావించగా దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ప్రవాస భారతీయుల సమస్య కోసం ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ బాధితులకు తక్షణమే సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని, బాధిత పిల్లలకు గురుకులాల్లో అడ్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కోతుల బెడదను పరిష్కరించండి: స్పీకర్**

కోతుల బెడదపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కోతుల వల్ల రైతులు కూడా ఇబ్బందిపడుతున్నారన్నారు. శాసనసభలో జీరో అవర్‌లో సభ్యుల ప్రస్తావనలో కోతుల అంశం రాగా, దీనిపై స్పీకర్ పైవిధంగా స్పందించారు.

**ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయండి: బీర్ల అయిలయ్య**

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా, రఘునాథపురంను మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. నూతన మండలం ఏర్పాటుతో పాటు రాజపేట మండలంలోని మల్ల గూడెం, బూరుగుపల్లి, కొండేటి చెరువు, పిట్టలగూడెం తదితర ఆవాస ప్రాంతాల్లో నూతన రేషన్ షాపులు మంజూరు చేయాలని కోరారు.

**కేంద్ర నిర్ణయంతో లారీ ఓనర్లకు రూ.30వేల ఖర్చు**

కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ లారీ ఓనర్లకు గతంలో ఫిట్‌నెస్ కింద వెయ్యి రూపాయలను వసూలు చేసేవారని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రస్తుతం రూ.30వేలు ఖర్చు అవుతుందని వివరించారు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల చేయండి: వేముల ప్రశాంత్ రెడ్డి**



బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ భీంగల్ వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రూ.5 కోట్లు విడుదల చేస్తే మిగిలిన పనులు పూర్తవుతాయని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఎంఐఎం ఎమ్మెల్యే మాజీద్ హుసేన్ మాట్లాడుతూ నాంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసియు ఏర్పాట చేయాలని, నాంపల్లి నియోజకవర్గంలో వొకేషనల్ జూనియర్ కాలేజికి అనుమతి ఇవ్వాలని కోరారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఎస్ఎన్‌డిపి చాలా వరకు పూర్తయ్యాయని, దీనిపై సమీక్ష నిర్వహించాలని కోరారు.

**యాప్ ద్వారా రైతులు ఆగం: కొత్త ప్రభాకర్ రెడ్డి**

బిఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ యాప్ ద్వారా యూరియా అంశంలో రైతులు ఆగమాగం అవుతున్నారని వివరించారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ కాల్వలు కూడా పూడుకుపోయాయని, వాటి పూడిక తీయకపోవడంతో కాల్వల మీధ ఆధారపడ్డ రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ గంగుల కమలాకర్ మాట్లాడుతూ తిరుమల తిరుపతిలో తెలంగాణ వాసులకు వసతి ఏర్పాటుకుగాను తెలంగాణ భవనాన్ని నిర్మించాలన్నారు.

బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యామ్‌ను బాంబులు పెట్టి పేల్చేశారని అన్నారు. దీనిపైన కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పదాలను రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలని కాంగ్రెస్ సభ్యులు నాగరాజు స్పీకర్‌ను కోరారు.

## ఎక్సైజ్ శాఖ ప్రతిష్టను పెంచేలా అధికారులు పనిచేయాలి



మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అబ్కారీ శాఖ ప్రతిష్టను పెంచేలా అధికారులు పనిచేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఎఇఎస్ స్థాయి నుంచి అడిషనల్ కమిషనర్ స్థాయి వరకు మొత్తం 53 మంది అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా ఎదురు చూస్తున్న తమకు పారదర్శకంగా పదోన్నతులు కల్పించినందుకు దన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పదోన్నతులు పొందిన అధికారులు మరింత ఉత్సాహంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. కల్తీ, అక్రమ మద్యం, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ దిశగా ఎక్సైజ్ శాఖ నిరంతరం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో అడిషనల్ కమిషనర్లు ఎస్.వై. ఖురేషి, సురేష్ రాథోడ్ డిప్యూటీ కమిషనర్లు జె.హరికిషన్, చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్లు డి.శ్రీనివాస్, ప్రదీప్‌రావు, జ్యోతికిరణ్, పంచాక్షరి, ఆర్.కిషన్‌తో పాటు ఈఎస్‌లు ఏ.కిషన్, తుక్యా నాయక్, జీవన్ కిరణ్, తదితరులు ఉన్నారు.

## మహిళా డ్రైవర్లకు హైదరాబాద్‌లో తొలి జాబ్ మేళా

మహిళల భద్రత, ఉపాధికి హైదరాబాద్ పోలీసుల ప్రత్యేక చొరవ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో మహిళల భద్రత, ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా మహిళా డ్రైవర్ల కోసం తొలి జాబ్ మేళా నిర్వహించనున్నారు. మహిళా భద్రత విభాగం (డబ్ల్యూఎస్‌డబ్ల్యూ), హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో, మోవో సంస్థ సహకారంతో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డబ్ల్యూఎస్‌డబ్ల్యూ అదనపు డిజి చారు సిన్హా సోమవారం వెల్లడించారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన, దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ జాబ్ మేళా ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. నగరంలో మహిళల మొబిలిటీ పెంచడమే కాకుండా, మహిళా కేంద్రిత రవాణా సేవలను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందన్నారు. ఈ జాబ్ మేళాను జనవరి 3న అంబర్‌పేటలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని భరోసా సెంటర్, పిల్లల రక్షణ సంస్థ, మహిళా భద్రత విభాగం, తెలంగాణ పోలీస్, మోవో సోషల్ ఇనిషియేటివ్స్, హైదరాబాద్ సిటీ పోలీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ ఉద్యోగ మేళాలో ఉచితంగా స్కూటర్, ఇఆటో డ్రైవింగ్ శిక్షణ, ఉద్యోగ నైపుణ్యాలు, భద్రతా శిక్షణ, శిక్షణ తర్వాత లైసెన్స్ పొందడానికి సహాయం చేయడం, 100 శాతం ఉద్యోగ కల్పన, మూడు నెలల పాటు సలహాలు ఇస్తారు. మహిళలు 2145 ఏళ్ల ఉండాలి, డ్రైవింగ్ అనుభవం అవసరం లేదు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే తీసుకురావాలి. ఉత్సాహవంతులైన మహిళలు 8978 862299పై పేర్లు నమోదు చేసుకోవాలి.



హైదరాబాద్‌లో సోమవారం రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి 'ప్రజాపక్షం' డైరీని అందజేసిన నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు పల్లా వెంకట్ రెడ్డి

## ఆరున్నర లక్షల ఎకరాలకు నీరు

బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలమూరు జిల్లాలో రూ.4 వేల కోట్లను ఖర్చు చేసి, ఆరున్నర లక్షల ఎకరాలకు నీరు అందించామని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో జారీచేసిన జిఒను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బయటపెట్టారని, ఆ జిఒలో కూడా 90 టిఎంసిలు అని స్పష్టంగా ఉందని అన్నారు. అసెంబ్లీలో లాబీల్లో సోమవారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు చెందిన డిపిఆర్ వెనక్కి వచ్చి ఏడాది అయినప్పటికీ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తాము 90టిఎంసిలకు డిపిఆర్‌ను సమర్పించి, ఏడు అనుమతులను తీసుకొచ్చామని, రెండేళ్లలో ఒక్క అనుమతినైనా తీసుకొచ్చారా? అని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 1985లో కల్వకుర్తి ప్రాజెక్ట్‌కు కొబ్బరికాయ కొట్టారని, 2014 వరకు 14 వేల ఎకరాలకు నీరు అందిస్తే, బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు మూడు లక్షల ఎకరాలకు పైగా నీరు ఇచ్చామని, ఈ ప్రాజెక్ట్‌కు రూ. 2300 కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. బిఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బిసి సొరంగాన్ని 11 కిలోమీటర్లకు పైగా తవ్వితే, రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 200 మీటర్లు మాత్రమే తవ్వారని వివరించారు.

## నిమ్స్ ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారం

ఆర్జిత సెలవుల నగదు మార్పిడికి ప్రభుత్వం జిఓ జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల సుదీర్ఘ నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. వారు కోరుతున్నట్టుగా 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడి కి ప్రభుత్వం ఆమోదించింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో, నిమ్స్ ఉద్యోగులకు ఈ వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు (జిఓ 230) జారీ చేసింది. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న నిమ్స్ రెగ్యులర్ ఉద్యోగులకు ఇప్పటి వరకు ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం లేదు. దీనిపై ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నాయి. ఇటీవల హాస్పిటల్ నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి తమ సమస్యను విన్నవించారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న 'తెలంగాణ లీవ్ రూల్స్1933' నిబంధనల ప్రకారమే, ఇకపై నిమ్స్ ఉద్యోగులు కూడా తమ ఆర్జిత సెలవులను సరెండర్ చేసి నగదు పొందవచ్చు.

# మండలిలో ఎమ్మెల్సీలు సెల్‌ఫోన్లు వాడొద్దు

వచ్చే సెషన్‌లో సమావేశాలు పాత అసెంబ్లీ ప్రాంగణంలో..



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనమండలి శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో మొదటగా జీరో అవర్‌లో సభ్యులకు అవకాశం కల్పించారు. మండలిలో ఎమ్మెల్సీలు సెల్‌ఫోన్లు వాడేందుకు వీల్లేదని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే సెషన్‌లో సమావేశాలను పాత అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అక్కడ 90 శాతం పనులు పూర్తయ్యాయని, ఎవరైనా సభ్యులు చూడాలనుకుంటే వెళ్లి చూడవచ్చన్నారు.

**దివ్యాంగుల హక్కుల చట్టాన్ని కేవలం కాగితాలకే పరిమితం చేయొద్దు : ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు**

దివ్యాంగుల హక్కులనేవి ప్రభుత్వం చేసే సాయం కాదని, అది ఒక నాగరిక సమాజంగా మనందరి నైతిక బాధ్యత అని ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు అన్నారు. శాసనమండలిలో ఆయన దివ్యాంగుల సమస్యలపై ప్రసంగించారు. 2016 నాటి దివ్యాంగుల హక్కుల చట్టాన్ని కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు. కేవలం ఉన్నత విద్యలోనే కాకుండా, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కెజి నుంచే 5 శాతం ఉచిత సీట్లు దివ్యాంగులకు కేటాయించాలన్నారు. ప్రైవేట్ సెంటర్ల ఆర్థిక దోపిడీని అరికట్టేందుకు ప్రతి ప్రాంతంలో ప్రభుత్వ నిధులతో ఉచిత చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఒక సైకాలజిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్ ఉండాలన్నారు. దీనివల్ల చిన్న వయసులోనే పిల్లల్లోని లోపాలను గుర్తించి సరిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందిస్తూ అండగా నిలవాలని కోరారు. చట్టం సక్రమంగా అమలు అవుతుందో లేదో చూడటానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక నిఘా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఆటిజం, పక్షవాతం వంటి 21 రకాల వైకల్యాలపై సామాన్యుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి : మధుసూదనచారి**

కరీంనగర్– వరంగల్ మధ్య మానేరుపై గరిమళ్ళం దగ్గర బ్రిడ్జి నిర్మాణం చేపట్టారని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదన చారి అన్నారు. బ్రిడ్జి పనులు 60 నుంచి 70 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. చాలా రద్దీగా ఉండే రోడ్డు అని తెలిపారు. బ్రిడ్జి లేకపోవడంతో గీత కార్మికులు నదిలోని నీటిలో నుంచే వెళ్లాల్సి వృత్తి పనులు చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

**ఖాళీలు భర్తీ చేయాలి : తీన్మార్ మల్లన్న**

యూనివర్సిటీలలో 1129 పోస్టులు ఖాళీలు ఉన్నాయని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1692 మందిలో 9 వందల మంది కాంట్రాక్టు లెక్చరర్‌లే ఉన్నారన్నారు. వర్సిటీలు అభివృద్ధి చెందాలంటే ఖాళీలు భర్తీ చేయాలన్నారు. అలాగే బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా భర్తీ చేయాలన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకోవాలని కోరారు. కోరుట్ల, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 16వందల మంది గల్ఫ్ కార్మికులు మృత్యువాత పడ్డారని తెలిపారు. గల్ఫ్ కార్మికులు తీసుకొచ్చే డబ్బుల నుంచి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 8, 8 శాతం చొప్పున 16 శాతం ట్యాక్స్ వసూలు చేస్తున్నాయని, కానీ వారి సంక్షేమానికి మాత్రం ఖర్చు చేయడం లేదన్నారు. గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. గల్ఫ్ కార్మికుల విషయంలో కేరళ తరహాలో పాలసీ తీసుకురావాలన్నారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాలను బతికించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మల్లన్న కోరారు.

**మొగిలిగిద్ద మండలం ఏర్పాటు చేయాలి : నవీన్ కుమార్ రెడ్డి**

మొగిలిగిద్ద మండలం ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కుదూర్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు స్వయంగా సిఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, కానీ ఇప్పటివరకు పనులు ముందుకు సాగడం లేదన్నారు. పనులు పూర్తి చేసి, స్కూల్ ప్రారంభించాలని కోరారు. అలాగే ఒయుకు వెయ్యి కోట్లు నిధులు ఇస్తామని సిఎం ప్రకటించారని అన్నారు. వర్సిటీలలో 70 శాతం పోస్టులు ఖాళీలు ఉన్నాయని, నిధులు మంజూరు చేసి, ఖాళీలు భర్తీ చేయాలన్నారు. నగరంలో 4050 అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారని, అగ్నిప్రమాదాలు జరిగితే, హైడ్రాలిక్ లిఫ్టులు లేవన్నారు. ఏమైన ప్రమాదాలు జరిగితే బాధ్యత ఏవరు వహిస్తారని ప్రశ్నించారు. ఆర్‌టిఏ కార్యాలయం ఏర్పాటుకు పటాన్ చెరులో ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు.

**పాఠశాల కూలిపోయే పరిస్థితిలో ఉంది: సురభి వాణి దేవి**

తన సొంత గ్రామం వంగరలో ప్రభుత్వ పాఠశాల కూలిపోయే పరిస్థితిలో ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణిదేవి సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ప్రభుత్వం స్పందించిన స్కూల్ నిర్మించాలని కోరారు. ఆర్‌పిడబ్ల్యూడి చట్టం ప్రకారం అంధత్వం, వినికిడి లోపం, లోకోమోటర్ వైకల్యం, మానసిక అనారోగ్యం, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, డిస్లెక్సియా, తలసేమియా, హీమోఫీలియా, సికిల్ సెల్ వ్యాధి, యాసిడ్ దాడి బాధిత విద్యార్థుల వ్యాధులను తల్లితండ్రులు దాచిపెడుతున్నారని అన్నారు. విద్యాసంస్థలలో వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు.

**జాప్యం జరుగుతోంది : అంజిరెడ్డి**

పటాన్‌చెరులో రెవెన్యూ డివిజన్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నెలకొల్పుతామని చెప్పారని, కానీ తీవ్ర జాప్యం జరుగుతోందని బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కార్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కోర్టు కూడా ఏర్పాటు చేయాలని అన్నారు.

**పిఆర్‌సి ప్రకటించాలి : మల్క కొమురయ్య**

పిఆర్‌సి ప్రకటించాలని బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. మండలి సమావేశంలో ఆయన జీరో ఆవర్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థినీ విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న దాదాపు 3 వేల మంది రెగ్యులర్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి, వారికి 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం - పరిగి, వికారాబాద్ జిల్లా.**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

లెటర్ నెం. E1/94/SBM Machinery/2025 తేది: 29.12.2025

ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం పరిగి మున్సిపాలిటీలో కంపోస్ట్ ప్లాంట్ సౌకర్యాల ఏర్పాటు కోసం (ఎస్‌బిఎం మెషినరీ) ఉత్పత్తి టెండర్లను ఆహ్వానించడం.

పిలవబడే టెండర్ల షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది:

| | |
|---|---|
| 1. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేదీ | : 30-12-2025 మధ్యాహ్నం 03:00 గంటలకు |
| 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల సమర్పణ | : 03.01.2026 మధ్యాహ్నం 03:00 గంటలకు |
| 3. టెండర్ల ప్రారంభం | : 03.01.2026 మధ్యాహ్నం 03:30 గంటలకు |

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారంను అనగా https://tender.telangana.gov.in సందర్శించండి లేదా పరిగి మునిసిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించండి: 8333856780/7013241881.

సం/- కమిషనర్, పరిగి మునిసిపాలిటీ.

DIPR R.O. No. : 12714-PP/CL/ADVT/1/2025-26, Date: 29-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## కళాకారులకు ఉద్యోగాలివ్వండి

కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వంలో 550 మందికి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇచ్చారని, అర్హతలు ఉన్నప్పటికీ ఇంకా ఉద్యోగాలు రానివాళ్లు ఉన్నారని, వారికి కూడా ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం ప్రతినిధులు హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవితతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలన్నారు. ఇందిరా పార్క్ వద్ద కళాకారులు చేపట్టే ఆందోళనలో తాము పాల్గొంటామని కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను నిలబెట్టిందే తెలంగాణ పాట అని, వేలాది మంది కళాకారులు ఊరూరా తిరిగి గజ్జకట్టి ఆడిపాడారని ఆమె గుర్తు చేశారు.



## గ్రామీణ అభివృద్ధికి సహకార సంఘాలే కీలకం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామీణ అభివృద్ధికి సహకార సంఘాలే కీలకమని, వ్యవసాయంలో సహకార వ్యవస్థ వల్ల పెద్ద మార్పులు వచ్చాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన నాబార్డ్ సహకార వారోత్సవాలు 2025ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ సహకార రంగానికి తెలంగాణ మార్గదర్శి కావాలని ఇందుకు సహకార బ్యాంకుల డిపాజిట్లు పెంచాలని సూచించారు. గ్రామీణ అభివృద్ధి కేంద్రంగా సహకార వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. ఇందులో భాగంగాకొత్తగా 197 ఎంపిఎసిఎస్‌లను ఏర్పాటు చేయడంతో అన్ని పిఎసిఎస్‌ల కంప్యూటరైజేషన్ డిజిటల్ బ్యాంకింగ్, ఆధార్ చెల్లింపులు సహకారంతో గ్రామీణ సంపద సాధ్యమని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రభుత్వం 25.35 లక్షల రైతు కుటుంబాలకు పెట్టుబడి సహాయం అందించడంతో పాటు ఆదాయ మద్దతు, రైతు బీమా, 1.89 కోట్ల టన్నుల వరి ఉత్పత్తితో దేశంలో రెండో స్థానంలో ఉందన్నారు. పప్పుధాన్యాలు, మిర్చి, పసుపు, ఆయిల్‌పామ్‌లో ప్రత్యేక గుర్తింపు ఉందని, ఉద్యానవన ఉత్పత్తి 42 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించామని చెప్పారు. భవిష్యత్‌లో 4,000 గ్రామాల్లో సహజ వ్యవసాయం అమలు లక్ష్యం పెట్టుకున్నామని, 39.5 లక్షల ఎకరాలకు సూక్ష్మ నీటిపారుదల విస్తరణకు గాను మెగా క్లస్టర్లు, విత్తన హబ్‌లు, ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు కోల్డ్ స్టోరేజ్ అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

## అడ్మిన్ డిసిపికి పోలీస్ సంఘం అభినందనలు



ప్రజాపక్షం /హైదరాబాద్: హైదరాబాద్ నగర పోలీసు కమిషనరరేట్‌లో అడ్మిన్ డిసిపిగా బాధ్యతలు స్వీకరించిన కె.వెంకట లక్ష్మిని సోమవారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం (టిఎస్‌పిఒఎ) హైదరాబాద్ సిటీ యూనిట్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగర పోలీస్ అధికారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి కమిషనర్ అందిస్తున్న సహకారం అభినందనీయమని సంఘం పేర్కొంది. ముఖ్యంగా పోలీసు సిబ్బంది పని పరిస్థితులు మెరుగుపడేలా తీసుకుంటున్న చర్యలకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపింది. నగరంలో శాంతిభద్రతలు పటిష్టంగా నిలబెట్టడంలో కమిషనర్ నాయకత్వం కీలకమని, పోలీసు అధికారుల సంక్షేమం పట్ల చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని సంఘం అభిప్రాయపడింది. భవిష్యత్తులో కూడా పోలీస్ విభాగ అభివృద్ధికి కలిసి పనిచేస్తామని వెల్లడించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం హైదరాబాద్ సిటీ యూనిట్ అధ్యక్షుడు నల్ల శంకర్ రెడ్డితో పాటు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాంపల్లి ఎగ్జిబిషన్ స్టాళ్ల ఎంపికపై విచారించాలి

తెలంగాణజన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సయ్య




ప్రజాపక్షం / ఖైరతాబాద్ : నాంపల్లి ఎగ్జిబిషన్ స్టాళ్ల ఎంపికలో జరిగిన అవకతవకలపై తక్షణమే న్యాయ విచారణ చేపట్టాలని పలువురు స్టాళ్ల నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో స్టాళ్ల నిర్వాహకులు అక్బర్ అలీ, గాంధీ దర్శన్ కార్యదర్శి ప్రసాద్‌తో కలిసి తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సయ్య మాట్లాడారు. జనవరి 1 నుంచి జరిగే నాంపల్లి నుమాయిష్‌లో మొత్తం 3వేలకు పైగా స్టాళ్లు ఏర్పాటుచేస్తే, అధికారిక లెక్కల్లో మాత్రం 2వేల స్టాళ్లు మాత్రమే చూపిస్తున్నారని తెలిపారు. మిగిలిన 1500 స్టాళ్ల ఏ పద్ధతిలో కేటాయిస్తున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక నిరుద్యోగ యువతకు స్టాళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సాధారణంగా స్టాల్‌కు రూ.లక్ష అద్దె ఉంటుందని, కానీ, ఎగ్జిబిషన్ సొసైటీ వారు అదనంగా రెండు, మూడు లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. గాంధీ దర్శన్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉన్న గాంధీ దర్శన్ బిల్డింగ్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ ఆక్రమించుకొన్నదన్నారు. గాంధీజీ వస్తువులను బయటపడేసి, గాంధీ దర్శన్ బిల్డింగ్‌ను కూడా స్టాళ్లకు కేటాయించి, మహాత్మను అవమానించారని వాపోయారు. సమావేశంలో రామచందర్, పలువురు స్టాళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## యావజ్జీవ శిక్ష రద్దు

ప్రజాపక్షం/హైదరాబాద్ : వరకట్న వేధింపుల కారణంగా మహిళ ఆత్మహత్య చేసుకుందంటూ వికారాబాద్ కోర్టు 2018లో ఐదుగురికి విధించిన యావజ్జీవ శిక్షను హైకోర్టు రద్దు చేసింది. మెదక్ జిల్లా మునిపల్లికి చెందిన లక్ష్మి అనే మహిళ 2011లో రూ.2 లక్షలు అదనపు కట్నం చెల్లించాలని భర్త, అత్తమామ, ఆడబడుచు వేధించారంటూ పోలీసు కేసు నమోదైంది. వికారాబాద్ కోర్టు లక్ష్మి భర్త, అత్త మామలు, అడపడుచులకు యావజ్జీవ శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీలుపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ వి.రామకృష్ణారెడ్డి డివిజన్ బెంచ్ విచారించి పైవిధంగా తీర్పు చెప్పింది. ఆత్మహత్యకు ముందు కట్న వేధింపుల అభియోగాలకు ఆధారాలు లేవని చెప్పింది. కనీసం ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు కూడా లేదని చెప్పింది.

# అక్షర జాతరకు పుస్తక ప్రియుల నీరాజనం

ముగిసిన హైదరాబాద్ 38వ బుక్ ఫెయిర్

16 లక్షల సందర్శకులతో సరికొత్త చరిత్ర

రాజ్యాంగాన్ని 'పాకెట్ సైజు'లో సామాన్యులకు అందించాలి

సెల్ ఫోన్ల కంటే పుస్తకాలకే యువత మొగ్గు: జస్టిస్ సుదర్శన్ రెడ్డి

పుస్తక పఠనంలో ప్రపంచ అగ్రగామిగా 'ఇండియా' ఎదగాలి

ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ నగరం నడిబొడ్డున 11 రోజుల పాటు సాగిన అక్షరాల పండుగ 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' రికార్డు స్థాయి సందర్శకులతో కనువిందు చేసి ముగిసింది. బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్ అధ్యక్షతన జరిగిన సోమవారం జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, గౌరవ అతిథిగా తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, అంబేద్కర్ విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కొదండరాం తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యాంగం అందరికీ అందాలి: జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సెల్ ఫోన్లు, సినిమాలకు దూరంగా యువత ఇంత పెద్ద ఎత్తున పుస్తక ప్రదర్శనకు రావడం సమాజంలోని మేధో అంతర్మథనానికి నిదర్శనమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. 38వ హైదరాబాద్ బుక్ ఫేర్ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ భావప్రకటన స్వేచ్ఛకు ఈ వేదిక అద్దం పడుతోందని, గాంధీజీ నుంచి ఆయనను విమర్శించే వారి వరకు అందరి పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉండటం శుభ పరిణామమని కొనియాడారు. భారత రాజ్యాంగాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగులో పాకెట్ సైజు ప్రతిగా ముద్రించి, అతి తక్కువ ధరకు వచ్చే ఏడాది అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిధంగా, వేదికలపై మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

**పుస్తక పఠనంలో ప్రపంచ అగ్రగామిగా ఇండియా ఎదగాలి: ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి**

తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. 'ఆర్థిక రంగంలో కంటే పుస్తక పఠనంలో భారతదేశం ప్రపంచ అగ్రగామిగా ఎదగాలి. వ్యవసాయ, పశుసంవర్ధక పరిశోధనలు రైతులకు అందుబాటులోకి తేవాలి. పుస్తక విరాళాల కార్యక్రమం ఒక గొప్ప సామాజిక ఆశయం' అని పేర్కొన్నారు.

బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్ మాట్లాడుతూ.. 'పుస్తక ప్రదర్శన కేవలం మేళా కాదు, సామాజిక చైతన్య కేంద్రం. యువత అక్షరాల పండుగకు ఇస్తున్న గౌరవం భవిష్యత్తు తరాలకు ఒక గొప్ప సూచిక. 38 ఏళ్ల ఈ ప్ర యాణంలో పాఠకుల ఆదరణ మరువలేనిది' అని పేర్కొన్నారు. బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్(వాసు) మాట్లాడుతూ '11 రోజుల్లో 16లక్షల మందిని ఆకర్షించి పాత రికార్డులను తిరగరాశాం. 450 స్టాళ్లను పారదర్శక లాటరీ పద్ధతిలో కేటాయించాం. సోషల్ మీడియా ద్వారా పాఠకులే ఈ వేడుకను ప్రజల ఉత్సవంగా మార్చారు' అని సంతోషం వ్యక్తం చేశారు.

బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి మాట్లాడుతూ '280 మందికి పైగా కవులు, రచయితలు ఈ వేదికపై మాట్లాడారు. అదే హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు గర్వకారణం. అంతేకాకుండా పల్లెకు పుస్తకం అనే నినాదంతో పుస్తకాలు డొనేషన్లు కోరగా వేల పుస్తకాలు రావడం గొప్ప విషయం' అని తెలిపారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం విసి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ 'విశ్వవిద్యాలయాల పరిశోధనా పత్రాలను ప్రజలకు చేరువ చేయాలి. కేవలం అమ్మకాలే కాకుండా కులతత్వం, మతత్వం వంటి సామాజిక సమస్యలపై లోతైన చర్చలు నిర్వహించి పాఠకులలో అవగాహన కల్పించాలి' అని కోరారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ 'యువత మద్యం, గంజాయి వంటి వ్యసనాలను వీడి పుస్తక పఠనాన్ని వ్యసనంగా మార్చుకోవాలి. తలవంచుకుని పుస్తకం చదివితే సమాజంలో తలెత్తుకుని జీవించే శక్తి లభిస్తుంది' అని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ 'హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను అంతర్జాతీయ స్థాయి 'లిటరరీ ఫెస్టివల్'గా మార్చాలి. జాతీయ మేధావులను ఆహ్వానించి విభిన్న విచారధారలపై పది రోజుల పాటు చర్చలు నిర్వహించాలి' అని పేర్కొన్నారు. రమా మెల్కోటే మాట్లాడుతూ 'ప్రతి ఏటా స్టాళ్ల ఏర్పాటు వ్యయాన్ని తగ్గించేందుకు స్టేడియంలో శాశ్వత కట్టడాలు నిర్మించాలి. విద్యా వ్యవస్థను అకడమిక్ పరంగా అభివృద్ధి చేయడానికి ఈ ఉత్సాహాన్ని ప్రేరణగా తీసుకోవాలి' అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోశాధికారి నారాయణరెడ్డితో పాటు సొసైటీ నిర్వాహకులు, పుస్తక ప్రియులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి 2026-27 వార్షిక బడ్జెట్
# రూ.11,460 కోట్లు





ప్రజాపక్షం/హైదరాబాద్ : మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) స్థాయీ సంఘం 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.11,460 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం స్థాయీసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2026–27 వార్షిక బడ్జెట్‌పై సభ్యులు చర్చించి, ఆమోదం తెలిపారు. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలైన రూ.11,010 కోట్లతో పోలిస్తే స్వల్పంగా మాత్రమే ఎక్కువగా ఉంది. ఈ బడ్జెట్‌లో ఇటీవల కార్పొరేషన్‌లో విలీనం చేసిన కొత్త ప్రాంతాల పరిధిలోని జోన్లకు రూ.2,260 కోట్లను కేటాయించారు. అయితే విలీనాల అనంతరం కూడా కార్పొరేషన్ తన ఆదాయ లక్ష్యాన్ని కేవలం రూ.2,245 కోట్లుగానే నిర్ధారించడం గమనార్హం. ఇది 2024–25లో వసూలైన ఆదాయంతో పోలిస్తే కేవలం 10శాతం మాత్రమే అధికం కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన లక్ష్యంతో పోలిస్తే ఏడు శాతం కన్నా తక్కువ పెరుగుదలగా ఉంది. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా రూ.1,200 కోట్ల ఆదాయం, ఇతర విభాగాల ఆదాయంతో కలిపి మొత్తం బడ్జెట్ ఆదాయాన్ని రూ.4,651 కోట్లుగా అంచనా వేశారు. ఇది ప్రస్తుత సంవత్సరానికి సవరించిన లక్ష్యమైన రూ.4,620 కోట్లతో పోలిస్తే స్వల్ప పెరుగుదల మాత్రమే. మరోవైపు, ఇతర శాఖల నుంచి వచ్చే అసైన్డ్ రెవెన్యూలో భారీగా మూడు రెట్లు పెరుగుదల చూపించారు. ప్రస్తుత సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న రూ.81.4 కోట్లను, కొత్త బడ్జెట్‌లో రూ.330 కోట్లకు పెంచారు. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు ఈ ఏడాది రూ.3,072 కోట్ల నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3,500 కోట్లకు పెంచగా, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను రూ.1,227 కోట్ల నుంచి రూ.719 కోట్లకు తగ్గించారు. వ్యయాల పరంగా చూస్తే, హెచ్– సిటీ కింద చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు అత్యధికంగా రూ.1,340 కోట్లను కేటాయించారు. హెచ్– సిటీ రోడ్లు, రోడ్ల నిర్వహణ, డ్రెయిన్ల విభాగాల కింద మొత్తం రూ.1,050 కోట్ల కేటాయింపులు ఉన్నాయి. అప్పుల సేవల భారం రూ.2,640 కోట్ల నుంచి రూ.2,215 కోట్లకు తగ్గినట్లు బడ్జెట్‌లో వివరించారు. ఇక గృహ నిర్మాణ బడ్జెట్‌ను రూ.150 కోట్ల నుంచి రూ.100 కోట్లకు తగ్గించారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలను కౌన్సిల్ సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు. ఇదిలా ఉండగా, స్థాయిస్థాయి కమిటీ మొత్తం 15అజెండా అంశాలు, ఏడుగురు అదనపు నాన్– అజెండా అంశాలకు కూడా ఆమోదం తెలిపింది. వీటిలో కార్పొరేటర్లు, అధికారులు చండీగఢ్, అహ్మదాబాద్ పర్యటనకు వెళ్లే ప్రతిపాదన కూడా ఉంది. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, స్థాయీ సంఘం సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, బాబా ఫసియుద్దీన్, జగదీశ్వర్ గౌడ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ముగిసిన టిడిపి నేత సాయిబాబా అంత్యక్రియలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలుగుదేశం సికింద్రాబాద్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిన్నమనేని సాయిబాబా సోమవారం అంబర్‌పేట్ గోల్నాకలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. సాయిబాబా అంతిమ యాత్ర ఆయన నివాసం నుండి ప్రారంభమైంది. నందమూరి రామకృష్ణ స్వయంగా పాడే మోసి ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అంతిమ యాత్రలో తెలంగాణ టిడిపి నాయకులు, కార్యకర్తలు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు, ఎన్‌టిఆర్ అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. అలుపెరుగని పోరాట యోధుడిగా, దివ్యాంగుల హక్కుల కోసం కృషి చేసిన నాయకుడిగా పిన్నమనేని సాయిబాబా తెలుగుదేశం పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని నేతలు కొనియాడారు.

**పార్టీ కార్యాలయంలో సందర్శనార్థం పార్థివదేహం**

సోమవారం ఉదయం గంటలకు సాయిబాబా పార్థివదేహాన్ని దోమలగూడలోని తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ బాబు, పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు సాయిబాబా పార్థివదేహంపై పార్టీ జెండాను కప్పి ఘన నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, సి.కృష్ణయాదవ్, మంద కృష్ణ మాదిగ, కాశీనాథ్, జి. కోటేశ్వర్ రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జిల్లా నాయకులు నల్లెల్ల కిషోర్, పి. బాలరాజ్ గౌడ్, నాగు నగేష్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయిబాబాకు నివాళులు అర్పించడానికి టిడిపి నేతలతో పాటు బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌ల యత్నం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ సర్పంచులు తమ పెండింగ్ బిల్లుల కోసం చేపట్టిన 'ఛలో అసెంబ్లీ' ముట్టడి ఉద్రిక్తతలకు దారితీసింది. బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలంటూ అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. తమకు రావాల్సిన రూ.531 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించడంలేదంటూ మాజీ సర్పంచులు ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఆ క్రమంలో కొందరు అసెంబ్లీ వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. తమను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ వారు ఆందోళనకు దిగారు. దీంతో మాజీ సర్పంచులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వారిని అరెస్టు చేసిన పోలీసులు అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌తో పాటు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా ఆందోళన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు శాసనసభ పరిసరాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేసి భారీగా బలగాలను మోహరించారు. ముట్టడికి పిలుపునిచ్చిన మాజీ సర్పంచులను ఇప్పటికే ముందస్తుగా అరెస్టు చేశారు. ముట్టడి సందర్భంగా ఓ మాజీ సర్పంచ్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను పోలీసులు అంబులెన్సులో అక్కడి నుంచి తరలించారు. అసెంబ్లీకి వెళ్లే మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉక్రేన్-రష్యా శాంతి వైపు అడుగులు

శాంతి సాధనకు దగ్గరలో ఉన్నామని జెలెన్‌స్కీతో చర్చల తర్వాత ట్రంప్ ప్రకటన

పామ్‌బీచ్ : ఉక్రేన్–రష్యా శాంతి సాధనకు దగ్గరలో ఉన్నాయని ట్రంప్ ప్రకటించారు. యుద్ధం ముగించేందుకు 20 అంశాల ప్రణాళిక, ఉక్రేన్‌కు భద్రతా హామీలు ఇచ్చే మరో ప్రణాళికపై డోనాల్డ్ ట్రంప్–జెలెన్‌స్కీ మధ్య ఫ్లోరిడాలో రెండున్నర గంటలుపైగా సంభాషణలు జరిగాయి. తర్వాత వారిద్దరూ సోమవారం మీడియాతో మాట్లాడారు. చర్చలు బ్రహ్మాండంగా జరిగాయని నాయకులు ఇద్దరూ ప్రకటించినప్పటికీ భూభాగ సమస్య పరిష్కారంలో పురోగతి కనిపించలేదు. జనవరి నెలలో మరోసారి యూరోపియన్ యూనియన్ నాయకులతో వైట్‌హౌస్‌లో సంభాషణలకు ఆతిథ్యం ఇవ్వడానికి ట్రంప్ అంగీకరించారని జెలెన్‌స్కీ చెప్పారు. ట్రంప్ చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతికి తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్‌కు తెలియజేశారు. ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్‌లో ట్రంప్ సొంత మార్–ఎ–లాగో ఎస్టేట్‌లో ఆదివారం రాత్రి పొద్దుపోయాక వారిద్దరి మధ్యా సంభాషణలు జరిగాయి. పరిష్కారం కాని అంశాల్లో ప్రాదేశిక సమస్య (డాన్‌బాస్ రీజియన్) ప్రధానమైనదని ట్రంప్ చెప్పారు. చర్చల్లో గొప్ప పురోగతి ఉన్నప్పటికీ సంక్లిష్ట సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఉక్రేన్ గనుక అంగీకారం తెలియజేస్తే ఈ వారంలోనే ఒప్పందం కుదురుతుందన్నారు. వారికి పూర్తి భద్రతా హామీలు ఇస్తామన్నారు. ఐతే సమీపగతంలో పలుసార్లు చెప్పిన విధంగానే, ''ఉక్రేన్–రష్యాలు గతంకంటే భిన్నంగా శాంతికి చాలా దగ్గరయ్యాయి'' అని జెలెన్‌స్కీతో చర్చల అనంతరం ఆయన పాత్రికేయులకు చెప్పారు. ప్రాదేశిక సమస్యల పరిష్కారానికి జెలెన్‌స్కీ–పుతిన్ ఇద్దరూ రెండు వైపుల నుండీ వర్కింగ్ గ్రూపులను కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇంతకుముందు ఎప్పుడూ జెలెన్‌స్కీ–ట్రంప్ ఇంత సుదీర్ఘ సమయం ముఖాముఖీ చర్చలు జరపలేదు. ఈ చర్చల తర్వాత వారిద్దరూ యూరోపియన్ యూనియన్ నాయకులతో వీడియో కాన్ఫరెన్సులో కూడా పాల్గొన్ని సంభాషించారు. పుతిన్‌తో కూడా ఫోన్‌లో ట్రంప్ సంభాషణలు జరిపారు. పుతిన్ ఇప్పటికీ శాంతినే కోరుకుంటున్నారని ట్రంప్ మీడియాతో చెప్పారు. జెలెన్‌స్కీతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. యూరప్ నేతలతో గంటసేపు జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉక్రేన్‌కు ఇవ్వాల్సిన భద్రతా హామీల గురించే ఎక్కువగా చర్చించినట్లు యూరోపియన్ యూనియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్ లేయన్ ఎక్స్ వేదికగా తెలియజేశారు. ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, యునైటెడ్ కింగ్డమ్, పోలెండ్ దేశాల నాయకులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రష్యా దగ్గర భూభాగాల గురించి, తిరిగి రష్యా ఉక్రేన్‌పై దాడి చేస్తుందా? అనే విషయాలపైనా వారంతా చర్చించారు. అన్ని అంశాలపైనా తాము ఈసారి చర్చించామని ట్రంప్ చెబుతూ, ప్రాదేశిక సమస్య పరిష్కారం కాలేదని అంగీకరించారు.

**15 ఏళ్ళు సెక్యూరిటీ గ్యారంటీ ఇచ్చిన అమెరికా :జెలెన్‌స్కీ**

ఉక్రేన్‌కు 15 సంవత్సరాలు సెక్యూరిటీ గ్యారంటీని అమెరికా ప్రకటించిందని జెలెన్‌స్కీ చెప్పారు. మార్ ఎ లాగో ఎస్టేట్‌లో రెండున్నర గంటలసేపు చర్చల తర్వాత సోమవారం జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడారు. కానీ తాను మాత్రం కనీసం 50 సంవత్సరాలపాటు ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీలు ఉండాలని ట్రంప్‌ను కోరినట్లు చెప్పారు. ట్రంప్ కూడా మీడియాతో మాట్లాడుతూ, సెక్యూరిటీ గ్యారంటీల విషయంలో 95 శాతం మేరకు ఒప్పందం కుదిరిందన్నారు. సెక్యూరిటీ గ్యారంటీ లభించడం ద్వారా శాంతి ఒప్పందంపై ఉక్రేన్ సంతకం పెట్టడానికి మార్గం ఏర్పడినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు అజెండాలతో జెలెన్‌స్కీ ఫ్లోరిడా వెళ్ళి ట్రంప్‌తో సంభాషణలు జరిపారు. ప్రధానమైన అంశం ఉక్రేన్‌కే సెక్యూరిటీ గ్యారంటీలు కాగా, రెండోది పుతిన్ చిత్రిక పట్టిన 20అంశాలను కూడా ట్రంప్ ముందు ఉంచారు. ఐతే ఈ విషయంలో ఎలాంటి పురోగతీ లేదు.

## ఎలమంచిలి రైల్ ప్రమాదంపై విచారణకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: విజయవాడ డివిజన్ పరిధిలోని విశాఖపట్నం – విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఎలమంచిలి రైల్వే స్టేషన్ వద్ద జరిగిన రైలు అగ్ని ప్రమాదంపై రైల్వే భద్రతా కమిషనర్ చట్టబద్ధమైన విచారణను ప్రకటించారు. రైల్వే అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ నెల 29వ తేదీ అర్ధరాత్రి 12.50 గంటల సమయంలో రైలు నంబర్ 18189 టాటానగర్ – ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.ఈ మేరకు విజయవాడలోని ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఇటిటిసి) లో డిసెంబర్ 31, 2025, జనవరి 1, 2026 తేదీల్లో విచారణ జరగనుంది. దక్షిణ మధ్య సర్కిల్‌కు చెందిన రైల్వే భద్రతా కమిషనర్ శ్రీమతి మాధవి ఈ విచారణను నిర్వహించనున్నారు. అగ్నిప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు లేదా సాక్ష్యం ఇవ్వాలనుకునే ప్రజలు విచారణ తేదీల్లో పేర్కొన్న ప్రదేశంలో స్వయంగా హాజరుకావచ్చని రైల్వే అధికారులు తెలిపారు. అలాగే, రైల్వే భద్రతా కమిషనర్, సౌత్ సెంట్రల్ సర్కిల్, రైల్ నిర్మాణ్ భవన్, సరోజిని దేవి రోడ్ సికింద్రాబాద్ – 500025 చిరునామాకు వ్రాతపూర్వకంగా సమాచారం పంపవచ్చని సూచించారు. అదనపు వివరాల కోసం 040 27820104 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రైవేట్ ఫిర్యాదుపై చర్యలు తీసుకోండి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నాగారంలోని భూదాన్ భూమి అక్రమ బదిలీపై ప్రైవేట్ ఫిర్యాదును చట్ట ప్రకారం పరిష్కరించాలని మేజిస్ట్రేట్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. నాగారంలోని సర్వే నెం.181లో 50 ఎకరాల భూదాన్ భూమిని అక్రమంగా బదిలీ చేశారని అసద్ హుస్సేన్ చేసిన ప్రైవేట్ ఫిర్యాదును కింది కోర్టు తిరస్కరించింది. దీనిని సవాల్ చేస్తూ అసద్ వేసిన పిటిషన్ను జస్టిస్ కె.సుజన సోమవారం విచారించారు. అప్పుడు రెవెన్యూ ముఖ్యకార్యదర్శిగా, భూదాన్ యజ్ఞబోర్డు ఆఫీసర్గా చేసిన ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ ఇతర అధికారులపై ప్రైవేట్ ఫిర్యాదును తిరిగి పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం వెలువరించాలని మేజిస్ట్రేట్ కోర్టుకు ఆదేశాలు జారీ చేశారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ:** ఆరావళీ పర్వతశ్రేణులపై కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ కమిటీ ఇచ్చిన నివేదికను సమ్మతిస్తూ నవంబరు 20వ తేదీన ఇచ్చిన మార్గదర్శకాలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వు జారీ చేయడంపట్ల కాంగ్రెస్‌పార్టీ హర్షం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వును ఆహ్వానిస్తూ, కేంద్ర పర్యావరణమంత్రి భూపేందర్ యాదవ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఆరావళీ పర్వతాలకు కొత్త నిర్వచనం ఇవ్వడాన్ని గట్టిగా సమర్థించిన మంత్రి వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిందని పేర్కొంది. కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ అనిశ్చిత పరిస్థితి మధ్య ఈ తీర్పు ఒక ఆశారేఖగా కనిపించిందన్నారు.100 మీటర్లు ఎత్తు ఉంటేనే పర్వతాలుగా గుర్తిస్తూ కొత్త నిర్వచనం ఇవ్వడం అంతకంటే తక్కువ ఎత్తున్న వాటిల్లో తవ్వకాలు కొనసాగించేందుకు అనుమతులు ఇవ్వడం కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ కమిటీ నివేదికలోని ప్రధానాంశాలు. ఈ అంశాలపై దేశవ్యాప్తంగా దుమారం రేగింది. పర్యావరణానికి ముప్పు వస్తుందని విమర్శలు వచ్చాయి.

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు




### విమాన, రైలు సేవలపై ప్రభావం.. రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండి

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని ప్రమాదకరమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. అతిసమీపంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీవ్ర పొగ మంచు నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఢిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ఫాగ్ లైట్లను ఉపయోగించాలని సూచించింది. అత్యవసర పరిస్థితి ఉంటేనే బయటకు రావాలని హెచ్చరించింది. పొగ మంచు కారణంగా విజిబిలిటీ పడిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే దాదాపు 128 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. అందులో 64 అరైవల్స్ కాగా, 64 డిపార్చర్స్ ఉన్నాయి. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు విమాన స్టేటస్‌ను చెక్‌చేసుకోవాలని సూచించింది. మరోవైపు విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. మరోవైపు.. పలు రైళ్లు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జన శతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. నగరంలో ఓవరాల్ ఎక్యూఐ లెవెల్స్ 402గా నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపింది. నగరంలోని 40 ఎయిర్ మానిటరింగ్ కేంద్రాల్లోని 25 కేంద్రాల్లో ఇవాళ ఉదయం 7 గంటలకు గాలి నాణ్యత సూచిక తీవ్రమైన కేటగిరీలో నమోదైంది. వివేక్ విహార్‌లో అత్యధికంగా 460గా నమోదైంది. ఆనంద్ విహార్ (459), రోహిణి (445), వజీర్‌పూర్‌లో 444గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి.

# సెంగార్‌ను విడుదల చేయొద్దు

- ఉన్నావ్ అత్యాచార కేసులో దోషికి సుప్రీం షాక్
- జీవిత ఖైదు నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే
- సిబిఐ పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలని సెంగార్‌కు నోటీసు



**న్యూఢిల్లీ:** ఉన్నావ్ అత్యాచార కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బహిష్కృత బిజెపి నాయకుడు కుల్దీప్ సింగ్ సెంగార్‌కు విధించిన జీవిత ఖైదును నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. అతడిని కస్టడీ నుండి విడుదల చేయవద్దని పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్, జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ విషయంలో పరిగణించాల్సిన ముఖ్యమైన న్యాయపరమైన ప్రశ్నలు తలెత్తాయని పేర్కొంది. సిబిఐ పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలని కోరుతూ సుప్రీంకోర్టు సెంగార్‌కు నోటీసు కూడా జారీ చేసింది. సాధారణంగా ట్రయల్ కోర్టు లేదా హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు దోషి లేదా విచారణలో ఉన్న వ్యక్తికి బెయిల్ మంజూరు చేసినప్పుడు, ఆ వ్యక్తి వాదన వినకుండా అటువంటి ఉత్తర్వులపై తాము స్టే విధించబోమనే విషయం తమకు తెలుసని బెంచ్ పేర్కొంది. సెంగార్ వేరే కేసులో కూడా దోషిగా నిర్ధారించబడి, శిక్షించబడ్డాడని, ఆ కేసులో ఇంకా కస్టడీలోనే ఉండడాన్ని గమనంలోకి తీసుకుంది. 'ఈ కేసులోని ప్రత్యేక పరిస్థితులలో హైకోర్టు ఈనెల 23న జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వు అమలుపై మేము స్టే విధిస్తున్నాము. పర్యవసానంగా, సదరు ఉత్తర్వు ప్రకారం ప్రతివాది (సెంగార్)ని కస్టడీ నుండి విడుదల చేయరాదు' అని బెంచ్ పేర్కొంది. ఈ విషయంలో తమ పరిశీలన కోసం అనేక ముఖ్యమైన న్యాయపరమైన ప్రశ్నలు తలెత్తాయని సుప్రీంకోర్టు తెలిపింది. సిబిఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, మైనర్ బాలికపై జరిగినది 'భయంకరమైన అత్యాచారం' అని పేర్కొంటూ హైకోర్టు ఉత్తర్వుపై స్టే విధించాలని బెంచ్‌ను కోరారు. ఈ సందర్భంలో ఈ ఉత్తర్వుపై స్టే విధించాలని మన స్నాక్షిని కోరుతున్నానని, 15 సంవత్సరాల 10 నెలల వయస్సు ఉన్న ఆ బాలికకు తాము జవాబుదారీగా ఉండాలని ఉన్నత న్యాయాధికారి అన్నారు. ఢిల్లీ హైకోర్టు 23 నాటి ఉత్తర్వులో సెంగార్ పోక్సో చట్టంలోని సెక్షన్ 5 (సి) (ప్రభుత్వ ఉద్యోగిచే తీవ్రమైన లైంగిక దాడి) కింద దోషిగా నిర్ధారించబడినప్పటికీ, ఎన్నికైన ప్రతినిధి ఐపిసిలోని సెక్షన్ 21 ప్రకారం 'ప్రభుత్వ ఉద్యోగి' నిర్వచనంలోకి సరిపోరని పేర్కొంది. బాధితురాలు మైనర్ అయినప్పుడు ప్రభుత్వ ఉద్యోగి అనే భావన పూర్తిగా అసంబద్ధమైనది, అప్రస్తుతమైనది అని వాదించడమే మీ వాదననా?' అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి సానుకూలంగా స్పందిస్తూ, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టంలో ప్రభుత్వ ఉద్యోగి అనే పదానికి నిర్వచనం ఇవ్వలేదని మెహతా అన్నారు. ఈ చట్టంలోని నిబంధనలు ప్రస్తుతం అమలులో ఉన్న ఇతర చట్టాల నిబంధనలకు అదనంగా ఉంటాయని, వాటికి విరుద్ధంగా ఉండవని, ఏదైనా వైరుధ్యం తలెత్తితే పోక్సో నిబంధనలే చెల్లుబాటు అవుతాయని చెప్పే పోక్సో చట్టంలోని సెక్షన్ 42 ఎని కూడా ఆయన ప్రస్తావించారు. సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్, ఇతర న్యాయవాదులతో కలిసి సెంగర్ తరపున హాజరై, హైకోర్టు ఉత్తర్వుపై స్టే కోరుతూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఈ విషయంపై పరిశీలన అవసరమని మాత్రమే తాము చెబుతున్నామని ధర్మాసనం పేర్కొంటూ, సెంగర్ న్యాయవాదులు చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని, వాటిపై లోతైన పరిశీలన అవసరమని తెలిపింది.

### దోషికిఉరిశిక్ష పడేంత వరకు విశ్రమించను : బాధితురాలు

కుల్దీప్ సెంగార్ జీవిత ఖైదును నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించడం పట్ల ఉన్నావ్ అత్యాచార బాధితురాలు సంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి ఉరిశిక్ష పడే వరకు విశ్రమించను అని పేర్కొన్నారు. 'సుప్రీంకోర్టు నిర్ణయంతో నేను చాలా సంతోషంగా ఉన్నాను. నాకు సుప్రీంకోర్టు నుండి న్యాయం లభించింది. నేను మొదటి నుండి న్యాయం కోసం నా గళం వినిపిస్తున్నాను' అని బాధితురాలు ఢిల్లీ నుండి ఫోన్‌లో పిటిఐకి తెలిపారు. 'నేను ఏ కోర్టు పైనా ఎలాంటి ఆరోపణలు చేయడం లేదు. నాకు అన్ని కోర్టులపై నమ్మకం ఉంది, కానీ సుప్రీం కోర్టు నాకు న్యాయం చేసింది. భవిష్యత్తులో కూడా చేస్తుంది' అని ఆమె అన్నారు. దోషి కుల్దీప్‌కు ఉరిశిక్ష పడే వరకు విశ్రమించనని, తాను పోరాడుతూనే ఉంటానన్నారు. అప్పుడే నాకు, నా కుటుంబానికి న్యాయం జరుగుతుందని, నేటికీ తనకు బెదిరింపులు వస్తునే ఉన్నాయని చెప్పారు. బాధితురాలి తల్లి ఈ ఊరట కల్పించినందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. తన భర్తను చంపిన వారికి మరణశిక్ష విధించాలని విలేకరులతో అన్నారు. ఈ ఉత్తర్వుపై స్పందిస్తూ సామాజిక కార్యకర్త యోగితా భయానా మాట్లాడుతూ ఈ ఉత్తర్వుకు విస్తృతమైన పరిణామాలు ఉన్నాయన్నారు. ఇది కేవలం ఒక బాధితురాలి పోరాటం కాదు, ఇది అమ్మాయిలందరి పోరాటం. సాధారణంగా స్టేలు మంజూరు చేయనప్పటికీ, ఈ కేసు భిన్నమైనది అని సుప్రీంకోర్టు స్వయంగా పేర్కొందని ఆమె అన్నారు.

# ఒక్కటైన బాబాయ్... అబ్బాయ్..

- పుణె, పింప్రి-చింద్వాడ మున్సిపల్ ఎన్నికలకు అజిత్ నేతృత్వంలోని ఎన్‌సిపితో శరద్ పవార్ పార్టీ పొత్తు



**పుణె:** మహారాష్ట్రలో స్థానిక ఎన్నిల వేళ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రానున్న పుణె మున్సిపల్ ఎన్నికల కోసం మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపితో తమ పార్టీ పొత్తు పెట్టుకుంటుందని ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు రోహిత్ పవార్ సోమవారం ప్రకటించారు. ఎన్నికల్లో ప్రత్యర్థి వర్గంతో కలిసి వెళ్లాలని పార్టీ కార్యకర్తలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. పింప్రి–చింద్వాడ మున్సిపల్ కోసం రెండు వర్గాల మధ్య పొత్తు కుదిరినట్లు అజిత్ పవార్ ఆదివారం ప్రకటించారు. 'ఎన్‌సిపి (ఎస్‌పి) నగర అధ్యక్షుడు ప్రశాంత్ జగతాప్ పార్టీ నుండి నిష్క్రమించిన తర్వాత, చాలా మంది కార్యకర్తలు వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే వద్దకు వచ్చి రెండు వర్గాలు కలిసి ముందుకు సాగాలని చెప్పారు. స్థానిక పార్టీ కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని పొత్తుపై ఈ నిర్ణయం తీసుకున్నాం' అని రోహిత్ పవార్ అన్నారు. రెండు వర్గాలకు ఎన్నికల పోరు సులభతరమయ్యేలా ఈ పొత్తు కుదిరిందని, ప్రస్తుతానికి పుణె, పింప్రి–చింద్వాడ మున్సిపల్ ఎన్నికలలో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ఆయన చెప్పారు.'(శరద్) పవార్ సాహెబ్ ఈ నిర్ణయంలో పాలుపంచుకోలేదు. అయితే, పార్టీ కార్యకర్తలు ముఖ్యమని, మున్సిపల్ ఎన్నికల విషయంలో వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన నమ్ముతారు' అని పార్టీ ప్రధాన కార్యదర్శి అన్నారు.సీట్ల పంపకాల ఫార్ములా కూడా ఖరారైందని, అయితే దాని గురించి ఆయన వివరంగా చెప్పలేదని తెలిపారు. పుణె, పింప్రి–చింద్వాడ మున్సిపల్ కార్పొరేషన్లతో సహా మహారాష్ట్రలోని 29 మున్సిపల్ సంస్థలకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మరుసటి రోజు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ డిసెంబర్ 30.

# 33 మంది బిఎల్‌ఒల మృతి పర్వాలేదా?

### కేంద్ర ప్రభుత్వంపై రాజ్యసభ ఎంపి వ్యంగ్యాస్త్రాలు



**న్యూఢిల్లీ :** దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎస్‌ఐఆర్ ప్రక్రియలో నిమగ్నమైన బూత్ స్థాయి అధికారుల మరణాలకు సంబంధించి రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ సోమవారం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఒక ఆరోపిత 'చొరబాటుదారుడి' ఉనికి సరికాదు, కానీ బిఎల్‌ఒల మరణాలు ఫర్వాలేదా అని ఆయన ప్రశ్నించారు.పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లాలో ఒక బూత్ స్థాయి అధికారి (బిఎల్‌ఒ) మృతదేహం లభించిన మరుసటి సిబల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)కు సంబంధించిన పని ఒత్తిడి ఈ మరణానికి కారణమై ఉండవచ్చని ఆరోపణలు వెల్లువెత్తాయి. 'బెంగాల్‌లో మరో బిఎల్‌ఒ ఆత్మహత్య. దేశవ్యాప్తంగా మొత్తం: 33. ఒక ఆరోపిత 'చొరబాటుదారుడు' ఉంటే అది సరి కాదు. మరి 33 మంది బిఎల్‌ఒలు చనిపోతే అది ఫర్వాలేదా?' అని సిబల్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. గత నెలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ దేశం నుండి చొరబాటుదారులను ప్రభుత్వం బయటకు పంపిస్తుందని, చొరబాటుదారుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండాలని కోరుకుంటున్నందున కొన్ని రాజకీయ పార్టీలు ఎస్‌ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. తాజాగా బిఎల్‌ఒ మరణం పశ్చిమ బెంగాల్‌లోని రాణిబంధ్ బ్లాక్‌లో జరిగింది. ఆదివారం ఉదయం హరధన్ మండల్ మృతదేహం ఒక పాఠశాల ప్రాంగణంలో లభ్యమైంది. సంఘటనా స్థలంలో ఒక సూసైడ్ నోట్ లభించిందని పోలీసులు తెలిపారు. 'మండల్ ఒక పాఠశాల ఉపాధ్యాయుడు. రాణిబంధ్ బ్లాక్‌లోని రాజకట ప్రాంతం పరిధిలోని బూత్ నెం. 206కు బిఎల్‌ఒగా పనిచేశారు' అని ఒక పోలీసు అధికారి తెలిపారు. మృతుడి సంతకంతో ఉన్న ఒక లేఖ ఘటనా స్థలంలో లభించింది. అందులో అతను బిఎల్‌ఒగా పని ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నట్లు పేర్కొన్నట్లు సమాచారం.

### రాష్ట్రాల్లో మతహింసలు జరిగితే...

# ఆపేందుకు కేంద్రం ఒత్తిడి తేవాలి

### జాతీయ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సూచన

**శ్రీనగర్ :** రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో మత హింస ఘటనలు జరిగినప్పుడు వాటిని ఆపడానికి కేంద్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని జాతీయ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సూచించారు. ఇలాంటి ఘటనలను ఆపాలని రాష్ట్రాలకు చెప్పడం కేంద్రం కర్తవ్యమని శ్రీనగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో అబ్దుల్లా విలేకరులతో అన్నారు. జమ్ముకశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలో మసీదు, మదర్సాపై రాళ్ల దాడి జరిగిందనే ఆరోపణల ఘటనపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'సమాజంలో దుర్మార్గులు ఉన్నారు, వారు ఎప్పుడూ ఉంటారు. భారతదేశం ఒక లౌకిక దేశమని, రాజ్యాంగం అన్ని మతాల ప్రజలకు తమ మతాన్ని ఆచరించే హక్కును కల్పిస్తుందని మేము కేంద్రాన్ని పదేపదే కోరాము' అని ఆ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. బంగ్లాదేశ్‌లోని పరిస్థితిపై స్పందిస్తూ, పొరుగు దేశంలో శాంతియుత ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. 'మాకు శాంతి, స్నేహం, సౌభ్రాతృత్వం కావాలి. (ఢాకాలో) కొత్త ప్రభుత్వం భారత దేశంతో స్నేహానికి కొత్త మార్గాన్ని కనుగొంటుందని నేను ఆశిస్తున్నాను' అని ఆయన అన్నారు. రానున్న కొత్త సంవత్సరం ప్రజలకు గత సంవత్సరం కంటే మెరుగ్గా ఉండాలని అబ్దుల్లా ప్రార్థించారు. 'మన సమస్యలు తీరి, శాంతి, పర్యాటకం వర్ధిల్లుతాయని ఆశిస్తున్నాను' అని అన్నారు.

# విభేదాలు పక్కనపెట్టండి

### శివసేన (యుబిటి)తో కలిసి ఐక్యంగా పనిచేసి ముంబయిని కాపాడుకోవాలని కార్యకర్తలకు రాజ్ థాకరే దిశా నిర్దేశం




**ముంబయి :** ముంబయిని కాపాడటానికి విభేదాలను పక్కనపెట్టి శివసేన (యుబిటి)తో కలిసి ఐక్యంగా పనిచేయాలని మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ థాకరే సోమవారం తన పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. జనవరి 15న జరగనున్న ముంబయి మున్సిపల్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల కూటమి విజయం సాధించేలా చూడాలని కోరారు. రంగశారద ఆడిటోరియంలో సోమవారం రాజ్ థాక్రే పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కొందరు ముంబయిని మహారాష్ట్ర నుండి వేరు చేయాలనే కలలు కంటున్నారని, దాని కోసం ప్రణాళికలు కూడా రచిస్తున్నారని ఆరోపించారు. ముంబయిని విడదీయాలనే ఈ కలను నాశనం చేయాలని, ముంబయి మరాఠీ మనుషులది, మహారాష్ట్రదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నిక మరాఠీ మనుషులకు చాలా కీలకమని, మహారాష్ట్ర కంటే పెద్ద పోరాటం మరొకటి లేదని పార్టీ నాయకుడు బాలా నందగావ్కర్ థాక్రే మాటలను ఉటంకిస్తూ అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికలలో ప్రతి సీటు ముఖ్యమైనది కాబట్టి పార్టీ కార్యకర్తలు కూటమి ధర్మాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. 'ముంబయిని కాపాడటానికి మీ విభేదాలను పక్కన పెట్టండి. పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) అభ్యర్థుల ప్రచారంలో పాల్గొనాలి. దానికి ప్రతిఫలంగా శివసేన (యుబిటి) కూడా అదే విధంగా సహకరిస్తుంది' అని రాజ్ థాక్రే తెలిపారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) కూడా ఈ కూటమిలో భాగమవుతుందన్నారు. పార్టీ అధికారిక అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి అవసరమైన ఎబి ఫారాలను సోమవారం పంపిణీ చేస్తామని నందగావ్కర్ తెలిపారు. కొన్ని వార్డుల కోసం చివరి నిమిషంలో చర్చలు ఇంకా జరుగుతున్నాయని నందగావ్కర్ చెప్పారు. కూటమి ఏర్పాటు కారణంగా నామినేషన్ దక్కనందుకు పార్టీ కార్యకర్తలు నిరాశ చెందారని అంగీకరించిన నందగావ్కర్, వారు నిరుత్సాహపడకూడదని, ఇది చివరి ఎన్నిక కాదని అన్నారు.

### హిందీ మాట్లాడుతున్నదని.. కుమార్తెను హత్య చేసిన తల్లి

**ముంబయి :** మాతృభాషలో కాకుండా హిందీలో కుమార్తె మాట్లాడటంపై తల్లి ఆగ్రహించింది. ఈ నేపథ్యంలో ఆ చిన్నారి గొంతునొక్కి హత్య చేసింది. తొలుత గుండెపోటుతో ఆ బాలిక మరణించినట్లుగా నమ్మించేందుకు తల్లి ప్రయత్నించింది. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్‌లో ఈ సంఘటన జరిగింది. గురుసంకల్ప్ హౌసింగ్ సొసైటీలో నివసిస్తున్న 30 ఏళ్ల మహిళకు ఆరేళ్ల కుమార్తె ఉన్నది. ఆ చిన్నారికి చిన్నప్పటి నుంచి మాటలకు సంబంధించిన సమస్య ఉన్నది. ఈ నేపథ్యంలో ఆ బాలిక మరాఠీ బదులు ఎక్కువగా హిందీలో మాట్లాడుతున్నది. కాగా, బాలిక తల్లి దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పలుమార్లు భర్తకు ఫిర్యాదు చేసింది. మరాఠీ బదులు హిందీలో మాట్లాడుతున్నదన్న హత్య చేసేందుకు ప్లాన్ వేసింది.

# ఆరావళీపై పాత మార్గదర్శకాలు నిలిపివేత

### ఉన్నతస్థాయీ నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు ప్రతిపాదన





**న్యూఢిల్లీ:** ఆరావళీ పర్వత శ్రేణులకు నిర్వచనం ఇచ్చే వివాదంపై గతనెల ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 'నియంత్రణ లోపాలు' నివారించడంకోసం ఈ విషయంలో తదుపరి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యానగల సుప్రీంకోర్టు ధర్మాసనం (వెకేషన్) సోమవారం తన తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. నియంత్రణ లోపాల దర్యాప్తు , పూర్తిస్థాయీ విశ్లేషణ నిమిత్తం ఉన్నతస్థాయీ అధికారాలుగల ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ధర్మాసనం ప్రతిపాదించింది. ఆరావళీ పర్వతశ్రేణుల సమగ్రతను, విస్తారమైన ఏకీకృత పర్వతాలలో ఉన్న జీవవైవిధ్యాన్ని రక్షించడంలో ఒకవేళ ఇంతకుముందు కమిటీ నివేదికలో ఏమైనా నైతికనిష్ఠ లోపాలు ఉన్నాయా? అనే విషయాన్ని ధృవీకరించుకుని ఒక స్పష్టతకు వచ్చేందుకు వీలుగా తదుపరి దర్యాప్తు అవసరమని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది.

కొన్ని కీలకమైన సమస్యలపై ఒక స్పష్టత తీసుకోవడంకోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. 2024 మే తొమ్మిదో తేదీన సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వు జారీ చేసింది. దాని ప్రకారం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ ఆరావళీ పర్వత శ్రేణులలో గనుల తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని నాటి ఉత్తర్వులో ఆదేశించింది. 2010 సంవత్సరం ఆగస్టు 25వ తేదీన ఎఫ్ఎస్ఐ ఒక నివేదిక ఇచ్చింది. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి తవ్వకాలకు అనుమతి ఇవ్వకూడదని ఆ నివేదిక నిర్వచించింది. ఈ నివేదిక అంశాలకు అనుగుణంగా సుప్రీంకోర్టు ఆనాడు ఉత్తర్వులు ఇచ్చింది. కమిటీ నివేదికను లేదా నవంబరు 20వ తేదీన ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేసే ముందుగా న్యాయబద్ధమైన, నిష్పక్షపాతమైన,స్వతంత్ర నిపుణుల అభిప్రాయాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని, ఆ తర్వాత సంబంధిత ప్రముఖులతో మంతనాలు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆరావళీ పర్వతశ్రేణులను సంరక్షించాల్సిన అవసరం ఉందని, వాటిని పలు రూపాల్లో కరిగించేస్తే తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పర్వశ్రేణులకు తప్పుడు నిర్వచనం ఇవ్వకూడదని, కొత్తగా ఇచ్చిన నిర్వచనాన్ని అమలు చేయడంలో తప్పుడు పద్ధతులు అనురించకూడదని ఈ కోర్టు ఆదేశిస్తున్నది'' అని ధర్మాసనం తాజా ఉత్తర్వులలో పేర్కొంది. న్యాయస్థానం జారీ చేసిన మార్గదర్శకాలు, కొన్ని నిబంధనలలో స్పష్టత కొరవడిందని, సందిగ్ధత ఉందని దీనివల్ల ప్రజల నుండి అసమ్మతి, విమర్శలు కనిపించిని పేర్కొంది. అందువల్ల నియంత్రణకు సంబంధించి లోపాలను సవరించేందుకు, ఆ లోపాలను నివారించేందుకు, ఒకవేళ ఆరావళీ పర్వతాలలో ఉన్న జీవజాల వైవిధ్యాన్ని కాపాడే అంశంలో ఉన్న తీవ్రతను తక్కువచేసి చూపించారా? అనే విషయంలో స్పష్టత తీసుకునేందుకు తదుపరి దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. వాయువ్య భారత్‌లోని నాలుగు రాష్ట్రా(ఢిల్లీ, హర్యానా,రాజస్థాన్,గుజరాత్)లలో 670 కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఆరావళీ పర్వత శ్రేణులకు ఏకీకృత నిర్వచనాన్ని సమ్మతించేందుకు నవంబరు 20వ తేదీన సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఐతే తదుపరి దర్యాప్తు పేరుతో తన ఉత్తర్వులను తానే తాజాగా నిలిపివేసింది. 100 మీటర్ల ఎత్తు, ఈ పర్వతశ్రేణుల మధ్య ఉన్న 500 మీటర్ల ఖాళీ పల్లపు ప్రాంతాన్ని కొలమాన ప్రాతిపదికగా తీసుకోవడాన్ని ''కీలకమైన సందిగ్ధత''లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు ఈ ధర్మాసనంలో జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లు సభ్యులుగా ఉన్నారు. ఈ పర్వతశ్రేణుల మధ్య ఉన్న పల్లపు ప్రాంత ఖాళీ ప్రదేశం పర్యావరణ రక్షణకు అత్యంత కీలకమైన ప్రాముఖ్యాంశంగా ఉంది. నవంబరు 20వ తేదీన సుప్రీంకోర్టు ఆరావళీ పర్వత శ్రేణుల్లో కొత్తగా గనుల తవ్వకాలకు లీజులను రద్దు చేసింది. నిపుణుల కమిటీ వచ్చే వరకూ ఢిల్లీ,హర్యానా,రాజస్థాన్, గుజరాత్ లలో ఉన్న శ్రేణులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. ప్రపంచంలో అత్యంత పురాతనమైన ఆ రావళీ పర్వతశ్రేణుల వ్యవస్థను సంరక్షించడానికి ని ర్వచనాన్ని మార్పు చేసేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ కమిటీ ఇచ్చిన సిఫార్సులను తొలుత సుప్రీంఆమోదించింది.

### 'మకరవిళక్కు'కు నేడు తెరుచుకోనున్న

# శబరిమల ఆలయం



**శబరిమల :** కేరళ శబరిమలలోని ప్రసిద్ధ అయ్యప్ప ఆలయం వార్షిక మకరవిళక్కు ఉత్సవం నిమిత్తం నేటి సాయంత్రం తెరుచుకోనున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టిడిబి) సోమవారం తెలిపింది. రెండు నెలలకు పైగా సాగే తీర్థయాత్ర కాలానికి ముగింపు పలికే పవిత్రమైన 'మకరవిళక్కు' వేడుక 2026 జనవరి 14న జరగనుంది. అయితే ఆలయం మంగళవారం తెరుచుకుంటుందని, తంత్రి (ప్రధాన పూజారి) మహేష్ మోహనారు సమక్షంలో 'మేల్శాంతి' (ప్రధాన అర్చకుడు) ఇడి ప్రసాద్ గర్భగుడిని తెరుస్తారని టిడిబి ఒక ప్రకటనలో తెలిపింది. సన్నిధానంలోని అళి (పవిత్ర అగ్ని) వద్ద అగ్ని వెలిగించిన తర్వాత, భక్తులను దర్శనం కోసం పవిత్రమైన పద్దెనిమిది మెట్లు (పదునెట్టాంబడి) ఎక్కడానికి అనుమతిస్తారు. 41 రోజుల పాటు జరిగిన మండల పూజలు ముగిసిన తర్వాత, సాంప్రదాయబద్ధంగా 'హరివరాసనం' (అయ్యప్ప స్వామి జోల పాట) ఆలపించిన అనంతరం ఈనెల 27వ తేదీ రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. శబరిమలలో అత్యంత ముఖ్యమైన వార్షిక ఉత్సవాలలో ఒకటైన మకరవిళక్కు పండుగకు ప్రతి సంవత్సరం దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. వార్షిక మకరవిళక్కు ఉత్సవానికి సన్నాహాల్లో భాగంగా, వివిధ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సేవకుల భాగస్వామ్యంతో శబరిమల, దాని పరిసర ప్రాంతాలలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టామని టిడిబి తెలిపింది. సోమవారం ప్రారంభమైన ఈ పారిశుద్ధ్య కార్యక్రమాలను పోలీసులు, ఎక్సైజ్, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు, పారిశుధ్య స్వచ్ఛంద సేవకులైన విశుద్ధి సేన సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

ప్రజాపక్షం
మంగళవారం, 30 డిసెంబరు

# 'ఆరావళీ'కి ఊరట

ఆరావళీ వివాదంపై సుప్రీం కోర్టు తన గత ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయడం హర్షణీయం.. ఆహ్వానించదగిన పరిణామం. సుప్రీంకోర్టు స్వయంచాలకంగా ఈ అంశాన్ని పరిశీలనకు తీసుకుని, తన స్వంత ఆదేశాలనే నిలిపివేసి, ప్రభుత్వాన్ని మళ్లీ పునఃపరిశీలన చేయమని చెప్పడం శుభకరం. ఆరావళీ పర్వత శ్రేణులకు ఒకే విధమైన నిర్వచనాన్ని అంగీకరిస్తూ నవంబర్ 20న ఇచ్చిన తీర్పులోని ఆదేశాలు అమలులోకి రాకుండా నిలిపివేయడం ఊరటనిచ్చే అంశం. ఈ అంశాన్ని సమగ్రంగా, లోతుగా అధ్యయనం చేయడానికి నిపుణులతో కూడిన ఒక హైపవర్డ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం కూడా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న పర్యావరణవాదులకు ఉపశమనమిచ్చింది. పరిపాలనా వైఫల్యం, పాలనలో లోపాల ఫలితంగానే ఆరావళీ పర్వత శ్రేణుల్లో గనుల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. కొత్త లీజులను కేంద్రం రద్దు చేసినప్పటికీ, ఇప్పటికే కుదిరిన ఒప్పందాలను అడ్డుపెట్టుకొని, విచ్చలవిడిగా పర్వత శ్రేణులను తొలిచేయడం అత్యంత ప్రమాదకరం. దేశ అత్యున్నత న్యాయ స్థానం పరిస్థితి తీవ్రతను గుర్తించి, కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కోవడం సంతోషకరం. అయితే, ఈ కమిటీలో కేవలం అధికారులు మాత్రమే కాకుండా పర్యావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణవాదులు కూడా తప్పనిసరిగా ఉండాలి. లేకపోతే, పర్యావరణం మీద రాజకీయమే గెలిచే ప్రమాదం ఉంది. కమిటీ నివేదిక ఇచ్చే వరకూ ఆరావళీలో అన్ని రకాల గనుల తవ్వకాలను పూర్తిగా నిలిపివేయాలి. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ వ్యవస్థపై జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి స్వతంత్రమైన, సమగ్ర పర్యావరణ–సామాజిక ప్రభావ అంచనా అధ్యయనం జరగాలి. ఒప్పందాలను అడ్డుపెట్టుకొని రియల్ ఎస్టేట్, మైనింగ్ లాబీలు ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ, ఆరావళీ శ్రేణుల భౌగోళిక లక్షణాలకు స్పష్టమైన నిర్వచనం ఇవ్వకపోవడం గమనార్హం. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ కమిటీ సిఫారసుల మేరకు, స్థానిక భూమి మట్టానికి 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న భూభాగాన్ని ఆరావళీ కొండగా, 500 మీటర్ల పరిధిలో రెండు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తుగల కొండలను అరావళీ పర్వత శ్రేణిగా నిర్వచించాలని సూచించడం ముమ్మాటికీ వివాదాస్పదమే. శాస్త్రీయ అధ్యయనంగానీ, నిపుణులతో సంప్రదింపులుగానీ, ప్రజాభిప్రాయంగానీ లేకుండా ఈ కొత్త నిర్వచనం ఖరారు చేయడం దుర్మార్గం. దాని వల్ల హర్యానా, రాజస్థాన్, గుజరాత్‌లోని విస్తారమైన.. అత్యంత సున్నితమైన ఆరావళీ శ్రేణుల్లో గనుల తవ్వకాలకు రాచమార్గం ఏర్పడుతుంది. పర్యావరణ, శాస్త్రీయ, సామాజిక కోణాల్లో వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడం కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలకు, ఒంటెత్తు పోకడలకు నిదర్శనం. ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త నిర్వచనం సంకుచితంగా, యాంత్రికంగా ఉంది. కొండల ఎత్తు.. వాటి మధ్య దూరాలను సంఖ్యాత్మక ప్రమాణాలకే పరిమితం చేయడం వల్ల ఆరావళీల సహజ స్వరూపం అందులో ప్రతిబింబించడం లేదు. ఆరావళీ కేవలం కొండల సమాహారం మాత్రమే కాదు.. ఒక విస్తృతమైన పర్యావరణ వ్యవస్థ కూడా. ఈ నిర్వచనం వల్ల ఆరావళీ శ్రేణుల్లోని అనేక లోతట్టు ప్రాంతాలు, అడవులు, వాగులు, జీవవైవిధ్య ప్రాంతాలు పర్వతాల పరిధి నుంచి బయటపడతాయి. అదే జరిగితే, ఆరావళీ పర్వతాలు చట్టపరమైన రక్షణ కోల్పోయి, గనుల తవ్వకాలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, పరిశ్రమలకు సులభంగా అందుబాటులోకి వస్తాయి. రాజకీయ పార్టీలతోగానీ, పర్యావరణ సంస్థలతోగానీ చర్చించలేదు. సామాజిక కార్యకర్తల అభిప్రాయాలు సేకరించలేదు. నిపుణులను సంప్రదించలేదు. అభిప్రాయాలు సేకరించలేదు. సమీక్షించలేదు. లోతైన అధ్యయనం అసలే లేదు. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా, ప్రజాస్వామిక విధానాలు అనుసరించకుండా, ఆరావళీని కొత్తగా నిర్వచించడానికి పూనుకోవడం మోదీ ప్రభుత్వ అహంభావానికి పరాకాష్ట. ఇది పరిపాలనా నిర్ణయంలా కనిపిస్తున్నదే తప్ప, శాస్త్రీయత లేదు. నీటి నిల్వలు, భూగర్భజలాల పునరుత్పత్తి, వాతావరణ సమతుల్యత, ఎడారీకరణ నివారణ వంటి అనేక విధాలుగా ఉపయోగపడుతున్న ఆరావళీ పర్వతాలు ఈ కొత్త నిర్వచనం అమలైతే, పెద్దఎత్తున దెబ్బతింటాయి. బలహీనపడతాయి. ఫలితంగా ఉత్తర భారతదేశంలో పర్యావరణ అసమానత పెరిగే ప్రమాదం ఉంది. మైనింగ్, రియల్ ఎస్టేట్ లాబీల ప్రయోజనాలు ప్రభుత్వ ప్రతిపాదనల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆరావళీ శ్రేణుల పరిధిని 'నిర్వచనం' పేరుతో కుదించడం వల్ల మాఫియాకు చట్టపరమైన అడ్డంకులు తగ్గి, పెద్ద ఎత్తున గనుల తవ్వకాలకు మార్గం ఏర్పడుతుంది. అశాస్త్రీయమైన, ఏకపక్షమైన, ప్రజామోదం లేని ఆరావళీ కొత్త నిర్వచనాన్ని కేంద్రం వెంటనే రద్దు చేసుకోవాలి. సుప్రీం కోర్టు నుంచి ఈ దిశగా విస్పష్టమైన ఆదేశాలు వెలువడతాయని ఆశిద్దాం.

# నెహ్రూ, గాంధీలపై మోదీ వ్యూహం బెడిసికొట్టింది

**ప్రభు చావ్లా**

> నెహ్రూ, గాంధీలను సమాధి చేసే ప్రయత్నంలో బిజెపి వారిని పునరుజ్జీవింపజేసింది. అంతిమంగా, భారతదేశం ఆరోహణ చరిత్రను చెరిపివేయటాన్నిగాక సమ్మిళితం చేయటాన్ని డిమాండ్ చేస్తున్నది – గాంధీ నీతి సూత్రాలను, నెహ్రూ సంస్థాగత దార్శనికతను, మోదీ పరిపాలనా శక్తిని ఏకీకృతం చేయమని కోరుతుంది. దేశాలు అదేపనిగా తమ గతాన్ని తవ్వుకోవటం ద్వారా కాకుండా భవిష్యత్తును రూపొందించుకోవడం ద్వారా ఎదుగుతాయి.

చారిత్రక సమస్యలలోనే అంతులేకుండా జీవించడం జాతీయ పునరుద్ధరణకు మార్గం కాదు. ఇది అత్యంత తరచుగా రాజకీయ అభద్రతను ఒప్పుకోవడమే అవుతుంది. పాలన సాగించే నాయకత్వం భవిష్యత్తు గురించి వివరించటం కంటే గతాన్ని నిందించడం ద్వారా తనలోని లోతైన అశాంతిని వెల్లడిస్తుంది. పాత వైరుధ్యాలను వల్లె వేయకుండా ఊపును తీసుకురాలేకపోవడాన్ని ఇది అనుద్దేశంగా ప్రతిబింబిస్తుంది. చరిత్ర అనేది ఒక కథనాన్ని ప్రతిబింబించడానికి ఉద్దేశించిందే తప్ప దానిని మార్చేందుకు కాదు.

ఈ సలహా కొత్తదేమి కాదు. గతాన్ని మరచిపోయే వారు దానిని పునరావృతం చేయవలసి వస్తుందని జార్జ్ శాంటాయన గట్టిగా హెచ్చరించారు. అయినప్పటికీ, శాంటాయన ఉద్దేశ్యాన్ని నిత్యం తప్పుగా అన్వయిస్తారు. చరిత్రను గుర్తుంచుకోవడమంటే, దానిని ఆయుధంగా ఉపయోగించడం లాంటిది కాదు. చరిత్రను తారుమారు చేయడానికి ఇది కొత్త ఆయుధమేమీ కాదు. విన్‌స్టన్ చర్చిల్, ఈ వ్యత్యాసాన్ని బాగా అర్థం చేసుకొని, పాత సంఘర్షణలను సమకాలీన బాధ్యతను కప్పిపుచ్చడానికి అనుమతించకూడదని హెచ్చరించాడు.

శతాబ్దాలుగా రాజకీయ ఆలోచనాపరులు ఇదే నిర్ణయానికి వచ్చారు. బలహీన పాలకులు, శక్తివంతులు మాత్రమే బైటపడే తమ బలహీనతలను కప్పిపుచ్చుకునేందుకు పూర్వీకులను నిందించడాన్ని అలవాటుగా చేసుకుంటారని నికోలో మాకియవెల్లి పేర్కొన్నారు. మహా మాంద్యాన్ని ఎదుర్కొంటున్న సమయంలో హెర్బర్ట్ హూవర్‌ను నిత్యం నిందించడం ద్వారా కాకుండా, తన చర్యల ద్వారా ఫ్రాంక్లిన్ డి రూజ్వెల్ట్ అమెరికావాసుల విశ్వాసాన్ని పునర్నిర్మించారు. డెంగ్ జియావోపింగ్ సైద్ధాంతిక గొడవలను తేల్చుకోవడాన్ని పక్కనబెట్టి, చైనా ఆర్థిక పునరుజ్జీవనానికి అనుగుణంగా ఆచరణాత్మక సంస్కరణలను రూపొందించారు. గంభీరమైన నాయకులు ముందుకు సాగుతారు, అభద్రతా భావంతో ఉన్నవారు వెనక్కి తిరిగి చూస్తారు.

ఈ నమూనా ఇప్పుడు భారతదేశ సమకాలీన రాజకీయ చర్చల్లో ఒక స్పష్టమైన లక్షణాన్ని నిర్వచిస్తుంది. శక్తివంతమైనప్పటికీ విభజితమైన ఆధునిక భారత రాజకీయాల రంగంలో చారిత్రక నిర్ధారణ అప్పుడప్పుడు వాక్చాతుర్యాన్ని చాటుకునే అంశంగా కాకుండా, పరిపాలన విధానంగా మారింది. ఇదెక్కడో కాదు, నరేంద్ర మోదీ నేతృత్వంలోని పాలక బిజెపి పదేపదే చట్టసభ చర్చను జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీపై సుదీర్ఘ విచారణగా మార్చిన పార్లమెంటు శీతాకాల సమావేశాలలో స్పష్టంగా కనిపించింది.

అంతకుముందు, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో వ్యవసాయ సంక్షోభం, పట్టణ వలసలు లేదా యువత నిరుద్యోగం వంటి అత్యవసర వర్తమాన సమస్యల కంటే ఎక్కువగా.. ఈ ఇద్దరు మరణించిన వ్యక్తులను తరచుగా గుర్తుచేసుకున్నారు. దీని అర్థం స్పష్టంగా ఉంది: భారతదేశ ఎన్నికల భవిష్యత్తు విధానపరమైన అంశాలపై కంటే గత కాలానికి సంబంధించి నైతిక తీర్పులపై ఆధారపడి ఉంది. వందేమాతరం 150వ వార్షికోత్సవం, ఎన్నికల సంస్కరణలపై చర్చలు నెహ్రూ, గాంధీలపై విస్తృత విమర్శలుగా మారిన శీతాకాల సమావేశాల్లో ఈ ధోరణి తీవ్రమైంది.

పార్లమెంటులో మోదీ చేసిన ప్రసంగంలో మహమ్మద్ అలీ జిన్నా, ముస్లిం లీగ్ ఒత్తిడి కారణంగా వందేమాతరం అధికారిక గేయాన్ని నెహ్రూ మొదటి రెండు చరణాలకే పరిమితం చేశారని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని జాతీయ ఐక్యతను విచ్ఛిన్నం చేసే బుజ్జగింపు చర్యగా ఆయన అభివర్ణించారు. 1937లో నెహ్రూ సాంస్కృతిక గర్వాన్ని విభజన శక్తులకు అప్పగించారనే ఆరోపణ వందేమాతరగేయాన్ని స్మరించుకోవాలనే చర్చ ఉద్దేశ్యాన్ని కప్పివేసి, చారిత్రక రాజీని సైద్ధాంతిక ద్రోహంగా మార్చింది. ఇది కేవలం ఒక అంశానికి సంబంధించిన జోక్యం కాదు. హోంమంత్రి అమిత్ షా సమావేశాలు మొత్తంలో ఈ కథనాన్ని బలోపేతం చేశారు. జాతీయ చిహ్నాల నుండి ఎన్నికల సమగ్రత వరకు చర్చల కేంద్రంగా నెహ్రూ, గాంధీలను ఉంచారు. బిజెపి లక్ష్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది: నెహ్రూ, గాంధీని దేశ నిర్మాతలుగా కాకుండా బుజ్జగింపు, విభజన రూపశిల్పులుగా చిత్రీకరించే విధంగా భారతదేశ పునాది కథనాన్ని జాతీయవాద చట్రం ద్వారా తిరగరాయడం.

దశాబ్ద కాలంగా ఇలాంటి విశ్లేషణ నిరంతరాయంగా కొనసాగుతోంది. కశ్మీర్ అంశాన్ని నెహ్రూ చేపట్టిన తీరు, లౌకికవాదం పట్ల ఆయన నిబద్ధత, విదేశాంగ విధానం, ఆయన వ్యక్తిగత ఉత్తరప్రత్యుత్తరాలు కూడా పదే పదే రాజకీయ ఆయుధాలుగా ఉపయోగించబడుతున్నాయి. గాంధీ అహింసా సిద్ధాంతాన్ని తమకు అనుగుణంగా పేర్కొనడం లేదా దాని ప్రాధాన్యతను నెమ్మదిగా తగ్గించివేశారు. అయితే, ఆయన హత్య సైద్ధాంతిక పర్యవసానాలు అంతర్లీనంగా స్పష్టంగా ఉన్నాయి. నెహ్రూ మ్యూజియం పేరు మార్చడం ద్వారా సంస్థాగత స్మృతిని మార్చారు: నెహ్రూ స్మారక చిహ్నాన్ని రీ బ్రాండ్ చేశారు. వీరిని గౌరవించే ప్రదేశాలను మార్చేశారు.

డిసెంబర్ 15న పార్లమెంటులో ఒక ప్రత్యేక సంకేత సంఘటన జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు ఆమోదించబడింది. హామీ ఇవ్వబడిన పనిదినాలను 100 నుండి 125కి పెంచడం, పనితీరు ఆధారిత మూల్యాంకనాన్ని ప్రవేశపెట్టడం వంటి గణనీయమైన అంశాలను ప్రభుత్వం ప్రముఖంగా పేర్కొంది. అయినప్పటికీ, గాంధీ పేరును తొలగించడం అనేది ఉద్దేశపూర్వక వారసత్వ తొలగింపుగా విస్తృతంగా వ్యాఖ్యానించబడింది. ఈ కార్యక్రమం దాని సాంకేతిక లక్షణాలను సంస్కరణలుగా తిరిగి మార్పు చేయబడినప్పటికీ, దానిని ప్రేరేపించిన నైతిక దృక్పథం నుండి వేరు చేయబడింది. హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ కాలం నాటి ఎన్నికల యుక్తిని గుర్తుచేసుకున్నారు. నెహ్రూ నుండి ఇందిరా గాంధీ వరకు విస్తరించి ఉన్న 'ఓటు చోరీ' ఆరోపణలను వినిపించారు. అయినప్పటికీ, 'తప్పిపోయిన' నెహ్రూ పత్రాలపై ఇటీవల వివాదం తలెత్తింది. 2008లో సోనియా గాంధీకి పత్రాలను బదిలీ చేశారని నిర్ధారించే ముందు బిజెపి కాంగ్రెస్ తప్పుడు సమాచారాన్ని అందించిందని ఆరోపించింది. ఈ ఘటనలో సుపరిచితమైన నమూనాను బలోపేతం చేసింది. అది మొదట ఆరోపణలు చేయడం, తరువాత వివరణ ఇవ్వడం.కాంగ్రెస్, ఉదారవాద మేధావుల నుండి వచ్చిన ప్రతిస్పందనలు సమాన బలంగా ఉన్నాయి. అయినప్పటికీ అవి అంతగా ఉపయోగపడలేదు. దానిని నెహ్రూను కించపరిచే 'ప్రణాళికాయుత ప్రచారం' గా అభివర్ణిస్తూ సోనియా గాంధీ ఖండించారు. ఇర్ఫాన్ హబీబ్ వంటి చరిత్రకారులు భారతదేశ పారిశ్రామిక పునాదులు వేయడంలో నెహ్రూ పాత్రను నొక్కిచెప్పగా, ఉదారవాదులు పౌర హక్కుల ఉద్యమాలపై గాంధీ ప్రపంచ ప్రభావాన్ని ప్రముఖంగా పేర్కొన్నారు. నెహ్రూపై ఉన్న అన్ని ఫిర్యాదులకు సంబంధించిన జాబితాను రూపొందించి, దానిపై చర్చించేందుకు ప్రత్యేక పార్లమెంటరీ సమావేశాన్ని కేటాయించాలని ప్రియాంక గాంధీ వాద్రా ప్రతిపాదించారు. అలా చేసి ఈ అధ్యాయం ముగించాలని ఆమె అన్నారు.

ఈ గందరగోళం చర్చకు ఉన్న ప్రాథమిక పరిమితిని వెల్లడిస్తుంది. ఇది పాలనను కాదు, వేడిని పుట్టిస్తుంది. ఇది భారతదేశం స్థాపించబడిన ఘట్టం సంక్లిష్టతను అస్పష్టం చేస్తుంది. దానిని వ్యంగ్య చిత్రంగా తగ్గిస్తుంది. నెహ్రూ వైఫల్యాలు – చైనా పట్ల ఆయన ప్రేమపూర్వక ఆదర్శవాదం, 1962 యుద్ధంలో పరాజయం, మైనారిటీల పట్ల ఆయన విధానంలోని అంశాలు పరిశీలనకు అర్హమైనవి. కానీ ఆయన సాధించిన విజయాలు కూడా అంతే విలువైనవి: సాంకేతిక సంస్థల స్థాపన, భాక్రా నంగల్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ఐక్యత, వైవిధ్యాన్ని సమతుల్యం చేసే రాజ్యాంగ చట్రం. గాంధీ అహింసాయుత ప్రతిఘటన స్వాతంత్ర్యాన్ని పొందడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వలసరాజ్యాల నిర్మూలన ఉద్యమాలకు ప్రేరణనిచ్చింది. వాటిని తగ్గించడం అంటే భారతదేశం స్వంత మేధో వారసత్వాన్ని విచ్ఛిన్నం చేయడం.

అయితే ఈ వెనుక చూపు ఎందుకు? సమాధానం రాజకీయ సౌలభ్యమే తప్ప నమ్మకం కాదు. వ్యంగ్యం స్పష్టంగా ఉంది. మోదీ పాలనలో భారతదేశం ప్రదర్శించడానికి చాలా ఉంది. 2014 నుండి ఆర్థిక వ్యవస్థ రెట్టింపు కంటే ఎక్కువ అయింది. భారతదేశాన్ని ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద దేశంగా మార్చింది. వార్షిక వృద్ధి 7–8 శాతం స్థాయిలో ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఏటా 80 బిలియన్ డాలర్‌లను మించిపోయింది; ఎగుమతులు 800 బిలియన్ డాలర్‌లకు పెరిగాయి. లక్షిత సంక్షేమం ద్వారా పేదరికం గణనీయంగా తగ్గింది. డిజిటల్ మౌలిక సదుపాయాలు సేవల పంపిణీని మార్చాయి, లక్షలాది ఉద్యోగాలను సృష్టించాయి. మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధనంతో నాయకత్వం, రక్షణ స్వదేశీకరణ, జి–20 అధ్యక్షత వంటి దౌత్య మైలురాళ్ళు నిజమైన పురోగతికి నిదర్శనం.

ఈ నేపథ్యంలో నెహ్రూ, గాంధీలపై దోషత్వం అనవసరమే కాకుండా స్వీయ ఓటమిగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం ఉండే అధికార పార్టీ తన వారసత్వాన్ని పెద్దగాచూపాలి. బిజెపి చెంత మోదీ పరిపాలన రికార్డు, అటల్ బిహారీ వాజ్‌పేయి అణు దౌత్యం, ఆర్థిక సరళీకరణ, స్వర్ణ చతుర్భుజం; ఆత్మనిర్భర్ భారత్ వంటి చొరవలు పుష్కలంగా ఉన్నాయి. దీనికి బదులు మధ్య స్థాయి నాయకులు సోషల్ మీడియాలో వక్రీకరించిన కథనాలను విస్తృతం చేస్తారు. విచారణలో కూలిపోతారనే వాదనలను వ్యాప్తి చేయడం ద్వారా, తెలియకుండానే నెహ్రూ, గాంధీలను ప్రజా స్మృతిలో ఉంచుతున్నారు.

ఆశించని పరిణామం పునరుజ్జీవనం. స్వాతంత్ర్యానికి దూరంగా ఉన్న ఒక తరం ఇప్పుడు రేకెత్తించిన వివాదాల కారణంగా నెహ్రూ రాసిన డిస్కవరీ ఆఫ్ ఇండియా, గాంధీ రచనలను మళ్ళీ చదివేలా చేస్తున్నాయి. రాజ్ ఘాట్ ఇప్పటికీ మోదీ, విదేశీ నాయకులు ప్రతి సంవత్సరం సందర్శించే గౌరవ ప్రదేశంగా ఉంది. నెహ్రూ అంతర్జాతీయవాదం ప్రపంచ దౌత్యంలో ప్రతిధ్వనిస్తుంది. పాఠ్యపుస్తకాలలో కుదించబడిన అంశాలు ఇప్పుడు హెడ్‌లైన్స్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇదే విచిత్రం. నెహ్రూ, గాంధీలను సమాధి చేసే ప్రయత్నంలో బిజెపి వారిని పునరుజ్జీవింపజేసింది. అంతిమంగా, భారతదేశం ఆరోహణ చరిత్రను చెరిపివేయటాన్నిగాక సమ్మిళితం చేయటాన్ని డిమాండ్ చేస్తున్నది – గాంధీ నీతి సూత్రాలను, నెహ్రూ సంస్థాగత దార్శనికతను, మోదీ పరిపాలనా శక్తిని ఏకీకృతం చేయమని కోరుతుంది. దేశాలు అదేపనిగా తమ గతాన్ని తవ్వుకోవటం ద్వారా కాకుండా భవిష్యత్తును రూపొందించుకోవడం ద్వారా ఎదుగుతాయి.

(ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)
21.12.2005

# భారత అంతరిక్ష రంగ పితామహుడు... విక్రమ్ సారాభాయి



భరతమాత మెచ్చిన ముద్దు బిడ్డ విక్రమ్ సారాభాయి. భారతదేశ ప్రఖ్యాత భౌతికశాస్త్రవేత్త, భారత అంతరిక్ష రంగానికి రెక్కలు తొడిగిన మహానుభావుడు. 12 ఆగష్టు 1919 రోజు గుజరాత్ రాష్ట్ర అహ్మదాబాదుకు చెందిన సంపన్న పారిశ్రామికవేత్త అంబాలాల్ సారాభాయి, సరళా దేవి దంపతులకు జన్మించారు విక్రమ్ అంబాలాల్ సారాభాయి. అహ్మదాబాద్ కళాశాలలో మెట్రిక్ విద్య వరకు పూర్తిచేసి, ఉన్నత చదువులకు రెండు దఫాలుగా ఇంగ్లాండు కేంబ్రిడ్జ్ యూనివర్శిటీకి వెళ్లి డిగ్రీతో పాటు పిహెచ్‌డి వరకు పూర్తిచేశారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న వేళ భారతదేశానికి వచ్చి బెంగుళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో సర్ సి వి రామన్ పర్యవేక్షణలో కాస్మిక్ కిరణాలపై లోతైన పరిశోధనలు చేశారు.

**అంతరిక్ష పరిశోధనలకు ఆద్యుడు:**

1957లో రష్యా ప్రయోగించిన స్పుత్నిక్ ఉపగ్రహంతో స్ఫూర్తిని పొంది భారత్‌లో కూడా ఉపగ్రహాల ప్రయోగాలు చేయాల్సిన అవసరాన్ని నాటి ప్రధాని నెహ్రూకు వివరించి, ఆయనను ఒప్పించగలిగారు. 1962లో భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడు హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం భారత అంతరిక్ష పరిశోధనలకు పునాదులు వేసి భారత అంతరిక్షరంగ పితామహుడుగా కీర్తి గడించారు. 1962లో శాంతి స్వరూప్ భట్నగర్ అవార్డు, 1956లో భారత ప్రభుత్వ పద్మ భూషణ్, మరణానంతరం 1972 లో పద్మ విభూషణ్ పురస్కారాలు పొందారు.

**పలు అంతర్జాతీయ పరిశోధనా సంస్థల వ్యవస్థాపకుడు:**

అహ్మదాబాదులో ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ(పిఆర్‌ఎల్)ను ఏర్పాటు చేసిన విక్ర్మ సారాభాయి 1966 నుంచి 1971 వరకు సేవలు అందించారు. భారతదేశం లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఇస్రో స్థాపనకు ఆద్యుడిగా పేరొందిన విక్రమ్ సారాభాయి చొరవతో దేశ నలుమూలల పలు కేంద్ర స్థాయి సంస్థలను నెలకొల్పడానికి దోహదపడ్డారు. భారత అటామిక్ ఎనర్జీ కమీషన్, నృత్య కళాకారిణి అయిన తన సతీమణి సహాయంతో దర్పన్ అకాడమీ ఆఫ్ ఫెర్ఫామింగ్ ఆర్ట్స్, స్పేస్ అప్లికేషన్ సెంటర్‌ల స్థాపనలో కీలక భూమిక నిర్వహించారు. అదే విధంగా దేశవ్యాప్తంగా తిరువనంతపురంలో విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, కల్పకంలో ఫాస్ట్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్, ఈసిఐఎల్ హైదరాబాదు, బీహార్లో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లను నెలకొల్పటంలో తమ వంతు కృషి చేసారు.

భారత అంతరిక్ష పరిశోధనలకు మారుపేరుగా నిలిచిన భౌతికశాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త అయిన విక్రమ్ సారాభాయి 30 డిసెంబర్ 1971 రోజున తుది శ్వాస విడిచారు. భారతదేశ అంతరిక్ష రంగం, అణుశక్తి పరిశోధనల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన విక్రమ్ సారాభాయి సుసంపన్న జీవితం ఎల్లవేళలా యువభారతానికి దారిదీపంగా నిలుస్తూ ప్రేరణకు ఆజ్యం పోస్తూనే ఉంటుంది.

**(30 డిసెంబర్ విక్రమ్ సారాభాయి వర్ధంతి సందర్భంగా)**

# పదో తరగతి పరీక్ష విధానంలో మార్పులు అవసరం

ఈ మధ్యకాలంలో పదవ తరగతి పరీక్ష విధానంలో జరుగుతున్న మార్పులు విద్యార్థులు, ఉపాధ్యాయులే కాక విద్యావేత్తలలో కూడా ఆందోళన కలిగిస్తుంది. కరోనా కాలంలో పాఠశాల పని దినాలు తక్కువగా ఉండటం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడం కోసం తాత్కాలికంగా పాఠ్యాంశాలు తగ్గిస్తూ 11 పేపర్లుగా ఉన్న పదవ తరగతి పరీక్షను ఆరు పేపర్లకి తగ్గించారు. ఈ మార్పు కరోనాకాలంలో సరైనదిగానే భావించిన తర్వాత కాలంలో పాఠ్యాంశాలు కుదింపు చేయకుండా 6 పేపర్ల విధానాన్ని కొనసాగించడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం 7 పరీక్షలను 35 రోజుల సుదీర్ఘ కాలంపాటు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేయడంతో విదార్థుల్లో, ఉపాధ్యాయుల్లో మానసిక ఆందోళన మొదలైంది. ఉదాహరణకు సాంఘిక శాస్త్రంలో మొత్తం 21 పాఠ్యాంశాలు ఉన్నాయి. వాటికి రెండు పేపర్లతో పరీక్ష విధానం ఉండేది. విద్యార్థులు 1 నుంచి 11 పాఠ్యాంశాలకు మొదటి పేపర్, 12 నుంచి 21 పాఠ్యాంశాలకు రెండో పేపరు పరీక్ష రాసేవారు. ఇది హేతుబద్ధంగా, శాస్త్రీయంగా ఉండేది. అయితే ప్రస్తుతం 21 పాఠ్యాంశాలకు గాను ఒకే సాంఘిక శాస్త్ర పరీక్ష, అందులో 18 ప్రశ్నలు మాత్రమే ఉండడంతో కనీసం ఒక పాఠ్యాంశం నుంచి ఒక ప్రశ్న కూడా లేనివిధంగా ప్రశ్నాపత్రం ఉండడంలో శాస్త్రీయత ఉందా? సాంఘిక శాస్త్ర మూల్యాంకనానికి ఒక పేపర్ ఉండాలన్నప్పుడు 21 పాఠ్యాంశాలలో కనీసం ఐదు పాఠ్యాంశాలైన తగ్గించాల్సి ఉండే.

ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించాలని బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వారు విడుదల చేసిన షెడ్యూలు విద్యార్థుల్లో మానసిక ఆందోళనను పెంచుతుంది. ఒక సబ్జెక్టులకు 4,5రోజుల విరామం కాకుండా ఒకటి, రెండు రోజుల విరామం ఉండాల్సింది. పరీక్షల షెడ్యూలు తయారు చేసే ముందు ఫీల్డ్‌లో అనుభవం ఉన్న ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని ఉండాల్సింది. ఏకంగా 35 రోజుల పాటు పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తే అన్ని రోజులు పాటు విద్యార్థులు పరీక్షపై దృష్టిని నిలిపి ఉంచలేరు. ఇది విద్యార్థుల్లో ఒక రకమైన నిరుత్సాహాన్ని పెంచుతుంది. పరీక్షల మధ్య ఎక్కువ వ్యవధి ఉండడంతో, విద్యార్థులు బయట తిరగడం వల్ల అనారోగ్యానికి గురి అయితే, ఇది మొత్తం గా పరీక్షలపై తీవ్రప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

సిబిఎస్ఇ విధానాన్ని బట్టి పదవ తరగతి షెడ్యూల్ తయారు చేసినట్లు తెలుస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని లోతుగా అధ్యయనం చేయాల్సి ఉండే. సిబిఎస్ఇ పాఠ్యాంశాలు చదువుతున్న విద్యార్థుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరు ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ లాంటి స్టేట్ సిలబస్ చదువుతున్న విద్యార్థుల సామాజిక,ఆర్థిక పరిస్థితులు వేరు. సిబిఎస్ఇ లో చదువుతున్న విద్యార్థుల్లో మెజార్టీగా అర్బన్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉంటారు. అందులో తల్లిదండ్రులు అక్షరాస్యులై ఉంటారు. అదే ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ తదితర సంస్థలలో చదివే విద్యార్థులు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలలో ఉంటారు. తల్లిదండ్రులలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉంటారు. 7 పరీక్షలకు 35 రోజుల టైమ్ టేబుల్‌లో మధ్యలో విరామం ఎక్కువగా ఉండటం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు పనులకు వెళ్ళవలసి రావడంతో చదువుపై దృష్టి కేంద్రకరించలేరు. తల్లిదండ్రులు కూడా అన్ని రోజులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించలేరు, వారికి కావలసిన సౌకర్యాలు అందించలేరు. ఇది మొత్తంగా పరీక్ష ప్రిపరేషన్ విధానాన్నీ దెబ్బతిసే అవకాశం ఉంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ లాంటి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంద రు నెల రోజులపాటు పదో తరగతి పరీక్షల్లో నిమగ్నమైతే హోం పరీక్షలపై ప్రభావం పడుతుంది. హోం పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్న, పరీక్షలను గుణాత్మకంగా నిర్వహించాలన్న సబ్జెక్ట్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలి. 35 రోజులపాటు పదో తరగతి పరీక్షలు నిర్వహించిన వెంటనే మూల్యాంకనానికి సీనియర్ ఉపాధ్యాయులు వెళ్ళవలసి ఉంటుంది. ఇది 6,7,8,9 తరగతుల విద్యార్థులను హోం పరీక్షలకు తయారు చేయడం పై ప్రభావం చూపుతుంది. 10వ తరగతి విద్యార్థులను 6,7,8,9 తరగతుల విద్యార్థులను ఒకేసారి పరీక్షలకు సంసిద్ధం చేయలేము. 35 రోజులు పదవ తరగతి విద్యార్థుల పై దృష్టి సారించాల్సి రావడం వలన హోం పరీక్షలను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుంది.

సిబిఎస్ఇ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల కంటే ముందు హోం పరీక్షలు నిర్వహించి, తర్వాత పదవ తరగతి పరీక్షలు నిర్వహించే వారు, ఈ నిర్వహణలో హేతుబద్ధత, శాస్త్రీయత ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదవ తరగతి పరీక్షలు రెండు దఫాలుగా నిర్వహిస్తారు. మొదటి దశలో ఫిబ్రవరిలో నిర్వహించి మార్చి, ఏప్రిల్ లో హోం పరీక్షలు నిర్వహిస్తారు. రెండవ దశ పరీక్షలు మే లో నిర్వహిస్తారు. ఈ విధానంలో కూడా హేతుబద్ధత, శాస్త్రీయత ఉంది. అయితే ఎస్ఎస్‌సి బోర్డు షెడ్యూలు ప్రకారం మార్చ్ 14 న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 16 వరకు సుమారు 35 రోజులు నిర్వహిస్తారు. అదే ఏప్రిల్‌లో హోమ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుం ది. రెండు పరీక్షలు ఒకేసారి నిర్వహించాలంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

సుదీర్ఘంగా ఉన్న పరీక్షల ప్రస్థానం వల్ల తదుపరి పాలిటెక్నిక్ లాంటి కాంపిటీషన్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సమయం ఉండకపోవచ్చు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు విద్యార్థులను కార్యోన్ముఖులను చేయలేగాని, కార్యహీనులను చేయరాదు. సంస్కరణలు స్థానిక సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఉండాలే గాని మరో వ్యవస్థను అనుసరించినట్లుగా ఉండకూడదు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అధికభాగం గ్రామీణ ప్రాంత విద్యార్థులే కాబట్టి ప్రస్తుతం ప్రకటించిన10వ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను పునర్ సమీక్షించవలసిందిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

జుర్రు నారాయణ యాదవ్,
9494019270.

## లేఖలు

# మార్చాల్సింది అమ్మాయి దుస్తులు కాదు..సమాజ దృక్పథాన్ని!

అమ్మాయి రక్షణ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ, బాధ్యులను బోనులో నిలబెట్టాల్సింది పోయి బాధితురాలి రంగు, శరీరం, ఆమె ధరించిన దుస్తుల గురించి ప్రస్తావించడం ఒక అనాగరిక సంప్రదాయంగా మారిపోయింది. 'అమ్మాయి సురక్షితం గా ఉండాలంటే పద్ధతిగా ఉండాలి' అని సుద్దులు చెప్పే మేధావుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అసలు రక్షణకు, దుస్తులకు ముడిపెట్టే ఈ కుసంస్కృతి ఇంకెంత కాలం కొనసాగుతుందనేది నేడు సమాజం ముందున్న అతిపెద్ద ప్రశ్న. వ్యక్తుల ప్రవర్తనను ప్రశ్నించకుండా, బాధితుల వేషధారణ ను విమర్శించడం అంటే పరోక్షంగా నేరాన్ని సమర్థించడమే అవుతుంది. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే అత్యంత శక్తివంతమైన సినీ రంగం నేడు మహిళల పట్ల ప్రదర్శిస్తున్న వైఖరి అత్యంత ఆందోళనకరం. ఒకప్పుడు మహిళా పాత్రలను ఎంతో గౌరవప్రదంగా, స్ఫూర్తిదాయకంగా చిత్రించిన వినోదరంగం, రానురాను వారిని కేవలం గ్లామర్ వస్తువులుగా మార్చేసింది. హీరో అమ్మాయిల వెంట పడితేనే అభిమానులకు సంతోషమని, అది మాస్ ఎంటర్టైన్మెంట్ అని బహిరంగంగా వ్రాక్రుచ్చిన పెద్దలు ఈ పరిశ్రమలో ఉండటం విచారకరం. మహిళల గురించి అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడే సీనియర్ నటులు, వారి మాటలకు పగలబడి నవ్వుతూ చప్పట్లు కొట్టే యువతరం నటులు.. వెరసి వెండితెరపై స్త్రీ గౌరవం వేలంపాటగా మారుతోంది. సినిమాలు, టివిలు లేదా సోషల్ మీడియామాధ్యమం ఏదైనా కానీ సన్నివేశాలు, పాటలు, డ్యాన్స్‌ల పేరుతో మహిళా పాత్రలను కించపరచ డం ఒక పరిపాటిగా మారింది. వినోదం పేరుతో నలుగురిలో మహిళలను అవమానించే సంభాషణలు రాసి, వాటిని 'కామెడీ' అని ముద్ర వేస్తున్నారు. మరి కొందరైతే కేవలం పాపులారిటీ కోసం అమ్మాయిలపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. సమాజంపై బాధ్యత ఉండాల్సిన కళాకారులు, నిర్మాత లు సైతం వ్యాపార సూత్రాల కోసం మహిళల ఆత్మగౌరవాన్ని పణంగా పెడుతున్నారు. ఇప్పుడు తాజాగా 'సురక్షితంగా ఉండాలంటే దుస్తులు పద్ధతిగా ఉండాలి' అంటూ హేయమైన పదజాలంతో నీతులు చెప్పేవారు రావడం మన సామాజిక దిగజారుడుతనానికి అద్దం పడుతోంది. నిజానికి, సమస్య అమ్మాయి వేసుకునే దుస్తుల్లో లేదు, అది ఎదుటివారి చూసే చూపులో మరియు వారు పెరిగిన పెంపకంలో ఉంది. స్త్రీ అంటే గౌరవించాల్సిన వ్యక్తి అని కాకుండా, తను కేవలం ఒక 'వస్తువు' మాత్రమే అనే భావనను నేటి వినోద మాధ్యమాలు యువతలో బలంగా నాటుతున్నాయి. అందుకే బహిరంగ వేదికలపై అసభ్య వ్యాఖ్యలు వినిపిస్తున్నప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పకపోగా, వాటిని ఆస్వాదించే స్థితికి సమాజం చేరుకుంది. సెన్సార్ బోర్డులు మరియు సినీ పెద్దలు ఈ బాధ్యతారాహిత్యాన్ని అరికట్టాలి. స్త్రీని కేవలం అందచందాల ప్రదర్శనగా కాకుం డా, ఒక మనిషిగా గుర్తించే సంస్కృతిని తెరపై చూపించాలి. ఇకనైనా మహిళల స్వేచ్ఛను దుస్తుల కొలతలతో కొలవడం ఆపాలి. ఆమెకు రక్షణగా ఉండటం అంటే హద్దులు విధించడం కాదు, స్వేచ్ఛగా తిరగగలిగే వాతావరణాన్ని సృష్టించడం. ఏ దుస్తులు వేసుకోవాలో నిర్ణయించుకునే హక్కు ఆమెది, కానీ ఆమెను గౌరవంగా చూడాల్సిన బాధ్యత సమాజానిది. ఆలోచనా విధానంలో మార్పు రానంతకాలం, ఎన్ని చట్టాలు తెచ్చినా, మహిళల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంటుంది. ఈ అవాకులు చెవాకులకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

దిడ్డి శ్రీకాంత్

# శ్రద్ధ లోపమా..? ప్రాణంపై నిర్లక్షమా..?

ఆధునిక జీవన విధానంలో బైక్ ప్రయాణం అనేది ఒక అవసరంగా మారిపోయింది. పనికోసం, చదువు కోసం, వ్యాపార అవసరాల కోసం రోజూ వేల కిలోమీటర్లు బైక్‌పైనే ప్రయాణం జరుగుతోంది. అయితే అంత అవసరమైన ఈ ప్రయాణంలో భద్రతకు సంబంధించిన అంశాలను మాత్రం చాలామంది పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడంలో కనిపిస్తున్న అశ్రద్ధ నేడు అనేక కుటుంబాలను విషాదంలోకి నెట్టేస్తోంది.

ఇంటికి దగ్గరే కదా హెల్మెట్ వేసుకుంటే ఇబ్బందిగా ఉంది. ఇంతకు ముందు కూడా ఎప్పుడూ ఏమీ కాలేదు అనే తేలికపాటి ఆలోచనలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ప్రమాదం అనేది ముందుగా చెప్పి రాదు. ఒక్క క్షణం నియంత్రణ కోల్పోయినప్పుడే ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా బైక్ నడిపినప్పుడు తలకు తగిలే చిన్న గాయం కూడా ప్రాణాంతకంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో ఎక్కువమంది తల గాయాల వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు అన్నది చేదు నిజం. ఈ నిజాన్ని అంగీకరించకుండా నాకు ఏమీ కాదు అనే అహంకార ధోరణి ఎన్నో కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టేస్తోంది. ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే, అది కేవలం అతని జీవితానికే ముగింపు కాదు. అతనిపై ఆధారపడి ఉన్న తల్లిదండ్రులు, భార్య, పిల్లల జీవితాలు ఒక్కసారిగా అంధకారంలోకి వెళ్లిపోతున్నా రు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి లేకపోవడంతో ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయి. చిన్నపిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోతున్నా యి. కొన్నిచోట్ల కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఈ పరిస్థితులన్నింటికీ మూలకారణం ఒక్కటే రోడ్డు భద్రతపై నిర్లక్ష్యం. ఒక చిన్న హెల్మెట్ ధరించి ఉంటే బతికే అవకాశం ఉన్నా, ఆ అవకాశం మనమే వదులుకుంటున్నాం.

పోలీసు శాఖ ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, ఎన్ని తనిఖీలు చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు. జరిమానాలు విధిస్తే కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కానీ హెల్మెట్ చట్టం ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదు, ప్రాణాలను కాపాడటానికే అన్న విషయం మనం గుర్తించాలి. హెల్మెట్ అనేది పోలీసులను తప్పించుకునే సాధనం కాదు అది మన తలకే కాదు, మన కుటుంబ భవిష్యత్తుకు రక్షణ కవచం. ట్రాఫిక్ నిబంధనలు శిక్షల కోసం కాదు, మన భద్రత కోసం.ఈ విషయాన్ని ప్రతి బైక్ ప్రయాణికు డు బాధ్యతగా ఆలోచించాలి. నా ప్రాణాల విలువ నాకు తెలుసు అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలి. శ్రద్ధ లోపమా..? ప్రాణం పై నిర్లక్షమా..? అనే ఈ ప్రశ్నకు సమాధానం మన చేతుల్లోనే ఉంది. ఒక చిన్న జాగ్రత్త....ఒక హెల్మెట్.. ఎన్నో ప్రాణాలకు, ఎన్నో కుటుంబాలకు భద్రతగా నిలుస్తుంది అని గ్రహించాలి.


మలిపెద్ది పవన్ కళ్యాణ్.

## కేసులను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది కిట్లను,స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సిఐలు కొండల్ రెడ్డి, నందనీ వెంకటేష్ గౌడ్,ఎస్ఐలు కృష్ణ చారి,వీరబాబు తదితరులు ఉన్నారు.

## గవర్నర్‌కు వైకుంఠ ఏకాదశి ఆహ్వానం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలకు హాజరు కావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి సాదర ఆహ్వానం లభించింది. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఈవో ఎస్.వెంకటరావు ఈ నెల 30/12/2025 జరుగనున్న వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా గవర్నర్‌ని కలిసి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానానంతరం దేవస్థాన ప్రధానార్చకులు, అర్చకులు మరియు వేద పండితులు గవర్నర్‌కి శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు గవర్నర్‌కి వేద ఆశీర్వచనం గావించి, స్వామివారి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ

సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోదా శ్రీరాములు డిమాండ్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ అని ప్రకటించి పనులను పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయం ఎదుట పార్టీ కార్యకర్తలతో 4 గంటల పాటు సోమవారం ధర్నా చేశారు. పట్టణంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయన మాట్లాడారు. డ్రైనేజీ వ్యవస్థ, మురుగు నీరు ఇండ్ల మధ్య నిలిచి ఈగలు దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. చెత్త దిబ్బలలో పందులు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. అమృత్ 2.0 పథకంలో సీసీ రోడ్లను పగలగొట్టి వదిలేశారని వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ మాట్లాడుతూ సిపిఐ సూచించిన సమస్యలను స్వయంగా వార్డుల వారీగా పర్యటించి పరిశీలిస్తానని, పరిష్కారానికి కృషి చేస్తానని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, నాయకులు బంగారి, ఆరె పుష్ప, రాజు, బాలకిషన్, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో తక్షణ పరిష్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేకు ప్రజల నుండి వచ్చిన దాదాపు 42 వివిధ ఫిర్యాదులను జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ స్వయంగా స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూ వివాదాలు,కుటుంబ కలహాలు,మోసాలు,సైబర్ నేరాలు, ఇతర పోలీస్ సంబంధిత సమస్యలపై ప్రజలు తమ అర్జీలను సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. ప్రతి అర్జీపై చట్టపరంగా న్యాయమైన చర్యలు తీసుకుంటామని,ప్రజలు పోలీస్ గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారు.గ్రీవెన్స్ డేకు హాజరుకాలేని వారు తమ సమస్యలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్ ద్వారా తెలియజేయవచ్చని ఎస్పీ సూచించారు.

## కాటన్ మిల్లు ముందు రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/చిట్యాల:** ఆన్‌లైన్‌లో తూకానికి, సిసిఐ కొనుగోలు కేంద్రం దగ్గర కంప్యూటర్‌లో తూకానికి మధ్య వ్యత్యాసం రావడాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో గల కృష్ణ కాటన్ మిల్లు ముందు సోమవారం పత్తి రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం ఆన్‌లైన్ ద్వారా పత్తి తూకాన్ని నమోదు చేయాల్సి ఉండగా రైతులు తమ పత్తిని తూకం వేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని కాటన్ మిల్లులో గల సిసిఐ కేంద్రానికి పత్తిని తరలించారు. కాగా అక్కడ కంప్యూటర్‌లో పత్తి తూకంలో చాలా వ్యత్యాసం వస్తుండటం రైతులను ఆందోళన పరిచింది. అనేక మంది రైతులు విషయంలో ఇలాగే జరుగగా రైతులు ఆందోళనకు దిగారు. వీరికి మద్దతుగా సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు జిట్ట నగేష్ ఆందోళన పాల్గొని వెంటనే రైతుల సమస్యను పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే సరైన దిగుబడి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇలాంటి అవకతవకలు జరిగితే వారు భరించడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అసెంబ్లీలో ఒకరిపై ఒకరూ ఆరోపణలతో కాలం వెల్లబుచ్చకుండా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జివివి గార్డెన్‌లో జరిగిన సిపిఐ(ఎం) సూర్యాపేట జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంలో రెండు ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల విషయంలో వివక్షత లేకుండా అర్హులైన వారందరికి అక్రిడిషన్స్ కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్రంలోని మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కుతూ అప్రజాస్వామిక పరిపాలన కొనసాగిస్తుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఘనంగా సన్మానించారు. పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొలిశెట్టి యాదగిరిరావు, కోట రమేష్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌ను నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గత నెల వరకు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా ఉన్న ఆయన ఎమ్మెల్సీగా ఉన్నారు. జిల్లాలో గిరిజనుల పట్ల పట్టు ఉన్న ఆయనకు రాష్ట్ర స్థాయి పదవి వరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, ఆదివాసీల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సూర్యాపేట జిల్లాలో యూరియా కొరత లేదు

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రైతులకు సరఫరా చేసేందుకు యూరియా కొరతలేదని, అందువల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో రబీ సీజన్‌లో యూరియా పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలో యూరియా పంపిణీపై అధికారులతో సమీక్షించారు. 2025 యాసంగి సీజన్‌లో జిల్లాలో ప్రస్తుతం 10508 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేసేందుకు వివిధ సొసైటీలు, డీలర్లు, ఎన్‌డిసిఎంఎస్, ఏఆర్ఎస్‌కె, మార్క్‌ఫెడ్ గోదాములలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కాగా ఇప్పటి వరకు జిల్లాలో ఈ సీజన్‌లో రైతులకు 32910 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. జిల్లాలోని 544 సెంటర్ల ద్వారా యూరియాను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. యూరియా సరఫరాను ఎప్పటికప్పుడు తాను పర్యవేక్షించడం జరుగుతున్నదని, ఎవరైనా ప్రైవేటు డీలర్లు, సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్ తదితర సంస్థలు ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణం కన్నా ఎక్కువ పరిమాణంలో యూరియాను అమ్మినా లేదా అధిక ధరకు విక్రయించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో అవసరమైనంత యూరియా అందుబాటులో ఉన్నందున రైతులు యూరియాకై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద షామియానాతోపాటు, తాగునీటిని ఏర్పాటు చేయాలని, ప్రతి అమ్మకం కేంద్రంలో కనీసం మూడుకు తక్కువ కాకుండా కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. యూరియా అమ్మకాలను ఉదయం 6 గంటల నుండి ప్రారంభించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. యూరియా సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 6281492368కు సంప్రదించాలని ఆయన కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, జిల్లా సహకార అధికారి ప్రవీణ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగయ్య, జిల్లా ఉద్యాన శాఖ డిడి కె సుభాషిని హాజరయ్యారు.



## శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** శ్రమ దోపిడికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైనదని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సూర్యాపేట ఏరియా టిప్పర్ డ్రైవర్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టిప్పర్ వర్కర్స్ పైన ఒత్తిడి పెంచి వారి శ్రమను దోచుకుంటున్న యాజమాన్యం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన యాజమాన్యాన్ని కోరారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మహిళా సమైక్య ప్రాంతీయ కార్యదర్శి దేశగాని హేమలత, గాలి కృష్ణ, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నరేష్ యాదవ్‌పాల్గొన్నారు.

## సిపిఐ శత జయంతి ఉత్సవాలలో అధిక సంఖ్యలో పాల్గొనాలి :బంటు



**ప్రజాపక్షం/వేములపల్లి:** జనవరి 18న ఖమ్మం జిల్లాలో జరగబోయే సిపిఐ శతజయంతి ఉత్సవాలలో మండలం నుండి అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.సోమవారం మండల కార్యదర్శి జిల్లా యాదగిరి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని 100 సంవత్సరాలుగా పేద ప్రజల పక్షాన నిలబడి ఎన్నో సంస్కరణలకు కారణమైన సిపిఐ జనవరిలో ఖమ్మం జిల్లా వేదికగా శత జయంతి ఉత్సవాలను జరుపుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి గ్రామ శాఖ కార్యదర్శి పుట్టల నాగయ్య,మంగాపురం గ్రామ శాఖ కార్యదర్శి రంగారెడ్డి,నాయకులు బస్కా పరమేష్,తిమ్మారెడ్డి గూడెం సిపిఐ పార్టీ వార్డ్ మెంబర్ కత్తుల భిక్షం ,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యంగా డిసిసిబి పనిచేయాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్చార్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి సోమవారం ఆమె జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డిసిసిబి ద్వారా వివిధ పంటలకు ఇచ్చే రుణ పరిమితి పై సమీక్షించారు. వ్యవసాయం, ఉద్యానం ,పాడి పరిశ్రమ, రంగాలలో ఇచ్చే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పై చర్చించారు. డిసిసి బ్యాంకు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు బ్యాంకుపై ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో వారికి సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పంట రుణాలు మధ్యకాలిదీర్ఘకాలిక రుణాల మంజూరులో జాప్యం లేకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.బ్యాంకులో పెండింగ్‌లో ఉన్న రికవరీ, ఎన్‌పీఏల తగ్గింపు, ఖాతాదారులకు మెరుగైన సేవల అందింపుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు.డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తూ, కోర్ బ్యాంకింగ్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలని, పారదర్శకత, బాధ్యతతో బ్యాంకు కార్యకలాపాలు సాగాలని ఆదేశించారు.ప్రభుత్వ పథకాలు బ్యాంకు ద్వారా సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా బ్యాంకు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో శంకర్ నాయక్, జనరల్ మేనేజర్ నర్మద, డి సి ఓ పత్యానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే సుభాషిని, ఎల్ డి ఎం శ్రామిక్, బ్యాంకు డైరెక్టర్లు, తదితరులు హాజరయ్యారు.

# ఎక్సైజ్ అధికారులు వేధిస్తున్నారంటూ ఆందోళన!



పురుగుల మందు డబ్బాతో ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన

న్యాయం చేయాలంటూ విద్యాసాగర్ రెడ్డి కార్యాలయం ముందు బైఠాయింపు

**ప్రజాపక్షం/హాలియా:** మద్యం షాపుకు అనుమతి ఇవ్వకపోగా ఎక్సైజ్ అధికారులు వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మద్యం వ్యాపారి నూకల విద్యాసాగర్ రెడ్డి హాలియా ఎక్సైజ్ కార్యాలయం ముందు పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. ఎక్సైజ్ శాఖ అధికారులు తను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి ఇబ్బందులకు చేస్తున్నారని ఆరోపించారు. పెద్దవూర మండలంలో తన దగ్గర బంధువు కు వచ్చిన వైన్స్ షాపును తాను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు చెప్పారు. తిరుమలగిరి మండల కేంద్రంలో తనకు ఉన్న వైన్ షాపులో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ తమపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. పెద్దవూర మండలంలో తాను వైన్ షాప్ ఏర్పాటు చేయకుండా కొందరి సహకారంతో ఎక్సైజ్ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మద్యం షాప్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ఇప్పటికే కోటి రూపాయలు చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహిస్తున్న వైన్స్ షాప్ లో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి పరోక్షంగా భయాందోళనలకు గురి చేస్తున్నారని చెప్పారు. అన్ని షాపుల లాగే పాను కూడా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా షాపులు నిర్వహిస్తున్నానని కానీ ఇదే వ్యాపారంలో ఉన్న కొంత మంది ప్రోత్బలంతో ఎక్సైజ్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఎక్సైజ్ సీఐ కల్పన తమ కార్యాలయం వద్ద జరుగుతున్న విషయాలను స్థానిక పోలీసులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్ఐ సాయి ప్రశాంత్ త్యాగరాజన్ తో మాట్లాడి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునేలా చూసుకోవాలని చెప్పడంతో విద్యాసాగర్ రెడ్డి ధర్నా నిర్వహించారు.

## చైనీస్ మాంజా విక్రయిస్తే చర్యలు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** గాలిపటాలు ఎగురవేయడానికి చైనీస్ మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి కె నరసింహ హెచ్చరించారు. చైనీస్ మాంజా (నైలాన్/ సింథటిక్ దారం) విక్రయించడం, నిల్వ చేయడం, వాడటంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. పర్యావరణానికి, పక్షులకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను విక్రయించడం చట్టరిత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ దారం గాలిపటాలు ఎగురవేసే సమయంలో మెడకు లేదా శరీర భాగాలకు తగిలితే తీవ్రమైన గాయాలు కావడమే కాకుండా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని, గతంలో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. జిల్లాలోని ఫ్యాన్సీ షాపులు, గాలి పటాల విక్రయ కేంద్రాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, ఎక్కడైనా నిషేధిత చైనీస్ మాంజా కనిపిస్తే వెంటనే వాటిని సీజ్ చేయడమే కాకుండా సంబంధిత విక్రేతలపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేవలం వ్యాపార లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని వ్యాపారులకు సూచించారు. పర్యావరణ హితమైన, సురక్షితమైన నూలు (కాటన్) దారాలను మాత్రమే విక్రయించాలని, కొనుగోలు చేయాలని కోరారు. తల్లి దండ్రులు కూడా తమ పిల్లల పట్ల ఇట్టి విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ఎవరైనా రహస్యంగా చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బీసీలకు విద్యా ఉద్యోగ రంగాలలో స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భువనగిరి డిప్యూటీ తాసిల్దార్ కళ్యాణ్‌కి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల అశోక్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా 2023 అసెంబ్లీ ఎన్నికలలో హామీ ఇచ్చినారని హామీ ప్రకారం శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించి 7 నెలలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో కేంద్ర ప్రభుత్వం చేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసిల్దార్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కస్తూరి బిక్షపతి, బీసీ నాయకులు కూరపాటి అంజయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, నాయకులు గుర్రం జనార్ధన్, నాగపురి యాదగిరి, ఎం.రాజు, నీల కుమార్ పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి





**ప్రజాపక్షం/యాదాద్రి :** భాగ్యనగరానికి కూతపెట్టు దూరంలో కలిగి ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మనిపల్లి హిల్స్ పై ప్రముఖ పారిశ్రామికవేత్త, మానపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా 6 మార్చ్ 2024, ఆలయ ప్రాణ మంగళ శాసనాలతో ప్రతిష్ట చేశారు. అర్థ జన రక్షకుడు, పిలిస్తే పలికే కలియుగ ప్రత్యక్ష దైవం, భక్తుల పాలిట కొంగుబంగారం శ్రీ వెంకటేశ్వర స్వామి స్వర్ణగిరి అలయాన్ని పసిడి కాంతులతో ముస్తాబయింది. భక్తులు తన్మయంచేందేల ఎంతో సుందర నయనానంద కారంగా దేవాలయాన్ని తీర్చిదిద్దారు. ఈనెల 30 నుండి జనవరి 8 వరకు ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయించిన్నట్లు మానేపల్లి హిల్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మానేపల్లి రామారావు తెలిపారు. అంతేగాక ఇది నూతన సంవత్సర వేడుకలతో ముడిపడి ఉంది. విష్ణు మూర్తికి అంకితం చేయబడిన పవిత్రమైన రోజు, వైకుంఠ ఏకాదశి ధనుర్మాసంలో వస్తుంది. ఇది విష్ణుకు అత్యంత పవిత్రమైన మాసంగా పరిగణిస్తారు. శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం చేస్తే మోక్షానికి మార్గమని శాస్త్రాలు వెలువరిస్తున్నాయి. ప్రతిరోజు శ్రీ స్వామివారికి విశేష అలంకరణ సేవలు జరగనున్నాయి. భక్తులు కోరిన కోరికలను తీర్చే కొంగు బంగారమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నారు. కలియుగ దైవం స్వామివారి దర్శనానికి, రాష్ట్ర నలుమూలల నుండి ఏ కాక పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారన్న ఆలోచనతో మానేపల్లి ట్రస్ట్, ఆలయ నిర్వాహకులు ప్రత్యేకమైన ఏర్పాట్లను చేయడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అంతేగాక వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం ఆన్ లైన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చానీ ఆలయ నిర్వాహకులు తెలిపారు. పది రోజులపాటు కనీ వినీ ఎరగని తరహాలో స్వామివారి అలంకరణ సేవలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు వివరించారు. వైకుంఠ ఏకాదశి డిసెంబర్ 30వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారు వేకువజామున ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తుల కోసం ఆధ్యాత్మికత, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందనీ తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తునికి కూడా స్వామివారి అన్న ప్రసాదాన్ని అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్వాహకులు, సుదీర్ఘ దూరాల నుండి వచ్చే భక్తులకు ప్రత్యేకమైన పార్కింగ్ సదుపాయం ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు పురవీధుల్లో మంచినీటి వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలి

వనపర్తి డిసిఆర్బి డిఎస్పీ బాలాజీ నాయక్

**ప్రజాపక్షం/వనపర్తి:** ప్రతి సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి 10 మంది ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా వనపర్తి డిసిఆర్బి డిఎస్పీ బాలాజీ నాయక్ ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి డిసిఆర్బి డిఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఫిర్యాదు దారులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించే విధంగా డిఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజావాణిలో మొత్తం 10 ఫిర్యాదుల్లో 5 భూతగాదాల ఫిర్యాదులు, 3 పరస్పర గొడవల ఫిర్యాదులు, 2 భార్యభర్తల సంబంధించిన ఫిర్యాదులు వున్నాయి.

## యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా యూరియా అప్ ద్వారా ఆన్లైన్‌లో రైతులు బుక్ చేసుకోవడం అమలు జరుగుతుందని తెలిపారు. ప్రతి రైతు ఆన్లైన్‌లో బుక్ చేసుకుని యూరియా కొనుకోవచ్చని, ప్రతి షాప్‌లో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాలో ఇంత వరకు 11029 మంది రైతులు ఆన్‌లైన్‌లో ఆప్ ద్వారా 32669 ఎరువుల బస్తాలు బుక్ చేసుకోగా 24918 ఎరువుల బస్తాలు రైతులు తీసుకు వెళ్లడం జరిగిందని, మిగిలిన బస్తాలు కూడా నిర్దేశిత సమయంలోగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ అందజేత

**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నాయకాడు చిన్న లింగప్ప తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ఇటీవల జరిగిన సర్పంచు ఎన్నికల్లో ఓడిపోయినా ఇచ్చిన మాట ప్రకారం సొంత నిధులు రూ.65 వేలు వెచ్చించి ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామపంచాయితీకి అందజేశారు. గ్రామంలో ఎవరైనా చనిపోయినప్పుడు ఫ్రీజర్ బాక్స్ లేక ఇబ్బందులు పడటాన్ని దృష్టిలో ఉంచుకుని ఫ్రీజర్ బాక్స్‌ను కాట్రేపల్లి గ్రామ అవసరాల కోసమే ఉపయోగించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామంలో మంచినీటి ఇబ్బందులను సైతం దూరం చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చిన్న లింగప్ప తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిన్న లింగప్పను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకాడు పెద్ద లింగప్ప, నరసప్ప, గడ్డం నర్సప్ప, ఎండి రసూల్, దాసరి చెన్నప్ప, నాయకాడు లింగప్ప, చిన్నకిష్టప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రక్షణ మన కర్తవ్యం



అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోష్ చట్టం గురించి జిల్లా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కారం చట్టం, 2013 గురించి వివరించారు. మహిళల రక్షణ, మహిళాభివృద్ధి, మహిళా సాధికారత కోసం అందరం కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ రషీద్, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోర్డినేటర్ నర్సింహులు, జెండర్ స్పెషలీస్టులు అనిత, నరసింహ, లీగల్ కౌన్సిలర్ రామాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను సమావేశ పరచి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఆర్.డి.ఓ నవీన్, జడ్.పి.సి.ఈ. ఓ వెంకటరెడ్డిలు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి లో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిష్కారం చేయాలని సూచించారు. సమావేశంలో డి.ఆర్.డి. ఓ నర్సింహులు, గృహ నిర్మాణ శాఖ ఇంచార్జీ పి.డి.వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 19 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 19 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఎ.ఓ. తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ

పున: ప్రారంభం చేసిన సర్పంచ్ మ్యాకల సురేష్



**ప్రజాపక్షం/కృష్ణ :** తెలంగాణలో గ్రామ పంచాయితీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆగిపోయిన ఇందిరమ్మ చీరల పంపిణీని సోమవారం కృష్ణ మండలం కున్సి గ్రామంలో ఇందిరమ్మ చీరలు పంపిణీ పున: ప్రారంభించిన మహిళ సంఘం సభ్యులకు, మహిళలకు నూతన సర్పంచ్ మ్యాకల సురేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ప్రవేశపెడుతున్న పథకాలను మహిళలు, మహిళా సంఘం సభ్యులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/వంగూరు :** మండల పరిధిలోని వెలుమలపల్లి గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ రామస్వామిని సోమవారం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సర్పంచ్ పదవీ చాలా కీలకమని పదవీ ప్రజా సేవకే అంకితం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల లక్ష్మారెడ్డి, వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్, సుజీవన్‌రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు పర్వతాలుతదితరులున్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, మెడికల్ చట్ట నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం (డిస్ట్రిక్ లెవల్ అడ్వయిజరీ కమిటీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 183 ప్రభుత్వ, ప్రైవేటు అసుపత్రులలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుకోవడంతో పాటు అసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల అనుమతులు రద్దు చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు, వైద్యులు స్కానింగ్ చేసిన తర్వాత ఆడ,మగ అని చెబితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు స్కానింగ్ సెంటర్ అనుమతులు రద్దు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 39 స్కానింగ్ సెంటర్లకు అనుమతులు ఉన్నాయని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను అదేశించారు. జిల్లాలో అడ పిల్లల నిష్పత్తి చాలా తక్కువగా ఉందని వెయ్యి మంది అబ్బాయిలు ఉంటే 890 మంది అమ్మాయిలు ఉన్నారని అందుకు కారణం కొన్ని స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు జరిపి అబార్షన్లు చేయడం జరుగుతుందన్నారు. పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం 1994 నుంచి అమలులో ఉందని అతిక్రమించిన వారిని సుప్రీంకోర్టు సూచనల ప్రకారం కఠినంగా శిక్షిస్తామని, చట్టం అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిఎంహెచ్ఓ డాక్టర్ రవి నాయక్, కమిటీ సభ్యులు డాక్టర్ చెన్నయ్య, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మన్ లక్ష్మణరావు, డాక్టర్ తారసింగ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

**ప్రజావాణిలో 50 ఫిర్యాదులు**

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను అదనపు కలెక్టర్‌లు పి.అమరేందర్, దేవసహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 50 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో గల ప్రజా సమస్యల పరాష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కారించాలని అదేశంచారు.వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కారించాలని అధికారులను కటెక్టర్ అదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎలాంటి యూరియా కొరత లేదు

ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలో యూరియా కొరత లేదని ఇన్చార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తి స్థాయిలో కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలలో, ప్రైవేట్ డీలర్స్ దగ్గర అవసరమైనంత స్టాకు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాకు యూరియా అవసరం 2394 ఎంటి కాగా ఇప్పటికే 3000 ఎంటి రైతులకు సరఫరా చేసినట్లు, ఇంకా వివిధ పంపిణీ కేంద్రాలలో 1009 ఎంటి, మార్క్‌ఫెడ్‌లో యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు డీలర్ యూరియా పంపిణీ కేంద్రం ముందు తప్పనిసరిగా షామియానా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకే కౌంటర్ వద్ద రద్దీ ఏర్పడకుండా ప్రతి కేంద్రంలో అవసరానికి అనుగుణంగా బహుళ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడ అంతరాయం లేకుండా స్టాక్ అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేవారు. రైతుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటల నుంచి యూరియా విక్రయాలు ప్రారంభించాలన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీలో ఇలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతానని తెలిపారు.



## శ్రమ జీవుల పక్షాన పోరాడుతున్నది కమ్యూనిస్టులే

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతూరి శ్రీరామ్

**ప్రజాపక్షం/పానుగల్:** యూపీఏ ప్రభుత్వంలో కూలీల కడుపు నింపేందుకు కమ్యూనిస్టులు కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చి సాధించిన ఉపాధి హామీ పథకంపై బిజెపి ప్రభుత్వం కక్ష కట్టి కుట్రతో నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, మాజీ ఉపసర్పంచు బాలస్వామి విమర్శించారు. పానుగల్ మండలం తెల్లరాళ్లపల్లి, వెంగలాయిపల్లి గ్రామాల్లో సిపిఐ వందేళ్ల వారోత్సవాలను నిర్వహించారు. తెల్లరాళ్లపల్లిలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి 8వ వార్డు సభ్యుడు సహదేవ్, వెంగలాయపల్లిలో గ్రామ శాఖ కార్యదర్శి మల్లెపు బాలస్వామి ఎర్రజెండాలని ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని కాలంలో పనులు లేక కూలీల పస్తులు పెరిగాయి అన్నారు. యూపీఏ ప్రభుత్వానికి 2005 లో మద్దతు కడుపు నింపేందుకు ఉపాధి హామీ పథకం (వంద రోజుల పని) చేపట్టాలని ఒత్తిడి తెచ్చాయన్నారు. 90% నిధులు కేంద్రం 10% నిధులు రాష్ట్రాలు భరించేలా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరుతో పథక రూపకల్పన జరిగిందన్నారు. సిపిఐ పేదల పక్షం శ్రమజీవుల పక్షమని ప్రజలు ఎర్రజెండా కింద సంఘటితమై హక్కుల సాధన కోసం పోరాడాలని కోరారు. మాజీ ఉపసర్పంచు కాకం బాలస్వామి, సిపిఐ మండల కార్యదర్శి దంగు కురుమయ్య, మాజీ కార్యదర్శి శివకుమార్, లింగన్న, కట్టెల బాలస్వామి, పరంధాములు, మల్లెపు కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం జరిగేలా పారదర్శక విచారణ

జిల్లా ఎస్పీ డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి/గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా, సోమవారం మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా దరకాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను శ్రద్ధగా విని, ఆయా సమస్యలను సంబంధించిన వివరాలను సంబంధిత పోలీస్ అధికారులు, ఎస్.హెచ్.ఓలతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారణ చేపట్టి, చట్టపరమైన విధి విధానాల ప్రకారం తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. బాధితులకు భరోసా కల్పిస్తూ, అనవసరంగా సివిల్ వివాదాలలోకి వెళ్లకుండా చట్ట పరిధిలోనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలకు పరిష్కారం లభించని సందర్భాల్లో ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లోను కాకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి. జానకి స్పష్టం చేశారు.

## విద్యార్థిని అభినందించిన సిబ్బంది



**ప్రజాపక్షం/జడ్చర్ల :** స్థానిక డా.బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ) జడ్చర్లలో తృతీయ సంవత్సరం చదువుతున్న బెస్త అభిలాష్‌ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.సుకన్య సన్మానించారు. ఈనెల 22 నుండి 28 వరకు హైదరాబాద్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి విద్యా సంస్థలలో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరం పాలమూరు విశ్వవిద్యాలయం నుండి ప్రాతిపదిక వహించాడు. అభిలాష్ కళాశాలలోని ఎన్ఎస్ ఎస్ యూనిట్ 3లో వాలంటీర్‌గా కొనసాగుతున్నాడు అని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ వారం రోజుల్లో భారతదేశం నలుమూలల నుండి వచ్చిన వాలంటీర్లతో కలిసి అనేక పర్యావరణ హిత కార్యక్రమాలలో పాల్గొన్నాడని, సాంస్కృతిక కార్యక్రమాలలో పాటు పంచుకున్నాడని, వివిధ శిక్షణ తరగతులలో పాల్గొన్నాడని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.బి.సదాశివయ్య తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల దేశం మీద భక్తిభావం పెరుగుతుందని ఇలాంటి విద్యార్థులు ఎందరికో ఆదర్శమని ప్రిన్సిపల్ కొనియాడారు. అభిలాష్‌ను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సదాశివయ్య, అధ్యాపకుడు రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేరస్తులకు శిక్షపడేలా చూడాలి

జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాణ్యమైన దర్యాప్తులో నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని జిల్లా అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్, కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ క్రైమ్ పరిస్థితులపై సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ వారీగా క్రైమ్ కేసులను పరిశీలిస్తూ ,ఇటీవల నమోదైన వివిధ రకాల కేసుల విచారణ, పురోగతపై సమీక్ష చేపట్టారు. విచారణలు సమయానికి పూర్తి చేసి న్యాయపరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని, ఆలస్యం లేకుండా ప్రజా భద్రతకు సంబంధించిన అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కేసుల నమోదు నుండి దర్యాప్తు వరకు ప్రతి దశలో పారదర్శక పాటిస్తూ ప్రజలు నమ్మకాన్ని పెంపోందించేందుకు కృషి చేయాలని అదనపు ఎస్పీ వెంకటశ్వర్లు తెలిపారు. నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులు కానీ వారి హక్కులను కాపాడటం పోలీసుల బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో కల్వకుర్తి సబ్ డివిజన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐలు నాగర్జున, విష్ణువర్ధన్‌రెడ్డి రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# 50-60 కాలనీలతో ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేయాలి

జవహర్ నగర్-చంద్రపురి ప్రజల ప్రధాన డిమాండ్

సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పణ



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిలో ఇటీవల జవహర్ నగర్, చంద్రపురి ప్రాంతాలు రెండు డివిజన్లుగా ఏర్పాటు చేసినప్పటికీ, పరిపాలనా సమస్యలు తీరలేదని స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు డివిజన్ల పరిధిలోనే సుమారు 50 నుంచి 60 కాలనీలు ఉండటంతో జనాభా భారము విపరీతంగా పెరిగి, ప్రజలకు కనీస మౌలిక వసతులు కూడా సకాలంలో అందడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు డివిజన్ల పరిధిలో అంబేద్కర్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీ, చంద్రపురి కాలనీ, కేఎస్ఆర్ కాలనీ, దొండపల్లి కాలనీ, దొడ్లపల్లి కాలనీ, సాయినగర్ కాలనీ, విజయ్ నగర్ కాలనీ, శ్రీనివాస్ నగర్, ఎస్ఆర్ కాలనీ, కృష్ణా నగర్, పవన్ నగర్, భగత్ సింగ్ నగర్, గోకుల్ నగర్, సుభాష్ నగర్, సంతోష్ నగర్, జయశంకర్ కాలనీ, ఇందిరా నగర్, అంబర్‌పేట్ నగర్, ఆర్‌కే నగర్, డీఆర్ కాలనీ, నెహ్రూ నగర్, వాసవి నగర్, యాదవ్ కాలనీ, కళ్యాణ్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, న్యూ సంజయ్ నగర్, హనుమాన్ నగర్, బాలాజీ నగర్, డాక్టర్ అంబేద్కర్ నగర్, వివేకానంద కాలనీ, బీఆర్ అంబేద్కర్ నగర్, సాయిరామ్ నగర్, అశోక్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నగర్, సావాలన్ నగర్, శివశంకర్ నగర్, ఫలక్‌నుమా కాలనీ, వాల్మీకి నగర్, బసవేశ్వర కాలనీ, గాంధీ నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, హోమ్ నగర్, శ్రీవాస్ కాలనీ, మోహన్‌రావు కాలనీ, బీష్మా నగర్, స్వరాజ్ నగర్, పవన్ నగర్2 తదితర కాలనీలు ఉన్నాయి. ఇంత విస్తారమైన ప్రాంతం, లక్షకు పైగా జనాభాతో ఒకే డివిజన్ పరిధిలో పాలన కొనసాగించడం అసాధ్యమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, చెత్త సేకరణ వంటి మౌలిక సమస్యలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని, అధికారులను సంప్రదించినా సరైన స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారంగా జవహర్ నగర్‌చంద్రపురి డివిజన్లలోని కొన్ని కాలనీలను విడగొట్టి, వాటిని కలిపి కొత్తగా ఒక ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని నేరుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌ను మరింత బలంగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాగులు, అనిల్ ముదిరాజ్, సిద్దులు, శివ, సురేష్, జావీద్ తదితరులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జనాభా పెరుగుదల, కాలనీల విస్తరణ, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి కొత్త ప్రత్యేక డివిజన్ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని జవహర్ నగర్‌చంద్రపురి ప్రాంతాల ప్రజలు మరోసారి గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామాభివృద్ధికి శ్రీకారం

రోడ్డుకిరువైపులా కంప, చెట్ల తొలగింపు

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** నూతనంగా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. మండల పరిధిలోని గోపాల్ దిన్నె గ్రామ సర్పంచు దొడ్ల కవిత ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాల రోడ్డు నుంచి వీపనగండ్ల క్రాస్ రోడ్డు వరకు రోడ్లకు ఇరువైపులా విస్తరించి ఉన్న కంపచెట్లను జెసిపి సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. కంపచెట్ల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో సమస్య పరిష్కారానికి సర్పంచు చర్యలు తీసుకున్నారు. రోడ్డు విస్తర్ణతో పాటు దృశ్యమానత మెరుగుపడడంతో గ్రామస్థులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి ఇదే తరహాలో మరిన్ని పనులు చేపడతామని సర్పంచు దొడ్ల కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు వెంకట్ స్వామి, కార్యదర్శి కర్ణాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.బాల్‌రెడ్డి, వార్డు మెంబర్స్ నరేష్, గ్రామ యువకులు దేవయ్య, శ్రీకాంత్, రఘు పాల్గొన్నారు.

## నిధులను ఎవరు అడ్డుకోలేరు



చేవెళ్ల బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గ్రామ పంచాయతీ నిధులు ఏ పార్టీలో వున్నా వచ్చే నిధులను ఎవరు అడ్డుకోరు బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు ఎవరు భయపడొద్దు అని చేవెళ్ల బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. సోమవారం నవాబుపేట్ మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులను, అలాగే గెలుపు అంచులవరకు వెళ్లి ఓడినా సర్పంచ్ అభ్యర్థుల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటిన అత్తాపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, ముబారక్ పూర్ సర్పంచ్ జాయయ్య, మాదిరెడ్డిపల్లి సర్పంచ్ ఎర్రోళ్ల కిష్టయ్య, మూలమాడ సర్పంచ్ స్వాతి నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులకు మండలంలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్‌గా విజయం సాధించిన వారికి, గెలుపు అంచుల వరకు వచ్చి ఓడినా సర్పంచ్ వార్డ్ సభ్యుల అభ్యర్థులను చేవెళ్ల బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, వికారాబాద్ జిల్లా పార్టీ ఇంచార్జి మెతుకు ఆనంద్, మాజీ ఛైర్మన్ జీ.నాగేందర్ గౌడ్, మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డితో కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన వారిలో ముందున్న సామాజిక వర్గం, నేడు స్థానిక ఎన్నికల్లో భాగంగా మండలంలోనే భారీగా సర్పంచ్, వార్డు స్థానాలు బిఆర్ఎస్ నాయకులు కైవసం చేసుకోవడం రాజకీయంగా ఒక మెట్టు ఎక్కడమే అని ఇది చాలా గొప్ప విషయం అని అన్నారు. అలాగే రానున్న ఎంపిటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా తమదైన శైలిలో అడుగులు వేసి భారీ స్థానాలు కైవసం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు పి.భరత్ రెడ్డి,ముఖ్య సలహా దారులు మందుల విజయ్ కుమార్, టైగర్ కృష్ణ, విజయ్ మౌర్య, నారాయణ, సయ్యద్ గౌస్, పూరషోత్తం చారి, శాంతికుమార్, మహేశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు వార్డు సభ్యులు మొదలగు వారు పాల్గొన్నారు.

# క్రీడ



## విజయ్ హజారేలో తీన్మార్‌కు
# కోహ్లి రెడీ!

అంతర్జాతీయ వన్డేల్లో శతకాల కింగ్‌గా అవతరించిన విరాట్ కోహ్లి అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పాడు. విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీ, అర్ధ శతకంతో మెరిసిన విరాట్.. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ సమీపిస్తుండడంతో కీలక నిర్ణయం తీసుకున్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో మరో మ్యాచ్ ఆడేందుకు రన్ మెషీన్ సిద్ధమవుతున్నాడు. ఈ విషయాన్ని సోమవారం ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ వెల్లడించాడు. దాంతో.. ఈ లీగ్‌లో కోహ్లి రెండు మ్యాచ్‌లకే పరిమితం అవుతాడనే వార్తలకు చెక్ పడింది. ఆస్ట్రేలియా పర్యటనలో చివరిదైన సిడ్నీ వన్డేతో ఫామ్ అందుకున్న విరాట్ కోహ్లి పరుగుల వరద కొనసాగిస్తున్నాడు. ఈమధ్యే స్వదేశంలో సఫారీలపై వరుసగా రెండు శతకాలు బాదేసిన విరాట్.. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలోనూ శతకమోతతో అలరించాడు. రెండో మ్యాచ్‌లో గుజరాత్‌పై 77 పరుగులతో రాణించిన ఈ ఢిల్లీ బ్యాటర్ మళ్లీ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించనున్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ సమీపిస్తున్నందున ప్రాక్టీస్ కోసమని వీహెచ్‌టీలో మరో మ్యాచ్ ఆడేందుకు ఓకే చెప్పాడు. దాంతో.. టీమిండియా స్టార్ పరుగుల విందుకు అభిమానులు రెడీ అవుతున్నారు. 'ఇప్పటికైతే కోహ్లి విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. మూడు మ్యాచ్‌లు ఆడుతానని అతడు ఇదివరకే చెప్పాడు' అని రోహన్ జైట్లీ తెలిపాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జనవరి 6న రైల్వేస్‌తో ఢిల్లీ తలపడనుంది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ జనవరి 11న ప్రారంభం కానుంది. పదిహేనేళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీలో ఆడిన కోహ్లి రెండు మ్యాచుల్లో 131, 77 స్కోర్లతో చెలరేగాడు. తద్వారా లిస్ట్ – ఏ క్రికెట్‌లో అత్యధిక సగటు నమోదు చేశాడు.

### కోహ్లి, మైఖేల్ బెవాన్

ఆస్ట్రేలియా మాజీ ఫినిషర్ మైఖేల్ బెవాన్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టాడు. బెవాన్ సగటు లిస్ట్ ఏ క్రికెట్‌లో 57.86 కాగా.. కోహ్లి 57.87 తో అతడిని అధిగమించాడు. అంతేకాదు లిస్ట్‌ఏ క్రికెట్‌లో భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ అత్యల్ప మ్యాచుల్లోనే 16 వేల క్లబ్‌లో చేరాడు విరాట్. ప్రస్తుతం 343 మ్యాచుల్లో 57.60 సగటుతో 16,130 రన్స్ బాదాడు. ఇందులో 58 సెంచరీలు, 84 అర్ధ శతకాలు ఉన్నాయి.

# ధ్రువ్ భారీ శతకం..
## బరోడాపై యుపి విజయం



విజయ్ హజారే ట్రోఫీలో ధ్రువ్ జురెల్ ఫామ్ కొనసాగిస్తున్నాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అర్ధ శతకాలు చేసిన ఇతను.. బరోడాతో జరిగిన మ్యాచ్‌లో భారీ శతకం బాదాడు. జురెల్ (160; 101 బంతుల్లో 15 ఫోర్లు, 8 సిక్స్‌లు) చెలరేగడంతో యూపీ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 369 పరుగులు చేసింది. కెప్టెన్ రింకు సింగ్ (63; 67 బంతుల్లో) రాణించాడు. ఓపెనర్ అభిషేక్ గోస్వామి (51) హాఫ్ సెంచరీ చేశాడు. లక్ష్యఛేదనలో బరోడా 50 ఓవర్లలో 315 పరుగులకు ఆలౌటైంది. దీంతో యూపీ 54 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ కృనాల్ పాండ్య (82; 77 బంతుల్లో), శాశ్వత్ రావత్ (60), అతిత్ షెత్ (46), విష్ణు సోలంకి (43) పోరాడినా బరోడాకు ఓటమి తప్పలేదు.

### హైదరాబాద్‌పై చెమటోడ్చి నెగ్గిన అస్సాం

హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అస్సాం చెమటోడ్చి నెగ్గింది. తొలుత హైదరాబాద్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. రాహుల్ సింగ్ (79), అభిరత్ రెడ్డి (54), కాకి వరుణ్ గౌడ్ (42) రాణించారు. చివర్లో కె నితీశ్ రెడ్డి (53; 25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు ఇన్నింగ్స్‌తో అర్ధ శతకం చేశాడు. ఈ లక్ష్యాన్ని అస్సాం 6 వికెట్లు కోల్పోయి 49.3 ఓవర్లలో ఛేదించింది. అరబింద రాయ్ (112), సౌరవ్ డిహింగియా (91), డెనిష్ దాస్ (54) అస్సాం విజయంలో కీలక పాత్ర పోషించారు.

# క్రికెట్‌కు వీడ్కోలు
## న్యూజిలాండ్ దిగ్గజం బ్రేస్‌వెల్

న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డౌగ్ బ్రేస్‌వెల్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 18 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు సోమవారం అతడు బైబై చెప్పేశాడు. ఆల్‌రౌండర్‌గా న్యూజిలాండ్ విజయాల్లో కీలకమైన అతడు 35 ఏళ్ల వయసులో ఈ నిర్ణయం తీసుకున్నాడు. పక్కటెముకల గాయంతో ఇబ్బంది పడుతున్న ఈ స్టార్ క్రికెటర్ ఈసారి దేశవాళీ సీజన్‌కు దూరమయ్యాడు. వయసు పైబడుతుండడంతో పాటు జూనియర్లు అవకాశాలు అందిపుచ్చుకుంటున్న వేళ రిటైర్మెంట్‌కు సమయం వచ్చేసిందని బ్రేస్‌వెల్ భావించాడు. 'నా జీవితంలో క్రికెట్ చాలా గర్వించదగ్గది. చిన్నప్పుడు క్రికెటర్‌గా నేను కన్న కలల్ని నిజం చేసుకున్నాను. నాకు అవకాశం ఇచ్చినందుకు న్యూజిలాండ బోర్డుకు కృతజ్ఞుడిని. నా దేశం తరఫున ఆడడం, దేశవాళీలో సెంట్రల్ డిస్ట్రిక్స్‌కు ప్రాతినిధ్యం వహించడం మర్చిపోలేను.ఈ సందర్భంగా నాతో కలిసి ఆడిన సహచరులకు, కోచ్‌లు, మేనేజ్‌మెంట్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఫస్ట్ క్లాస్ క్రికెట్, ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడడం గర్వకారణం. సుదీర్ఘ కాలం క్రికెట్ కెరీర్ సాగినందుకు చాలా సంతోషిస్తున్నా' అని డౌగ్ బ్రేస్‌వెల్ తెలిపాడు.



### ఆస్ట్రేలియాపై 6/40

బ్రేస్‌వెల్ 2008లో ఫస్ట్ క్లాస్‌లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత మూడేళ్లకే సెలెక్టర్ల దృష్టిలో పడి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. 2011లో ఎంట్రీ ఇచ్చిన ఈ పేసర్ టెస్టులు, వన్డేలు, టీ20ల్లో కివీస్‌కు ప్రాతినిధ్యం వహించాడు. తన మూడో టెస్టులోనే ఆస్ట్రేలియాపై అత్యుత్తమ ప్రదర్శన(6/40)తో జట్టును గెలిపించాడీ దిగ్గజం. 2011 నుంచి 2023 మధ్య కాలంలో బ్రేస్‌వెల్ 28 టెస్టులు, 21 వన్డేలు, 20 టీ20లు ఆడాడు.

# ఫోకస్

## టారిఫ్ యుద్ధాల ప్రభావం..

టారిఫ్ యుద్ధాలు 2025లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతూ, నిరుద్యోగ సమస్య మరింత పెరగడానికి కారకంగా మారుతున్నాయి. దేశాలు తమ దేశీయ పరిశ్రమలను కాపాడుకునే పేరుతో దిగుమతులపై




అధిక సుంకాలు విధించినప్పుడు అంతర్జాతీయ వాణిజ్యం మందగిస్తుంది. దీనివల్ల ఎగుమతులపై ఆధారపడిన పరిశ్రమలకు ఆర్డర్లు తగ్గి, ఉత్పత్తి పరిమాణం తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉత్పత్తి తగ్గితే ఉద్యోగుల అవసరం కూడా తగ్గిపోతుంది. టారిఫ్‌ల కారణంగా ముడి సరుకుల ధరలు పెరగడం మరో కీలక అంశం. పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలు ఖరీదైనవిగా మారినప్పుడు, ఖర్చులు తగ్గించేందుకు కంపెనీలు ఉద్యోగ నియామకాలను నిలిపివేయడం లేదా ఉద్యోగులను తొలగించడం మొదలుపెడతాయి. ఇది ముఖ్యంగా తయారీ రంగం, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు టారిఫ్ యుద్ధాల ప్రభావాన్ని తట్టుకోలేక ఎక్కువగా నష్టపోతాయి. వీటికి పెద్ద కంపెనీల మాదిరి ప్రత్యామ్నాయ మార్కెట్లు లేదా నిల్వ నిధులు ఉండవు. ఫలితంగా వ్యాపారాలు మూతపడటం, ఉద్యోగాలు కోల్పోవడం వేగంగా జరుగుతుంది. టారిఫ్ యుద్ధాల వల్ల వినియోగదారులపై కూడా భారం పడుతుంది. ధరలు పెరగడంతో కొనుగోలు శక్తి తగ్గుతుంది. డిమాండ్ తగ్గినప్పుడు పరిశ్రమలు మరింతగా ఉత్పత్తిని తగ్గిస్తాయి. ఇది మరోసారి ఉద్యోగాల కోతకు దారితీస్తుంది. ఈ విధంగా టారిఫ్ యుద్ధాలు వాణిజ్యాన్ని కుదించటం, ఉత్పత్తి ఖర్చులను పెంచటం, వినియోగాన్ని తగ్గించటం ద్వారా ఒక దుష్ప్రభావాల శ్రేణిని సృష్టించి నిరుద్యోగాన్ని వేగవంతం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం వల్ల దీని ప్రభావం దీర్ఘకాలంగా సమాజంపై పడే ప్రమాదం ఉంది.




# కీలక పాత్ర..

యువత ఈ ఏడాది దాదాపు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషించింది. సామాజిక మార్పులకు ముందుండి నడిపించే శక్తిగా యువత తమ సృజనాత్మకతను, ధైర్యాన్ని, నవీన ఆలోచనలను ప్రదర్శించింది. విద్య, శాస్త్రసాంకేతిక రంగాల్లో యువ పరిశోధకులు కొత్త ఆవిష్కరణలతో ప్రపంచాన్ని ఆకర్షించగా, కృత్రిమ మేధ, డేటా సైన్స్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో యువత చేసిన కృషి అభివృద్ధికి కొత్త దిశలను చూపించింది. స్టార్టప్ సంస్కృతి విస్తరించడంలోనూ, ఉపాధి అవకాశాలు సృష్టించడంలోనూ యువత పాత్ర అత్యంత ప్రాముఖ్యంగా నిలిచింది. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికల ద్వారా యువత ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసింది. సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం వంటి అంశాలపై యువత చైతన్యాన్ని పెంచి, ఉద్యమాలకు రూపం ఇచ్చింది. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక కార్యక్రమాలు నిర్వహించడం, స్వచ్ఛంద సేవల్లో పాల్గొనడం ద్వారా యువత సామాజిక బాధ్యతను చాటుకుంది. కళలు, సాహిత్యం, సినిమా, సంగీతం వంటి సాంస్కృతిక రంగాల్లో కూడా యువత తమ కొత్త దృక్పథంతో సంప్రదాయాలకు ఆధునికతను కలిపింది. రాజకీయాలు, పాలన రంగాల్లోనూ ఈ ఏడాది యువత చురుకైన పాత్ర పోషించింది. ఓటు హక్కు వినియోగం పెరగడం, విధానాలపై విమర్శాత్మకంగా స్పందించడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ముందుకు రావడం ద్వారా యువత తమ ప్రాధాన్యతను నిరూపించింది. అలాగే క్రీడలు, ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో కూడా యువత కొత్త పద్ధతులు, సాంకేతికతను ప్రవేశపెట్టి మార్పుకు దోహదపడింది. మొత్తం మీద 2025ను యువత శక్తి, ఆశ, మార్పు ప్రతీకగా నిలిపిన సంవత్సరం. ఈ ఏడాది యువత ప్రపంచ స్థాయిలో ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఆర్థిక అనిశ్చితులు, ఉద్యోగ మార్కెట్‌లో వేగమైన మార్పులు యువత జీవిత లక్ష్యాలను, ఆశయాలను కొత్తగా నిర్వచించుకునే పరిస్థితిని సృష్టించాయి. సంప్రదాయ ఉద్యోగాలపై ఆధారపడటం తగ్గి, ఫ్రీలాన్సింగ్, స్టార్టప్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా స్వయం ఉపాధి వైపు యువత ఎక్కువగా మొగ్గు చూపుతోంది. సాంకేతికత యువత దైనందిన జీవితంలో కేంద్రబిందువుగా మారింది. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డేటా ఆధారిత నిర్ణయాలు చదువు, ఉద్యోగం, సృజనాత్మకత అన్నింటినీ ప్రభావితం చేస్తున్నాయి. దీనితో పాటు నైపుణ్యాభివృద్ధి, నిరంతర విద్య అవసరం యువతలో బలంగా వ్యక్తమవుతోంది. సామాజికంగా ఈ సంవత్సరం యువత మరింత చైతన్యవంతంగా కనిపిస్తోంది. పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం, లింగ సమానత్వం, ప్రజాస్వామ్య విలువలపై యువత గళం బలంగా వినిపిస్తోంది. డిజిటల్ మాధ్యమాలు వారి ఆలోచనలను ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేసే శక్తిని ఇచ్చాయి. అదే సమయంలో మానసిక ఆరోగ్యం ఒక ప్రధాన సమస్యగా మారింది. పోటీ ఒత్తిడి, భవిష్యత్తుపై అనిశ్చితి యువతను ఆందోళనలకు గురిచేస్తున్నాయి. దీనికి ప్రతిస్పందనగా స్వీయ సంరక్షణ, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. యువత మార్పుల భారాన్ని మోస్తూనే, కొత్త అవకాశాలను సృష్టించే శక్తిగా ఎదుగుతోంది. వారు ఎదుర్కొంటున్న సవాళ్లే రేపటి సమాజాన్ని మలిచే శక్తిగా మారుతున్నాయి. కాగా, భారతదేశంలో ఈ ఏడాది కూడా నిరుద్యోగం ఒక కీలక ఆర్థిక–సామాజిక సమస్యగా కొనసాగుతోంది. జనాభా పెరుగుదల, యువత సంఖ్య అధికంగా ఉండటం, ఉద్యోగాల సృష్టి ఆ వేగానికి తగినంతగా జరగకపోవడం వల్ల నిరుద్యోగ రేటు స్థిరంగా ఒత్తిడిలోనే ఉంది. పట్టణ ప్రాంతాల్లో చదువుకున్న యువత నిరుద్యోగం ఎక్కువగా కనిపిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అస్థిరత ప్రధాన సమస్యగా మారింది. కాగా, వచ్చే ఏడాది పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళ వ్యక్తమవుతున్నది. 2026లో ఎదురయ్యే ప్రధాన సమస్యలలో నైపుణ్యాల లోటు ఒకటి. విద్యా వ్యవస్థ ద్వారా పొందిన అర్హతలు ఉద్యోగ మార్కెట్ అవసరాలకు పూర్తిగా సరిపోకపోవడం వల్ల చాలా మంది యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు. ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాలు తగ్గుతూ, కొత్త తరహా ఉద్యోగాలకు కొత్త నైపుణ్యాలు అవసరమవుతున్నాయి. అలాగే ప్రపంచ ఆర్థిక మందగమనం, వాణిజ్య ఉద్రిక్తతలు భారత పరిశ్రమలపై ప్రభావం చూపి నియామకాలను పరిమితం చేస్తున్నాయి. వచ్చే ఏడాది కూడా ఇదే ధోరణి కొనసాగే ప్రమాదం ఉందని అంటున్నారు. అయితే, 2026పై కొన్ని ఆశాజనక అంచనాలు కూడా ఉన్నాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, స్టార్టప్‌లు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో కొత్త ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించాలనే ప్రయత్నాలు కొనసాగిస్తోంది. వచ్చే ఏడాది కూడా నిరుద్యోగ సమస్య తీవ్రమైనదే అయినప్పటికీ, సరైన విధానాలు, నైపుణ్యాభివృద్ధి ద్వారా భవిష్యత్తులో మెరుగుదల సాధ్యమనే ఆశ కూడా కనిపిస్తోంది.

టినీ ప్రభా




# గ్రామ గ్రామానికి పార్టీ సందేశం
## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/ఖమ్మం :** శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ గ్రామానికి పార్టీ సందేశాన్ని చేరవేస్తున్నామని, సభలు, సమావేశాల ద్వారా నేటి తరానికి పార్టీ చరిత్ర తెలియజేస్తున్నామని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18న జరిగే శతాబ్ది ఉత్సవ పోస్టర్‌ను సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ వందేళ్ల సంబురాన్ని ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నామని ఈ సభకు ఐదు లక్షల మందిని సమీకరిస్తున్నట్లు తెలిపారు. దేశం నలుమూలల నుంచి భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రాతినిథ్యం వహిస్తూ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు. జనవరి 18న ఖమ్మం నగరానికి నలు వైపులా నుంచి ప్రదర్శనలు ప్రారంభమై ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానానికి చేరుకుంటాయన్నారు. పార్టీ ప్రజాసంఘాలకు ప్రాతినిథ్యం వహిస్తూ ప్రత్యేక ఆకర్షణగా కళాకారులు ప్రదర్శనలో పాల్గొననున్నట్లు హేమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా 19 నుంచి 20 వరకు సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు యానాలి సాంబశివరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, యాకన్న, ఆరెంపుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతజయంతి సభలు భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం
## సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** సిపిఐ శతజయంతి సభలు భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేస్తాయని పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో నిర్వహించే బహిరంగ సభకు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా జనవరి 10న రామకృష్ణాపూర్‌లో వేలాది మందితో జిల్లా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సభకు పార్టీ, ప్రజాసంఘాలు, సానుభూతిపరులు, కార్మికులు, రైతులు సమష్టిగా సహకరించి విజయవంతం చేయాలని రామడుగు లక్ష్మణ్ కోరారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, నాయకులు వనం సత్యనారాయణ, మిట్టపల్లి పౌల్, ఈరవేణి రవి, కిష్టయ్య, శంకర్, గాజుల మణెమ్మ, సాంబయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి ప్రత్యామ్నాయం

కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న బిజెపి విధానాలపై పోరాటం
ఖమ్మం బహిరంగసభకు వేలాదిగా తరలాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** దేశంలో మొట్టమొదటి ఎర్ర జెండా పార్టీ సిపిఐ అని, అలాంటి తల్లి పార్టీ నుంచే అనేక కమ్యూనిస్టు పార్టీలు పుట్టుకొచ్చాయని, అవి అన్ని ఐక్యం అయి బలం పెంచుకొని ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లాకేంద్రం లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు మరియు గ్రామ శాఖ కార్యదర్శుల సంయుక్త సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో మూడవ సారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడానికి అడ్డుఅదుపు లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను హరిస్తూ నియంతృత్వ ధోరణితో పాలన సాగిస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అంతం చేస్తూ, ఎన్‌కౌంటర్లుగా చిత్రీకరిస్తున్నారని, తాత్కాలికంగా మావోయిస్టులను చంపచ్చేమో కానీ, వారి ఆశయాలను ఏమీ చేయలేరన్నారు. పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను, హక్కులను హరిస్తున్నారని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా నిర్వీర్యం చేయడానికి పథకం పేరు మార్చడం దుర్మార్గమన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సంపదను నిర్వీర్యం చేస్తుందని, మోదీ ప్రభుత్వ విధానాలపై తిరగబడి పోరాటాలు చేయక తప్పదని చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటు న్న నేపథ్యంలో జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, దేశ విదేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని, బహిరంగసభ విజయవంతం కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ఖమ్మంకు తరలిరావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఐ వందేళ్ళ ఉత్సవాలలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో జనవరి 4న భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు తరలి వచ్చి ర్యాలీ, బహిరంగసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి,బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజుతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, గ్రామ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సింగరేణికి బకాయిలు ఇవ్వాల్సిందే
## ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/నస్పూర్ :** రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన 45 వేల కోట్ల రూపాయల బకాయిలు వచ్చేలా ఐఎన్‌టియుసి కృషి చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణికి రావాల్సిన బకాయిలు రూ.19వేల కోట్లు ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవి రూ.45వేల కోట్లకు చేరాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సింగరేణిసంస్థపై ఆధారపడిందని, ప్రస్తుత సంస్థ పరిస్థితికి ఐఎన్‌టియుసి, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని ఆరోపించారు. సింగరేణిలో సరైన పనిముట్లు అందుబాటులో లేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులను ఆన్ డ్యూటీగా పరిగణించడానికి యాజమాన్యం అంగీకరించిందని చెప్పారు. పెర్క్స్‌పై ఐటి చెల్లించడానికి పర్సనల్ డిపార్ట్మెంట్ నుంచి నోట్ అప్రూవల్ అయి సిఎండి దగ్గరికి వెళ్లిన తర్వాత డిప్యూటీ సిఎంతో ప్రకటన ఇప్పించడానికి ఐఎన్‌టియుసి నాయకులు ఆపారని విమర్శించారు. పాత పద్ధతిలో స్పెషల్ ఇన్సెంటివ్ లు ఇవ్వడానికి, మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి సర్ఫేస్‌లో ఉద్యోగాలు ఇవ్వడానికి, బదిలీ వర్కర్, సర్వే మజ్దూర్, సాంప్లింగ్ మజ్దూర్ డెసిగ్నేషన్ల మార్పుకు యాజమాన్యం అంగీకరించిందని ఆయన వివరించారు. ఐఎన్‌టియుసి నాయకులకు హెడ్ ఆఫీస్‌లో సమావేశం నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా గెలిచినప్పటి నుంచి అనేక కార్మిక సమస్యలు పరిష్కరించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో గుర్తింపు సంఘం ఏరియా బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కె.బాజీ సైదా, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, జిఎం కమిటీ సభ్యులు చంద్రమోహన్, నాగభూషణం, శ్రీనివాస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ సెక్రటరీ అఫ్రోజ్ ఖాన్, నాయకులు గుడిగంటి నరసింహారావు, మురళి చౌదరి, సదానందం, యాదగిరి, శ్రీకాంత్, రమేష్, రవి, పవన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




# దేశ సంపద కార్పొరేట్లకు ధారాదత్తం
## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్





**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ విమర్శించారు. సోమవారం నిర్మల్ జిల్లా సిపిఐ కౌన్సిల్ సమావేశం ఎస్ఎన్.రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలవేన శంకర్ మాట్లాడుతూ దేశంలోని విలువైన భూములను కారుచౌకగా విదేశీ సంస్థలకు అప్పగిస్తూ మోదీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పణంగా పెడుతోందని విమర్శించారు.

**గాంధీ సిద్ధాంతాలను కనుమరుగు చేసే కుట్ర...**
స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్ట్ పార్టీ చేసిన త్యాగాలను ఎవరూ మరువలేరని శంకర్ గుర్తుచేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ సిద్ధాంతాలను కనుమరుగు చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. నిర్మల్ జిల్లాలో సిపిఐ బలోపేతం అవుతోందని, ఇటీవల ఇద్దరు సర్పంచ్‌లు, 11 మంది వార్డు సభ్యులు గెలవడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో పార్టీ బలంగా ఉన్న చోట, కలిసి వచ్చే శక్తులతో కలిసి పోటీ చేస్తామని ప్రకటించారు.

**శత వసంతాల బస్సు యాత్రకు బ్రహ్మరథం ...**
బాసర పుణ్యక్షేత్రం నుంచి ప్రారంభమైన సిపిఐ వంద ఏళ్ల బస్సు యాత్రకు కార్మిక వర్గం నుంచి అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు. 2026 సభ్యత్వ నమోదును అన్ని మండలాల్లో ముమ్మరం చేస్తామని, ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరాలని కలవేన శంకర్ పిలుపునిచ్చారు. సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భుక్య రమేష్ మాట్లాడుతూ జనవరి 18న ఖమ్మంలో జరగనున్న సిపిఐ శత వసంతాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరారు. నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల నుండి కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గిరిజన, వ్యవసాయ కార్మిక, మహిళా, విద్యార్థి, యువజన సమస్యలపై నిరంతరం పోరాడుతున్నది సిపిఐ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ముధోల్ నుంచి శివాజీ, నిర్మల్ నుంచి పుండలీక్‌తో పాటు అన్ని మండలాల నుంచి పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అవసరాల మేరకు యూరియా సరఫరా : కలెక్టర్



ప్రజాపక్షం/రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతోందన్నారు.. ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలకు అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని చెప్పారు. రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యూరియా సరఫరాలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు.

## సమర్థవంతంగా సంక్షేమ పథకాల అమలు




ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని యాచారం మండల అభివృద్ధి అధికారి రాధరాణి కోరారు. సోమవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. చెట్లు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాదికారి రేఖా, ఐకెపి ఎపిఎం రవీంధర్, ఎంపిఎం లింగయ్య, ఇంజనీర్ శివశంకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఓగా పదోన్నతి పొందిన తహసీల్దార్ రవీందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కొత్తూరు : మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌రెడ్డి ఆర్‌డిఓగా పదోన్నతి పొందారు. కొత్తూరు మండల రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించారు. రవీందర్ రెడ్డికి పదోన్నతి రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు.

## అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి



ప్రజాపక్షం/కేశంపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో నూతనంగా ఎన్నికైన నిర్ధవెల్లి ఉపసర్పంచ్ సపూరా ఆమేర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి సంతోష్, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, నియోజకవర్గ అధ్యక్షులు పులిమామిడి రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## అన్నివిధాలా గ్రామాభివృద్ధి





ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్: లష్కర్ గూడా గ్రామంలో అల్లే ఐలెయ్య యాదవ్ సర్పంచ్‌గా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లష్కర్ గూడా గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని, గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న పాలకవర్గం తప్పకుండా పరిష్కారం చేస్తుందన్నారు. ఉపసర్పంచ్ కరిమళ రాజు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎల్లపుడు అందుబాటులో ఉంటానని, గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న మా పాలకవర్గం దృష్టికి వస్తే ముందు ఉండి వాటిని పరిస్కారం చేస్తాం అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ శివ, వార్డు సభ్యులు సిద్ధగోని మధుసూదన్ గౌడ్, సూర్వి రజిత శ్రీకాంత్ గౌడ్, గుండె శివ ప్రసాద్, సిద్ధగోని యాదయ్య గౌడ్, గుండె కవిత సుధాకర్ గుండె లక్ష్మిమ్మ పెద్దజంగయ్య, మొహమ్మద్ హుసేన్, నల్ల దివ్య జోతి రాజ్ యాదవ్, మొహమ్మద్ నజీమా అమీద్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఐవిపై అవగాహన ర్యాలీ




ప్రజాపక్షం/హయత్ నగర్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితా దేవి సూచన మేరకు, అడిషనల్ డిఎంహెచ్‌ఒ(ఎయిడ్స్ అండ్ లేప్రోజీ) డాక్టర్.వై.పాపారావు ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవి/ఎయిడ్స్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సోమవారం హయతనగర్ ఆటోనగర్ ఏరియాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దిశ సిబ్బంది డానియెల్, రమేష్, మొబైల్ ఐసి టిసి కౌన్సిలర్ గీతాలు, విఎస్‌ఎస్ ఎటిఐఎన్‌జిఒ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి విరాళం



ప్రజాపక్షం/సరూర్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రసన్న మహంకాళి దేవాలయ ప్రాంగాణంలో నూతనంగా నిర్మిస్తున్న శాశ్వత షెడ్డు నిర్మాణానికి మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 25వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కొత్తపేట అధ్యక్షుడు మాదూరి వాసు గుప్తా, ఆర్‌కెపురం అధ్యక్షులు ఉప్పల బాలశ్యామ్, జగిని రమేష్, వీరలింగం, శ్రీనివాస్, చీకోటి కరుణాకర్, రేణుగుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక నజర్

క్షేత్రస్థాయిలో జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా జిహెచ్‌ఎంసి కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం నుంచి నగరం అంతటా 'ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం' ప్రారంభమైంది. పారిశుద్ధ్య పనులపై జోనల్, డిప్యూటీ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు.

### తొలిరోజు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల క్లీనింగ్

ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మొదటి రోజు నగరవ్యాప్తంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిల (ఎఫ్‌ఓబిలు) శుభ్రతపై అధికారులు దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను జోనల్, డిప్యూటీ కమిషనర్లు స్వయంగా పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలు చేస్తూ పారిశుద్ధ్య ప్రక్రియను వేగవంతం చేశారు.

### కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

పారిశుద్ధ్య కార్యక్రమం అమలు తీరును పరిశీలించేందుకు కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కిస్మత్ పూర్, నార్సింగి, సన్ సిటీ తదితర ప్రాంతాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా అలసత్వం ప్రదర్శించవద్దని, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రభావవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రధాన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కింది పనులను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. నగరవాసులకు మెరుగైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే ఈ డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి హైదరాబాద్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కమిషనర్ స్పష్టం చేశారు.

## వెయ్యి గజాల పార్కును కాపాడిన హైడ్రా

రూ.13 కోట్ల విలువైన స్థలానికి పెన్సింగ్ ఏర్పాటు




ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరి లింగంపల్లి మండలం మదీనాగూడ గ్రామంలో ఉన్న 1000గజాల పార్కు స్థలాన్ని హైడ్రా సోమవారం కాపాడింది. సుమారు రూ.13 కోట్ల విలువైన ఈ స్థలం ప్రజాఅవసరాల కోసం కేటాయించబడినదిగా అధికారులు నిర్ధారించారు. సర్వే నెంబర్ 23లో ఉషోదయ ఎన్‌క్లేవ్ పేరిట హుడా అనుమతితో లేఔట్ ఏర్పాటు చేయగా, అందులో 1000 గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. ఈ స్థలాన్ని జిహెచ్‌ఎంసికి గిఫ్ట్ డీడ్ ద్వారా అప్పగించినట్లు అధికారిక రికార్డుల్లో స్పష్టంగా ఉంది. ప్రజల వినియోగంలో ఉండాల్సిన ఈ పార్కు స్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ పెద్దాయన అక్రమంగా కబ్జా చేసి, చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నారు. దీనిపై ఉషోదయ ఎన్‌క్లేవ్ నివాసితులు కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. స్పష్టమైన పత్రాలు ఉన్నప్పటికీ, స్థానిక యంత్రాంగం ఈ స్థలాన్ని పరిరక్షించడంలో విఫలమైంది. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. ఈస్థలం పార్కుకు కేటాయించినదేనని నిర్ధారించిన అనంతరం, సోమవారం అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేసి, చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ స్థలం ప్రజా అవసరాల కోసం పార్కుగా కేటాయించబడిందని తెలియజేస్తూ హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ప్రజా ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తీసుకున్న చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## పేరుమార్పుతో 'ఉపాధి' ఎత్తివేతకు కుట్ర






బికెఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపణ

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బికెఎంయు ధర్నా

ప్రజాపక్షం/రంగారెడ్డి: పేరు మార్పుతో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని రంగారెడ్డి జిల్లా బికెఎంయు అధ్యక్షుడు జె.అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. విబిజి రాంజీ పథకం రద్దుచేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకన్ని తిరిగి అమలు పరచాలని రంగారెడ్డి జిల్లా బికెఎంయు అధ్యక్షులు జె అంజయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్యలు అన్నారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) జిల్లా సమితి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి హాజరై వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాముని పేరు లేనిదే గడవదన్నట్టుగా విబిజిరామ్ జి మార్చడం అంటే దాని వెనుక ఆంతర్యమేమిటో యావత్ ప్రజానీకానికి అవగతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలనేది సరికాదన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో బికెఎంయు జిల్లా ఉపాధ్యక్షులు జిల్లెల్ల వెంకటేష్, శ్రీశైలం, స్వరూప, జిల్లా సహాయ కార్యదర్శి గాలయ్య, రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం, అనంత, యశోద, లక్ష్మమ్మ, నరసమ్మ, యాదమ్మ, బాలమ్మ, ఎఐటియుసి నాయకులు ఎండి షబ్బీర్, చిన్నయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టిపిసిసి సభ్యుడు భాస్కర్‌రెడ్డి

ప్రజాపక్షం/సరూర్‌నగర్ : మహేశ్వరం నియోజకవర్గంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు అండగా ఉంటామని, ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందజేసేలా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే కిచ్చనగారి లక్ష్మారెడ్డి, టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని ఆర్‌కెపురం, సరూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంకల్ సర్దార్‌నగర్‌లో ఇళ్ల పట్టాలు పొందిన ప్రతిలబ్ధిదారుడికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు దక్కేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, బండి మదుసూదన్, రమేష్‌నేత, లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## టౌన్ ప్లానింగ్ విభాగంలో పదోన్నతులు

నలుగురు అదనపు డైరెక్టర్లకు డైరెక్టర్ హోదా

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ (ఎంఎయుడి) టౌన్ ప్లానింగ్ విభాగంలో కీలక పదోన్నతులు కల్పించింది. 2025–26 ప్యానెల్ సంవత్సరానికిగాను నలుగురు అదనపు డైరెక్టర్లను డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ (కేటగిరీ–1)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో ఎం. భవాని రాణి, బి.ఎస్. చంద్రిక, బి. ప్రదీప్ కుమార్, బి. వెంకన్న ఉన్నారు. ఈ పదోన్నతులు పూర్తిగా అడ్‌హాక్ ప్రాతిపదికన కల్పించబడినవని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదోన్నతి పొందిన అధికారులు ఉత్తర్వులు అందిన 15 రోజుల్లోగా సంబంధిత పోస్టుల్లో విధుల్లో చేరాల్సి ఉంటుందని, గడువు దాటితే ప్రస్తుతంతో పాటు భవిష్యత్తు పదోన్నతులు కోల్పోయే అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

## జనాభా నిష్పత్తి ప్రకారమే మేజర్ పంచాయతీలను మండలాలు చేయాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/షాద్‌నగర్: జనాభా నిష్పత్తి ప్రకారమే మేజర్ గ్రామ పంచాయతీలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శాసనమండలిలో ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద, చించోడు, నందిగామ మండలం చేగూరు మేజర్ గ్రామ పంచాయతీలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకువెళ్ళారు.

### మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఘన స్వాగతం

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. సోమవారం మొదటిరోజు శాసనసభకు కెసిఆర్ వచ్చిన నేపధ్యంలో కారు వద్దకు వెళ్ళి ఎమ్మెల్సీ సాదరంగా ఆహ్వానం పలికారు.

## రోబోటిక్ శస్త్రచికిత్సలపై అవగాహన




ప్రజాపక్షం/సరూర్‌నగర్ : రోబోటిక్ ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సలపై ఈ అకాడమిక్ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి సాంకేతిక అవగాహన, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించిన విజయవంతం చేసిన ప్రముఖులకు కృతజ్ఞతలు అని ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ నిర్వాహకులు, ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ బాలరాజునాయుడు అన్నారు. సోమవారం చంపాపేటలోని ఓ హోటలో దేశం నలుమూల నుంచి వచ్చిన ప్రతినిధులతో రోబోటిక్ ఆర్థోపెడిక్స్‌పై విశిష్ట స్థాయి ఆకడమిక్ సమావేశాన్ని డాక్టర్లు బాలరాజునాయుడు, కార్తిక్ రెపకుల, మధుసూదన్, రాజశేఖర్‌పప్పులతో పాటు డాక్టర్ అరుణ్ నిర్వహించారు. ఓనస్ రోబోటిక్ ఆస్పిటల్స్ ఛైర్మన్ రామానాయుడు హాజరై ప్రారంభించారు. సమావేశంలో డాక్టర్ బాలరాజునాయుడు మాట్లాడుతూ రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలతో సాంకేతిక సైపుణ్యాలు, అవగాహనను అందించిందన్నారు.

## పదవుల కోసం.. పెదవులు విప్పని కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/తుర్కయంజాల్ : గ్రేటర్‌లో విలీన మున్సిపాలిటీలు అస్తవ్యస్తం అవుతున్నా కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు విప్పడం లేదని జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి ఆరోపించారు. సోమవారం తుర్కయంజాల్ పరిధి రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో బిఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుర్కయంజాల్‌నీ నామరూపం లేకుండా చేస్తున్నారన్నారు. కొత్త వార్డుల ఏర్పాటులో తుర్కయంజాల్ మున్సిపాలిటీ రెండు వార్డులుగా విభజించి ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. తుర్కయంజాల్‌ను నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేసి తుర్కయంజాల్‌లోనే సర్కిల్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కందాడ లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, ఒక్క గౌతమ్ రెడ్డి, తాళ్లపల్లి మోహన్ గుప్తా, సంపతీశ్వర్‌రెడ్డి, కళ్యాణ్ నాయక్, కొంద్రు మల్లేష్ పాల్గొన్నారు

## మూగజీవాల సంరక్షణకు నట్టల నివారణ మందులు





ప్రజాపక్షం/కేశంపేట: వ్యాధుల నుంచి మూగజీవాలను సంరక్షించుకునేందుకు నట్టల నివారణ మందులు వేయించాలని నిర్ధవెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్ సూచించారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామంలో 1468గొర్రెలు, 70మేకలకు నట్టల నివారణ మందులను పశువైద్యాధికారులు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ వ్యాధుల నుండి మూగజీవాలను కాపాడుకోవాలంటే విధంగా నట్టల నివారణ మందులు వేయించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రాజీవ్ పైలెట్, వార్డు సభ్యులు రమేష్, రొయ్యల మంజుల జంగేష్, గ్రామ కమిటి అధ్యక్షుడు కొత్త శ్రీశైలం, ఉపాధ్యక్షుడు ఖాజాపాషా, నేతలు మల్లయ్య, ముత్యాలు, జంగయ్య, రామకృష్ణలు పాల్గొన్నారు.

యాచారం : నట్టల నివారణ మందులు మూగ జీవాలకు వేయించాలని మొండిగౌరేల్లి గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి మాల్లారెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో నట్టల నివారణ మందు గొర్రెలకు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాదికారి డాక్టర్ రేఖా, గ్రామ ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లల్లో అధికారుల అలసత్వం

రోడ్డుపై నిలిచిన ట్రాక్టర్లు

నాలుగు రోజులుగా ఎదురు చూస్తున్న రైతులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: మొక్కజొన్న పంటను కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కొందుర్గు వ్యవసాయ సహకార సంఘానికి మొక్కజొన్న పంటను విక్రయించేందుకు వివిధ గ్రామాల నుండి 30ట్రాక్టర్లకు పైగా వచ్చాయి. నాలుగు రోజుల నుండి విక్రయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘాల ద్వారా అన్నదాతలు పండించిన పంటలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రభుత్వం గొప్పగా ప్రకటనలు చేస్తుందే తప్పా అచరణలో మాత్రం అమలు చేయడం లేదని మండిపడ్డారు. చలిని సైతం లేక చేయకుండా నాలుగు రోజులుగా ట్రాక్టర్లలో ధాన్యం పెట్టుకొని పడిగాపులు కాస్తున్నామని అంటున్నారు. కొందుర్గు వ్యవసాయ సహకార సంఘంలో సరైన మౌలిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎగుర్కొంటున్నామని రైతులు వివరించారు. పంటల సాగుకోసం అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని సకాలంలో మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. . ఇప్పటికైనా ఉన్నదాధికారులు సకాలంలో స్పంధించి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని కోరారు.

## పన్నెండు గంటలైనా కానరాని సిబ్బంది



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: అధికారులు సమయవేళలు పాటించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో పన్నెండు గంటలు అవుతున్నా కార్యాలయ సిబ్బంది రాకపోవడం..ఖాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సమయవేళలు పాటించాల్సిన అధికారులే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజలు సమస్యలను ఎలా తీర్చుతారంటూ మండిపడుతున్నారు. పన్నెండు గంటలు దాటుతున్నా సమయానికి అధికారులు రాకపోవడంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనం ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఉదయం 10గంలకు ఎంపిడిఇ కార్యాలయానికి చేరుకొని గంటల తరబడి అధికారుల కోసం వేచి చూశారు. దీనిపై అధికారులను ఫోన్ ద్వారా వివరణ కోరగా కార్యాలయానికి వస్తున్నాం.. కొంత సమయం పడుతుందని సమాధానం చెప్పడంపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు సైతం ఇదే తంతు కొనసాగిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సమయపాలన పాటించని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పలు డివిజన్ అధికారులతో డిసి సమావేశం

ప్రజాపక్షం/దమ్మాయిగూడ: కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత దమ్మాయిగూడ, కీసర, జవహర్‌నగర్, శామీర్‌పేట్ డివిజన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శానిటేషన్ నిర్వహణ, ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈ నెల 29 నుండి జనవరి 31వరకు నిర్వహించనున్న స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత
### జోనల్ కమిషనర్ వివిధ ప్రాంతాల్లో పర్యటన

ప్రజాపక్షం/మల్కాజిగిరి :మౌలాలి దర్గాకు పెద్ద సంఖ్యలో దూర ప్రాంతాల నుండి యాత్రికులు వస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొండ మీద మూడు షిఫ్టుల పారిశుధ్యం పనులు నిర్వహించాలని, అవసరమైన చోట్ల డస్ట్ బిన్స్ అందుబాటులో అమర్చి వాటిని వినియోగించేలా అవగాహన కల్పించాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. దీంతోపాటు త్వరలో జరిగే ఉర్సు ఉత్సవాలకు గాను తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం జోనల్‌లోని వివిధ ప్రాంతాల్లో మౌలాలి డిసి గోపాలరావు, ఈఈ లక్ష్మ ణ్, ఎంఎంహెచ్‌ఓ మంజుల, డిఈ మహేశ్వర్, ఏఈ మధురిమ ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం నేరేడ్‌మెట్, లాలాపేట ప్రాంతాల్లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను సందర్శించిన ఆయన పారిశుద్య లోపం కనపడుతోందని, ప్రతి రోజు ఇక్కడ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తూ ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలు జరుగకుండా చూడాలన్నారు. సెంట్రల్ డివైడర్‌పై రాళ్లు రప్పలు, మట్టి కుప్పలు ఉండరాదని ఆదేశించారు. వాయుపురిలోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించి అక్కడ పని తీరును అడిగి తెల్సుకొని రోజూ ఎన్ని స్వచ్ఛ ఆటోలు వస్తున్నాయని ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించాలే తప్ప నిల్వ ఉండరాదన్నారు.





## 'మెగా శానిటేషన్'ను విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/నాగారం: మెగా శానిటేషన్ కార్యక్రమాన్ని సమన్వయంతో, సమిష్టి కృషితో విజవంతం చేయాలని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నారు. సోమవారం జిహెచ్‌ఎంసి 5వ డివిజన్ నాగారంలో డిసి వాణి మెగా శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధులను సందర్శించి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. వీధుల శుభ్రత, చెత్త సేకరణ డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ తదితర అంశాలపై అధికారులు, సిబ్బంది, జవాన్లకు పలు కీలక సూచనలు చేశారు. శానిటేషన్ సిబ్బంది బాధ్యతయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ నెల 29 నుండి జనవరి 26వరకు నిర్వహించనున్న మెగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.నారాయణరెడ్డి, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/నాగారం: నాగారం రెడ్డి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెడ్డి సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రాంరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు కౌకుట్ల అనంత్‌రెడ్డి, కొమిరెల్లి సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కొండ జంగారెడ్డి, నోముల జంగారెడ్డి, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**గౌడ సంఘం ఆధ్వర్యంలో....** నాగారంలో గౌడ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ కౌన్సిలర్లు రామారం శ్రీహరి గౌడ్, సంపనబోలు హరిగౌడ్, సాయినాథ్‌గౌడ్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ జె.రామకృష్ణగౌడ్, జనరల్ సెక్రెటరీ వరప్రసాద్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమాశంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు నరసింహగౌడ్, పి.వెంకటేష్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి, బంగారం కోసం వృద్ధురాలి హత్య

ప్రజాపక్షం/ఉప్పల్ : మహిళా మిస్సింగ్ కేసు కాస్త మర్డర్ కేసుగా సంచలనం సృష్టించిన కేసును నాచారం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించిన ఘటన నాచారం పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ధనుంజయ తెలిపిన వివరాల ప్రకారం బాబా నగర్, మల్లాపూర్‌లో నివాసం ఉంటు న్న సూరెడ్డి సుజాత (65) అనే వృద్ధురాలు డిసెంబర్ 19న మిస్సింగ్ అయ్యిందని ఫిర్యాదు అందడంతో కేసు నమోదుచేసి అన్ని కోణాలలో విచారణ చేసిన సమయంలో ఆమె ఇంట్లో అద్దెకుంటున్న మద్దు అంజి బాబు (33) గత రెండు నెలలుగా మృతురాలి ఇంట్లో అద్దెకుంటూ, ఆమె ఒంటరిగా ఉంటున్నదని బంగారం, నగదు ఉన్నాయని గమనించి దురుద్దేశంతో డిసెంబర్ 19న ఆస్తికోసం వృద్ధురాలిని గొంతు నులిమి చంపిన అనంతరం ఆమెకు చెందిన బంగారు ఆభరణాలను దోచుకున్నాడు. హత్య అనంతరం, తన సహచరులు నక్కంటి యువరాజ్ (18), నుకాల దుర్గారావు (35) సహాయంతో మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని గోదావరి నదిలో పడేసినట్లు దర్యాప్తులో తేలింది అని తెలిపారు. నిందితులను కోనసీమ జిల్లా రాజోలు మండలంలోని పొదులాడ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి నాలుగు బంగారు గాజులు, ఒక బంగారు గొలుసు, రెండు జతల చెవి దిద్దులు, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కి తరలించామని తెలిపారు.



## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఉదంతం సోమవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాచారం పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రమీల ఉప్పల్‌లో నివాసం ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం ఆమె మూడు అంతస్తుల భవనంపై నుండి దూకింది. తీవ్ర గాయాలతో రక్తస్రావమవుతున్న ఆమెను గమనించిన స్థానికులు హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకొన్న ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సమస్యలా మరే ఇతర కారణాలేవైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం హెచ్‌ఎంటి ఖాళీ స్థలంలో బస్సు డిపో, ప్రభుత్వం స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ జగద్గిరిగుట్ట సిపిఐ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో సిపిఐ రాష్ట్ర సభ్యులు ఏసురత్నం, ఇమామ్‌లకు దండలు వేసి దీక్షను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ ఎంటి ఖాళీ స్థలంలో బస్సు డిపో, ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మాణం చేస్తామని అప్పటి టిఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని గెలిచి, ఇప్పుడు వాటిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. వాటిని సాధించుకోవడం కోసం సిపిఐ అనేకసార్లు ధర్నాలు, దీక్షలు చేసి, మంత్రిని కలవడం జరిగిందని ఆసుపత్రి కోసం 25 ఎకరాలు సాధించుకున్నామని, సాధించిన వాటిని కూడా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు సిపిఐ తో కలిసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయం, కార్యదర్శులు హరినాథ్, రాములు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి సహదేవ్‌రెడ్డి, యువజన సంఘం అధ్యక్షులు సంతోష్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్‌చారీ, సిపిఐ నాయకులు నగేష్ చారీ, బాబు, నారాయణ మేస్త్రీ, నర్సయ్య, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## 'అల్‌మెలో' ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఐదవ వేతన ఒప్పందం



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: అల్‌మెలో ప్రైవేట్ లిమిటెడ్ కెంపెనీ, రంగారెడ్డి నగర్ ఐడిఎ కూకట్‌పల్లి యాజమాన్యంతో 5వ నూతన వేతన ఒప్పందం కుదిర్చారు. మూడు సంవత్సరాల కాల వ్యవధిగల వేతన ఒప్పందంలో రంగారెడ్డి జిల్లా మాజీ డిసిపి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, కంపెనీ కార్మిక యూనియన్ అధ్యక్షులు కె.యం.ప్రతాప్ ప్రతి కార్మికునికి, ప్రతినెల రూ.12000 పెరిగే విధంగా కృషి చేశారు. సోమవారం టి.అంజయ్య కార్మిక భవన్‌లో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ జె.శ్యాంసుందర్ సమక్షంలో అల్‌మెలో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ కె.వీర్రాజు, ప్రొడక్షన్ మేనేజర్ బి.హెచ్.వి.ఎస్.మూర్తిలతో కలిసి ఈ ఒప్పందాన్ని కుదిర్చారు._నూతన వేతనం ఒప్పందం 01–01–2025 నుండి 1122007 వరకు జరిగింది. ఈ ఒప్పందం వల్ల సీనియర్ కార్మికులకు గతంలో రూ. 41,275 జీతం నుండి రూ.53, 275కు పెరిగింది. జూనియర్ కార్మికులకు పాత జీతం రూ. 34, 518 నుండి రూ.46,518 పెరిగింది. రిటైర్మెంట్ గిఫ్ట్ రూ.1,00,000 నుండి రూ. 1,50,000లకు పెంచడం జరిగింది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతి సంవత్సరానికి పూర్తి కుటుంబానికి రూ.2,00, 000లకు పెంచడం జరిగింది. ఇన్సూరెన్స్ పాలసీ గ్రూప్ పర్సనల్ ఆక్సిడెంట్ (జిపిఏ)ను 5లక్షల నుండి 10లక్షలకు పెంచారు. కంపెనీలోని కార్మికుల పిల్లలకు పదవ తరగతిలో 85 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, వారికి రూ.7,500క్యాష్ గిఫ్ట్ మేనేజ్‌మెంట్ ఇచ్చేలా, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 85 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, వారికి రూ.10,000 క్యాష్ గిఫ్ట్, డిగ్రీ, బీటెక్ లో 85శాతం ఉత్తీర్ణత సాధించిన వారికి రూ. 12,000 క్యాష్ గిఫ్ట్‌ను మేనేజ్‌మెంట్ వారు ఇచ్చేలా ఒప్పంద చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, కార్మికులు ప్రతాప్‌కు కృజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు యం.శ్రీనివాసరెడ్డి, ఎస్. రామచందర్, ప్రధాన కార్యదర్శి యం.శాంతారావ్, సంయుక్త కార్యదర్శి కె.మల్లికార్జున, ఆర్గనైజింగ్ సెక్రటరీ యం.సురేష్, కోశాధికారి జయన్న, కమిటీ సభ్యులు డిఎస్.కృష్ణ, ఎస్‌రాజు, పి.కుమార్, జి.చిన్నప్పరెడ్డి, ఎం. యాదగిరిగౌడ్, విఆర్‌సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయి సమస్యల పరిష్కారానికి రాజీవ్ గృహకల్ప వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల వినతి

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: విద్యుత్ బకాయి సమస్యలను పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కలి సి కోరారు. ఈ సందర్భగా సభ్యులు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలో నీటి సరఫరాకు వాడుతున్న మోటార్ల బిల్లు బకాయి ఉన్నందున విద్యుత్ అధికారులు మోటార్ కనెక్షన్ కట్ చేస్తామని కాలనీ వాసులకు చెప్పడం జరిగిందని అన్నారు. గతంలో ఉన్న కమిటీ ప్రతి ఇంటి నుండి వసూలు చేసిన పైసలు విద్యుత్ డిపార్ట్‌మెంట్ వారికి కట్టలేదని అందుచేత కరెంట్ బిల్లు బకాయి ఉందని తెలిపారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ దీనిపై విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి గౌడ్, వంగ పరశురాములు, వైకుంఠ, సంధ్య, మాధవిరెడ్డి, ఎండి రంజాన్, తదితరులు పాల్గొన్నారు.





## గొర్రెల పెంపకం దారులకు ప్రభుత్వం చేయూత
### బొమ్మలపల్లి నర్సింహయాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : గొర్రెల, మేకల పెంపకం దారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ నర్సింహయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం దారులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్, ఎఎంసి డైరక్టర్ బిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య యాదవ్, డాక్టర్లు భూక్య, భాస్కర్, బసవరాజు, జగదీశ్వరీ, జిఎంపిఎస్ గ్రామ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా ఉపాధ్యక్షుడు, సహాయ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య చిత్రాల ద్వారా వార్తలు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు

ప్రజాపక్షం/శామీర్‌పేట : అసత్యపు చిత్రాల ద్వారా నిజానిజాలు తెలుసుకోకుండా వార్త సందేశాలను పంపితే చట్టపరమైన క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని శామీర్‌పేట ఎస్‌హెచ్‌ఒ శ్రీనాద్ హెచ్చరించారు. సోమవారం రవీందర్‌కుమార్ అనే బీహార్‌కు చెందిన వ్యక్తి శామీర్‌పేట పెద్ద చెరువుకు ఒక పెద్దపులి వచ్చిందని చిరుత పులితో కూడినటువంటి ఏఐ టెక్నాలజి ద్వార ఒక చిత్రాన్ని తయారుచేసి వాట్సాప్ గ్రూప్‌ల్లో పంపించాడు. దీంతో శామీర్‌పేట మండల కేంద్రంలో పులి సంచరిస్తుందంటూ పుకార్లు షికారు చేసింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాద్, అటవీ శాఖ సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ పులి ఆనవాళ్లు కన్పించకపోవడంతో ఆ చిత్రాన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లో వేసిన రవీందర్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని సిఐ శ్రీనాద్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విదంగా ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్ హెచ్చరించారు.



## దామోదర్‌రెడ్డికి పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ సన్మానం

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: మహబూబ్‌నగర్ జిల్లా దంతుపల్లి మండలం రామానుజపురం గ్రామం నుండి సర్పంచ్‌గా గెలిచిన రిపోర్టర్ దామోదర్‌రెడ్డిని సోమవారం శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, మరెళ్ల శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, ఎమ్. రాజు, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, మోజెస్, బాలరాజు, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో నేరాల అదుపు
### పెద్దేముల్ ఎస్ఐ శంకర్

ప్రజాపక్షం/పెద్దేముల్: గ్రామాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాలను అదుపు చేయవచ్చునని పెద్దేముల్ ఎస్ఐ శంకర్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల పరిధి బండమీదిపల్లి గ్రామంలో ఎస్ఐ రవి పర్యాటించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాణెప్పతో పాటు గ్రామ పెద్దలతో కలసి ఎస్ఐ మాట్లాడారు. గ్రామంలో ప్రధాన కూడలీలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిసి కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో నేరాల అదుపుతో పాటు ముఖ్య నూతన వ్యక్తుల కదలికలను గుర్తించ వచ్చునని తెలిపారు. ఒక సిసి కెమెరా పది మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు కలసి మెలసి నడుచుకోవాలని సూచించారు. యువకులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. సిసి కెమరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. నేరాల అదుపుతో పాటు గ్రామంలో ముఖ్యంగా జరిగే దోపిడిలను అరికట్టడానికి సిసి కేమెరాలు ఎంతో గానో ఉపయోగపడుతాయని అన్నా రు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య,మాజీ ఉపసర్పంచ్ తాండ్ర వీరన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌరోల్ల మల్లప్ప, రాంచందర్, బోయిని మల్లేశం, వార్డు సభ్యులు, గ్రామ యువకులు పాల్గోన్నారు.




## 'ప్రజావాణి'లో 75 ఫిర్యాదులు స్వీకరణ: ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్ : ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 75దరఖాస్తులు స్వీకరించడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా అరోగ్య వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బిసి, ఎస్‌సి అన్ని ప్రభుత్వం హాస్టల్స్, కెజిబివి లో ఉండే విద్యార్థులు ఉచిత కంటి పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికి సరైన చికిత్స , కళ్ల అద్దాలు, మందులు ఇవ్వడం జరుగుతుందని, ఫిబ్రవరి 15వరకు ఈ పరీక్షలు నిర్వహించబడుతాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వరి, డిఆర్‌ఒ మంగిలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**రైతులకు యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం:** వికారాబాద్ జిల్లా రైతులకు ఎలాంటి యూరియా కొరత లేకుండా అన్ని జగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 4026 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. డీలర్ల వద్ద 1432 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాల వద్ద 342 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని కలెక్టర్ తెలిపారు. జనవరి మాసానికి 1922 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని తెలిపారు.

యూరి యా కేంద్రాలను ఉదయం 6గంటలకు తెరిచి ఉంచాలని అన్నారు. రైతుల సౌకర్యం కోసం విక్రయ కేంద్రాల వద్ద తప్పనిసరిగా షామియాల ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.





## వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి : సిపిఐ నాయకులు

కూకట్‌పల్లి / ప్రజాపక్షం : ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ అధికారులను కోరారు. సోమవారం కూకట్‌పల్లి ప్రశాంతి నగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని కోరుతూ సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రభుత్వ వైద్యశాలలో సరైన సదుపాయాలు లేక నిరుపేద కుటుంబాలు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. దీనికితోడు ఈ ప్రైవేట్ హాస్పిటల్‌లో ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తూ ఇష్టానుసారంగా చేస్తున్నారని, దీనిమూలంగా సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పాలవుతున్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో ప్రభుత్వం 100 పడకల ఆసుపత్రి అప్పటి మంత్రిగా ఉన్నటువంటి హరీష్‌రావు శంకుస్థాపన చేయటం జరిగింది కానీ ఇంతవరకు ఆసుపత్రి నిర్మాణానికి నోచుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బాతిరాజు, దశరథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గీత పరిమారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయిల్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మనోచారి తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా స్పోర్ట్స్ కార్నివల్ ఉత్సవాలు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : కెపిహెచ్‌బి భువన విజయం గ్రౌండ్‌లో సోమవారం భువన విజయం సేవా సమితి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్పోర్ట్స్ కార్నివల్ ఉత్సవాలు నిర్వహించారు. బాక్స్ క్రికెట్, బాడ్మింటన్, టెన్నిస్, కిడ్స్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ 100ఫీట్, 200ఫీట్ పరుగు పందేలు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, బీమ్ బ్యాగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో కాలనీ మహిళలు, పిల్లలు, పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలిచిన విజేతలకు జనవరి 25న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతులు మీదుగా బహుమతి ప్రదానం చేస్తారు. ఈ స్పోర్ట్స్ కార్నివాల్ వ్యాపార ప్రముఖులు వెంకటరావు, సత్యనారాయణ (పండు) సహాయ సహకారాలతో భువన విజయం సేవా సమితి ప్రెసిడెంట్ గురువు తిరుపతి రావు, సభ్యులు పి.విరావు, నాగప్రసాద్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఫోక్సో కేసులో నిందితుడికి సోమవారం జరిగిన తుది విచారణలో నేరస్తుడిగా రుజువవటంతో 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మైనర్ బాలికను మాయమాటలతో లోబరచుకొని లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడి మోపిన అభియోగాలు రుజువైన దరిమిలా న్యాయమూర్తి అతడికి జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధించారు. దీంతోపాటు బాధితురాలికి రూ.5 లక్షల పరిహా రం చెల్లించాలని తీర్పులో పొందుపరచారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూన్ 2022లో నమోదైన ఈ కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పారిశ్రామిక వాడలో నివాసం ఉండే 15 ఏళ్ల మైనర్ బాలిక అదృశ్యమైనట్లు 2022 జూన్ 20న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసుల దర్యాప్తులో అదే ప్రాంతానికి చెందిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వికాస్ నాయరక్(40) బాలికను తన సొంత ప్రాంతానికి తీసుకెళ్లిన ట్లు గుర్తించటంతో అతడిని అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి దర్యాప్తులో బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడినట్లు అతడు అంగీకరించటంతో అప్పటి సిఐ రాజశేఖరరెడ్డి ఫాక్సో కేసుగా నమోదు చేసి కోర్టులో హాజరుపరచి సమగ్ర దర్యాప్తు మేరకు అదే ఏడాది అక్టోబరులో చార్జిషీట్ దాఖలు చేసారు. అప్పటి నుండి న్యాయస్థానంలో కొనసాగిన సుదీర్ఘ విచారణ అనంతరం సాక్ష్యాధారాల మేరకు న్యాయమూర్తి నిందితుడికి కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించారు.



# రీల్





## ట్రైలర్ అదిరింది...

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా సినిమా 'రాజా సాబ్'. ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్‌లో దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి పండుగా సందర్భంగా జనవరి 9న 'రాజా సాబ్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. సోమవారం ఈ సినిమా ట్రైలర్ 2.ఓ రిలీజ్ చేశారు. ఎన్నో సర్ ప్రైజింగ్ ఎలిమెంట్స్ ప్యాకేజ్ చేసిన ఈ ట్రైలర్ ప్రేక్షకుల్ని 'రాజా సాబ్' ప్రపంచంలోకి తీసుకెళ్లింది.'రాజా సాబ్' ట్రైలర్ 2.ఓ ఎలా ఉందో చూస్తే గంగమ్మ (జరీనా వాహబ్) ముద్దుల మనవడు రాజా సాబ్ (ప్రభాస్), అన్నీ మర్చిపోయే గంగమ్మ తన భర్త (సంజయ్ దత్)ను మర్చిపోలేక పోతుంది. ఓ మిస్టరీగా మారిన తాతను కలిసే సాహసానికి రాజా సాబ్ సిద్ధమవుతాడు. అడుగు అడుగునా ప్రమాదాలు నిండి ఉన్న మయసభ లాంటి తాత భారీ హవేలీలో అడుగుపెడతాడు రాజాసాబ్. ఆ హవేలీలోకి వెళ్లిన వారిని ఎవరిని ఎలా వేటాడాలో డిజైన్ చేసి పెడతాడు తాత. హిప్నాటిజంతో పాటు దుష్ట శక్తులను శాసించగల తాత.. రాజా సాబ్, అతనితో వచ్చిన వారిని ఎలా ఇబ్బంది పెట్టాడు? తాత సృష్టించిన ప్రమాదాల నుంచి రాజా సాబ్ ఎలా బయటపడ్డాడు? తాను వెళ్లిన మిషన్ ను రాజా సాబ్ కంప్లీట్ చేసుకున్నాడా? లేదా? దేవనగర సంస్థ జమీందారిణి గంగాదేవి, సాధారణ మధ్య తరగతి గంగమ్మగా ఎందుకు జీవిస్తోంది? అనే అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది. ప్రభాస్ కనిపించిన రెండు డిఫరెంట్ మేకోవర్స్ ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభాస్, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, సంజయ్ దత్, బొమన్ ఇరానీ, తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ కార్తీక్ పళని, మ్యూజిక్ తమన్, ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్, కింగ్ సోలొమన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్, ప్రొడ్యూసర్స్ టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్, రచన, దర్శకత్వం మారుతి.



## జనవరి 1న సఃకుటుంబానాం

హెచ్ఎన్‌జి సినిమాస్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్‌గా శశాంక్ మలి చేశారు. 'సఃకుటుంబానాం' చిత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల చిత్ర విడుదల వాయిదా పడగా ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా 2026 జనవరి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. రామ్ కిరణ్, మేఘా ఆకాష్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు నటిస్తున్నారు.




## అప్పలసూరిగా..

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమాలో జగపతి బాబు చాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. రెగ్యులర్ గా షూటింగ్ జరుగుతున్న పెద్ది సినిమాలో జగపతి బాబు పాత్ర పేరు అప్పల సూరి. ఈ అప్పల సూరి పాత్ర ఎలా ఉంటుంది అని తెలియజేసే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో కథను నడిపించే పాత్ర అప్పల సూరిదే అంటున్నాడు దర్శకుడు బుచ్చిబాబు. ఈ సినిమాలోని చికిరి చికిరి అనే పాట ఇప్పటికే హిట్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఢిల్లీలో జరుగుతోంది. దివంగత శ్రీదేవి కుమార్తె జాన్వి కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే హీరో హీరోయిన్‌లపై రెండు పాటలను చిత్రీకరించారు. మైత్రి మూవీస్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటుడు బొమ్మను ఇరానీ మరో కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది మార్చిలో సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## సినిమా బాగుంది..

- దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి



'పతంగ్' చిత్రం ఇటీవల విడుదలైంది. విడుదలైన అన్ని థియేటర్లలో విజయవంతంగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. సినిమా మంచి టాక్తో పాటు కలెక్షన్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి. యూనివర్సల్గా ఈ సినిమాకు హిట్టాక్‌తో పాటు ఓ మంచిసినిమావ చూశామన్న సంతృప్తిని ఆడియన్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా సినిమా పతాక సన్నివేశాలు ఓ స్టేడియంలో ఓ మ్యాచ్‌ను చూస్తున్నమ అనుభూతికి లోనవుతున్నారు. నేను రామానాయుడు స్టూడియో స్టూడెంట్ ను. ఓ సంక్రాంతి రోజు అనిపించింది. మనం ఫారిన్ నుంచి తీసుకొచ్చిన రగ్బిలాంటి స్టోరీతో సినిమాలు తీశాం కానీ ఇది మన నేటివిటి స్పోర్ట్స్ కదా.. దీని మీద మనం ఎందుకు తీయలేము అని పతంగ్ను మొదలుపెట్టాం. సినిమా మొదలు పెట్టిన తరువాత ఎందుకు తీయలేదో అనే విషయం సీజీ వర్క్ అప్పుడు తెలిసింది. సీజీ వర్క్ చాలా సమయం పట్టింది. సీజీ వర్క్ రెండు సంవత్సరాలు పట్టింది. చాలా కష్టమైంది. సినిమా లేట్ అవ్వడానికి పతాక సన్నివేశాల్లో వచ్చే సీజీ వర్కే డిలే కారణం. ఎటువంటి రిఫరెన్స్ లేకపోవడంతో సీజీకి సమయం తీసుకున్నాం. కైట్ ఎగిరేది వరిజినల్‌గా అనిపించేలా వచ్చే వరకు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. థియేటర్లు ట్రై చేస్తున్నాం. సినిమా తీయడంతో ఇక అయిపోయింది అనుకునేవాడ్ని. కానీ సినిమా తీసిన తరువాత మళ్లీ ప్రమోషన్, రిలీజ్ ఇంత పని ఉంటుందా అని నాకు ఈసినిమాతోనే తెలిసింది. మౌత్‌టాక్‌తో సినిమా బాగుంది అని తెలిసినా సరైన థియేటర్లు, టైమింగ్స్ లేకపోవడంతో సినిమా బాగున్నా జనాలకు అందుబాటులో లేకపోవడవంతో చూడలేకపోతున్నారు. అయితే సినిమా ఆడుతున్న థియేటర్లు మాత్రం ఫుల్ అవుతున్నాయి. స్క్రిప్ట్‌లో అనుకున్న ప్రకారం ఆ పాత్రకు మొదట సందీప్ రెడ్డి వంగా, దిల్ రాజు, ఎస్జే సూర్య నాగ్ అశ్విన్, ఇలా ఎక్స్‌పెక్ట్ చేయని వాళ్లను అడిగాం. కానీ వర్కింగ్ డేస్ ఎక్కువగా ఉండటం వల్ల ఒప్పుకోలేదు. ఇక సినిమాలో గౌతమ్ మీనన్ పాత్రనున గౌతమ్మీనన్ చేస్తే బాగుంటుందని అయన్ని అప్రోచ్ అయ్యాం. ఆయనపాత్ర కథ, విని ఒప్పుకున్నారు. ఆయన మీద పంచ్‌లు వేయడం కూడా బాగా నచ్చింది. ఓవర్సీస్ జనవరి 1న చాలా వైడ్ రిలీజ్‌గా చేయ్యబోతున్నాం. అక్కడి ఆడియన్స్ కూడా ఇంకా బాగా నచ్చుతుందని నమ్ముతున్నాను. ఎంటర్‌టైనింగ్ జోన్లో కమర్షియల్ సినిమాలు చాలా ఇష్టం. పతంగ్‌లో కామెడీకి టెన్ టైమ్స్ నా తదుపరి సినిమాలో ఉంటుంది. అది నా క్యారెక్టరే... నాకు కూడా చాలా కన్ఫ్యూజన్ ఉంటుంది. రెగ్యులర్ కూడా నేను అలాంటి వాళ్లను చాలామందిని చూశాను. నేను వర్క్ విషయంలో పర్ఫెక్ట్‌గా ఉన్నా మిగతా విషయాల్లో కన్ఫ్యూజ్ అవుతుంటాను.

## చిన్న సినిమాలపై నమ్మకం ఉంది


ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు సురేష్ బాబు

సినిమాలకి ముఖ్యంగా చిన్న సినిమాలకి ఆడియన్స్ థియేటర్స్‌కి రావడం తగ్గిపోతుందని తరుచు మాట్లాడుతుంటాం. అయితే కొన్నిసార్లు చిన్న సినిమాలని ఆడియన్స్ చాలా అద్భుతంగా థియేటర్స్‌లో ఆదరిస్తున్నారు. రాజు వెడ్స్ రాంబాయి, లిటిల్ హార్ట్స్ లాంటి కొన్ని సినిమాల్లో వస్తున్నాయి. అలాగే ఇతర భాషల్లో కూడా చిన్న సినిమాలు అద్భుతాలు చేస్తున్నాయి. చిన్న సినిమాలపై హోప్ అయితే ఉంది' అని ఫిలిం ఛాంబర్ నూతన అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు వ్యాఖ్యానించారు. సోమవారం రామానాయుడు స్టూడియోలో జరిగిన సైక్ సిద్ధార్థ ప్రెస్‌మీట్‌లో సురేష్ బాబు మాట్లాడారు. చిన్న సినిమాలు ఆడితేనే పరిశ్రమ మనుగడ బాగుందని ఆయన చెప్పారు. అందుకే సురేష్ ప్రొడక్షన్ సంస్థ కానీ, స్పిరిట్ మీడియా సంస్థ కానీ చిన్న సినిమాలకు పూర్తిగా సపోర్ట్ చేస్తున్నామని తెలిపారు. సైక్ సిద్ధార్థ సినిమాకు సపోర్ట్ చేయడానికి కారణం డైరెక్టర్ వరుణ్ సినిమాని చాలా డిఫరెంట్ ప్రజెంట్ చేశాడు. సినిమాని చూసిన వెంటనే తీసుకోమని చెప్పాను. చాలా ఇంట్రెస్టింగ్‌గా సినిమా తీశారు. సినిమా బాగుంటే ఆడియన్స్ ఖచ్చితంగా చూస్తున్నారు. అలాగే టికెట్ రేట్స్ కూడా దృష్టిలో పెట్టుకుంటున్నాము. సైక్ సిద్ధార్థ సినిమాకు టికెట్ కేవలం 99 రూపాయలు మాత్రమే పెట్టాము అని సురేష్ బాబు పేర్కొన్నారు.




## ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్

వెర్సటైల్ స్టార్ ధనంజయ ప్రధాన పాత్రలో నటిస్తోన్న '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నో అప్‌డేట్స్‌తో ఆకట్టుకుంటోంది. ఇప్పటికే పలువురు స్టార్స్‌తో నిండిన ఈ సినిమాలోకి ఇప్పుడు పాపులర్ హీరోయిన్ ప్రియాంక మోహన్ జాయిన్ అయ్యారు. తాజాగా ఈ సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. రెండు వేర్వేరు పోస్టర్లలో విడుదలైన లుక్‌లో ప్రత్యేకంగా కనిపిస్తోంది.



## శ్రీవారిని దర్శించుకున్న రోషన్

హీరో శ్రీకాంత్ ఊహ దంపతుల కుమారుడు రోషన్. ఛాంపియన్ సినిమాతో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇటీవల విడుదలైన ఛాంపియన్ సినిమాకు పెద్దగా స్పందన రావడంలేదు. దీంతో హీరో రోషన్, హీరోయిన్ అనశ్వర రాజన్ ఇతర టీమ్ సభ్యులు కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారికి దర్శనం చేసుకుని తమ సినిమా భారీ సక్సెస్ కావాలని మొక్కుకున్నానని దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన రోషన్ చెప్పారు. ఈ సినిమా తనను నిలబెడుతుందనే నమ్మకం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.






## లలిత్ మోదీ క్షమాపణ



**లండన్:** కోట్లాది రూపాయలు ఎగవేసి ప్రస్తుతం బ్రిటన్‌లో తల దాచుకుంటున్న ఐపిఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ సోమవారం క్షమాపణలు చెప్పారు. తనను, విజయ మాల్యాను భారత్‌నుండి పారిపోయిన అతిపెద్ద ఆర్థిక నేరస్థులుగా పిలుస్తున్నారన సోషల్ మీడియాలో పోస్టింగ్ చేశారు. విజయమాల్యా 70వ జన్మదినోత్సవం సందర్భంగా లండన్‌లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన తామిద్దరినీ (లలిత్ మోదీ, విజయమాల్యా) భారత్ నుండి పారిపోయిన అతిపెద్ద నేరస్థులుగా పేర్కొంటున్నారని చమత్కరించారు. కానీ అదే నిజం. ఆ తర్వాత ఆయన ఆ వీడియోను డిలేట్ చేస్తూ, తాను చేసిన చమత్కారం ఎవరినైనా ముఖ్యంగా భారతదేశ దర్యాప్తు సంస్థల మనోభిప్రాయాలను గాయపరిస్తే క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. తాను చాలా లోతుగా ఆవేదనతో ఈ క్షమాపణలు చెబుతున్నానంటూ ఆయన పోస్టింగ్ పెట్టారు. తన మాటలను, భావాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని క్షమాపణలు చెప్పారు. లలిత్ మోదీ, విజయ్ మాల్యాలను భారతదేశానికి తిరిగి తీసుకువచ్చేందుకు కట్టుబడి ఉన్నామని, వారిని న్యాయస్థానం ఎదుట నిలబెడతామని భారత దర్యాప్తు సంస్థతు పునరుద్ఘాటించిన చాలా రోజుల తర్వాత లలిత్ మోదీ ఈ క్షమాపణలు తెలియజేశారు. లలిత్ మోదీ ఫెమా చట్టం ఉల్లంఘన, అక్రమంగా ధనాన్ని లెక్కల్లో చూపించకుండా తరలించిన కేసుల్లో నిందితుడుగా ఉన్నారు. అదేవిధంగా విజయ్ మాల్యా కూడా కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి బ్యాంకులను ముంచేసి పారిపోయారు. ఆయన బ్రిటన్‌లో ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎన్నికను రద్దు చేయండి

### హైకోర్టులో నవీన్‌యాదవ్‌పై మాగంటి సునీత పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ సీటుకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందిన ఫలితాన్ని రద్దు చేయాలంటూ ఓడిపోయిన బిఆర్ఎస్ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్నిక ఫలితాన్ని రద్దు చేయాలి. ఎమ్మెల్యేగా గెలించిన నవీన్ యాదవ్ ఎన్నికను రద్దు చేయాలి అని బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళికి తిలోదికాలు ఇచ్చారు. ఏడు క్రిమినల్ కేసులున్నాయని ఎన్నికల అఫిడవిట్‌లో చెప్పారేగాని వాటి వివరాలు వెల్లడించలేదు. కాబట్టి ఎన్నికల రూల్స్ ప్రకారం నవీన్ యాదవ్ ఎన్నికను రద్దు చేయాలి. నేర చరిత్ర వివరాలను అసమగ్రంగా వెల్లడించారు. నామినేషన్ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించకపోవడం చట్ట వ్యతిరేకం. ఎన్నికల ప్రచార ఖర్చులను రోజు వారీ వివరాల్ని వెల్లడించలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తుతో పెయిడ్ న్యూస్ ఖర్చు రూ.2.30 లక్షలను ఎలక్షన్ ఖర్చులో చూపలేదు. కొండాపూర్లో మున్నూరుకాపు కుల సంఘం మీటింగ్‌లో నవీన్ యాదవ్ ఫొటోలు, పార్టీ జెండాలను ప్రదర్శించారు. కాబట్టి ఈ సభకు అయిన ఖర్చును ఎన్నికల ఖర్చులో జమ చూపాలి. సిఎం సినీ కార్మికులకు హామీ ఇవ్వడం ఎన్నికల నిబంధన ఉల్లంఘనే. సినీ కార్మికులకు భూమి కేటాయిస్తామన్న సిఎం హామీ ఎలక్షన్ రూల్స్ను కాలరాయడమే. మంత్రులు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. నవీన్ యాదవ్ కత్తితో ఊరేగారు. నవీన్ యాదవ్ ఎన్నికను రద్దు చేయాలి.. అని మాగంటి వేసిన పిటిషన్‌లో హైకోర్టును కోరారు.



## రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు

### గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికంగా అమ్మకాలు
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రబీ సీజన్ కోసం రైతులకు అవసరమైన యూరియా నిల్వలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పూర్తిగా అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్, యూరియా పంపిణీలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో మంత్రి తుమ్మల సోమవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీకి కేంద్ర ప్రభుత్వం మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు రావాల్సిన 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 5.70 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయని వివరించారు. గత సంవత్సరం ఇదే సమయానికి 2.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా, ఈ సీజన్‌లో రోజుకు సగటుగా 8,692 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 3.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని వివరించారు. ఇది గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్ ను ఆదిలాబాద్, మహబూబ్ నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో ఇప్పటి వరకు 82,059 మంది రైతులు యూరియా బుకింగ్ చేసి 2,01,789 యూరియా బస్తాలు కొనుగోలు చేశారని, యాప్ ప్రారంభించిన కేవలం 9 రోజుల్లోనే ఈ జిల్లాల్లో రోజుకు 22,000కు పైగా బస్తాలు పంపిణీ అయ్యాయని ఆయన తెలిపారు. జిల్లాల వారీగా యూరియా స్టాక్, డిమాండ్, పంపిణీపై జిల్లా కలెక్టర్లు నిశితంగా పర్యవేక్షించాలని, అవసరమైతే అదనపు సేల్స్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

యూరియా పంపిణీపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ కమిషనరేట్‌లో టోల్ ఫ్రీ నెం.18005995779ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ డాక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస రెడ్డి, కోఆపరేటివ్ అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్ట్

**(మొదటి పేజీ తరువాయి)**

చేసుకున్నారు. ఆ తర్వాత వాట్సాప్‌లో వేర్వేరు నెంబర్ల నుంచి వీడియో కాల్స్ వచ్చాయి. ఆధార్ కార్డుతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసినట్లు వీడియో కాల్‌లో ఆ బాధిత మహిళను ఓ వ్యక్తి బెదిరించాడు. ఆ అకౌంట్ ద్వారా సుమారు ఆరు కోట్ల అక్రమ లావాదేవీలు జరిగినట్లు చెప్పాడు. అయితే తనకు బ్యాంక్ అకౌంట్ లేదని ఆమె చెప్పిన తర్వాత.. ఫేక్ పోలీసు ఫిర్యాదు ఫోటోలను ఆమెకు పంపారు. సిబిఐ లోగో ఉన్న డాక్యుమెంట్లను కూడా బాధిత మహిళకు మెసేజ్ చేశారు. ఈ విషయం గురించి ఫ్యామిలీలో ఎవరికీ చెప్పవద్దు అని, ఒక వేళ చెబితే వాళ్లను అరెస్టు చేస్తామని బెదిరించారు. 24 గంటల నిఘాలో ఉన్నట్లు ఆమెను బెదిరించారు. కేసు విచారణ చేపడుతున్నామన్నారు. ఇక ఆ తర్వాత ఓ వ్యక్తి వీడియో కాల్‌లో వచ్చి, తాను జడ్జి చంద్రచూడ్ అని పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఆ మహిళను ప్రశ్నించాడు. బెయిల్ నిరాకరిస్తున్నట్లు ఆమెను బెదిరించాడు. దీంతో తన వద్ద ఉన్న డబ్బును డిపాజిట్ చేయాలని సైబర్ నేరగాళ్లు ఆమెను బెదిరించారు. మ్యూచువల్ ఫండ్స్ తీసి ఆ డబ్బును ఆర్టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆదేశించారు. పోలీసుల తనపై చర్య తీసుకునే అవకాశం ఉందన్న భయంతో.. ఆమె సుమారు 3.71 కోట్ల డబ్బును బదిలీ చేసింది. మళ్లీ మళ్లీ డబ్బులు అడగడంతో ఆమె తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. చాటింగ్ లాగ్, కాల్ డిటేల్స్, ట్రాన్‌జాక్షన్ రికార్డులు, బ్యాంక్ స్టేట్మెంట్లలను ఆమె పోలీసులకు సమర్పించింది.

## జాత్యహంకార దాడి

**(మొదటి పేజీ తరువాయి)**

సూచించారు. మన దేశం ఎలా మారుతోందో మనం ఆలోచించుకుని దానిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. 'నా ఆలోచనలు చక్మా కుటుం బం, త్రిపుర, ఈశాన్య ప్రజలతో ఉన్నాయి. మిమ్మల్ని మా తోటి భారతీయ సోదర సోదరీమణులుగా పిలుచుకోవడం మాకు గర్వకారణం' అని గాంధీ పేర్కొన్నారు. కాగా, టిప్రా ఇండిజినస్ స్టూడెంట్స్ ఫెడరేషన్ బ్యానర్‌పై వేలాది మంది విద్యార్థులు ఆదివారం ఏంజెల్ చక్మాకు న్యాయం కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ఉజ్జయంత ప్యాలెస్ ఉత్తర ద్వారం నుండి సుమారు ఒక కిలోమీటరు వరకు ర్యాలీ చేశారు.

## బార్ కౌన్సిల్ మెంబర్‌గా గెలిపించండి

### న్యాయవాదులకు కృష్ణమోని స్వాతి విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** మహిళా కోటాలో బార్ కౌన్సిల్ మెంబర్‌గా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కృష్ణమోని స్వాతి న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. తన గెలుపుతో ప్రస్తుత చైర్మన్ రేసులో ఉన్న రాపోలు భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆమె స్పష్టంచేశారు. సోమవారం బషీర్‌బాగ్‌లో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 36వేల మంది న్యాయవాదులకు బార్ కౌన్సిల్ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమన్నారు. మొత్తం 88 బార్ అసోసియేషన్లలోని మహిళా న్యాయవాదుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు, రెండు బెంచీలు, ఒక ఎసి, 20 కుర్చీలు వంటి మౌలిక వసతులను సమకూరుస్తానన్నారు. ఆరోగ్య సమస్యలున్న న్యాయవాదులకు మిల్లెట్ల భోజనం అందించేలా బార్ కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదింపజేస్తామని హామీనిచ్చారు. పేదల న్యాయవాదిగా పేరుపొందిన రాపోలు భాస్కర్‌ను చైర్మన్‌గా ఎన్నుకోవడం ద్వారా న్యాయవాదులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. జనవరి 10జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజల ఆస్తులు

**(మొదటి పేజీ తరువాయి)**

నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, స్మశానవాటికలు తదితర అంశాలపై, సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా మైనారిటీలు స్మశాన వాటికలు లేక ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను వీలైనంత త్వరితగతిన రక్షణశాఖ, రెవెన్యూ, వక్ఫ్‌బోర్డ్ సమన్వయంతో అధిగమించాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట రెవెన్యూ భూమిని రక్షణశాఖకు బదలాయించి వారి నుంచి ప్రత్యామ్నాయంగా భూమి తీసుకోవాలని, అలాగే రెవెన్యూ భూమిని వక్ఫ్ బోర్డుకు అప్పగించాలని సూచించారు. పేదల సంక్షేమం, ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించవలసిన ప్రభుత్వ భూములను కొద్దిమంది స్వార్థప్రయోజనాల కోసం కబ్జాపెట్టే ప్రయత్నాలు చేస్తుంటారని, ఇటువంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. ఆక్రమణలను గుర్తించిన వెంటనే నోటీసులు జారీ చేసి అవసరమైతే ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, వివాదాల్లో ఉన్న భూముల పరిరక్షణకు న్యాయపరంగా గట్టిగా వ్యవహరించాలని సంబంధిత కలెక్టర్లకు సూచించారు. సమావేశంలో టిఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి.షఫీఉల్లా, హైదరాబాద్, మేడ్చల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## కమిషనరేట్లు

**(మొదటి పేజీ తరువాయి)**

పరిధిలో ఉండనున్నాయి. రాచకొండ కమిషనరేట్‌ను పునర్ వ్యవస్థీకరించి మల్కాజ్‌గిరి పేరుతో కొత్త కమిషనరేట్ ను ఏర్పాటు చే శారు. కీసర, శామీర్‌పేట, కుత్బుల్లాపూర్, కొంప ల్లి తదితర ప్రాంతాలు ఈ కమిషనరేట్ పరిధిలోకి వస్తాయి. ఇప్పటి వరకు రాచకొండ పరిధిలో ఉన్న భువనగిరిని ప్రత్యేక పోలీస్ యూనిట్‌గా ఏర్పాటు చేసి యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్పీని నియమించనున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ కోసం కొత్త కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్ పల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, తదితర ప్రాంతాలు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి తీసుకు వచ్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు కమిషనరేట్లకు పోలీస్ కమిషనర్లను, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్‌పిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్యూచర్ సిటీ సిపిగా సుధీర్‌బాబు, మల్కాజిగిరి సిపిగా అవినాష్ మహంతి, సైబరాబాద్ సిపిగా రమేశ్‌రెడ్డి, యాదాద్రి జిల్లా ఎస్‌పిగా అక్షాంశ్‌యాదవ్ నియమితులయ్యారు. కాగా, ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసిన విషయం విదితమే. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దేందుకు పలు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా మూడు భాగాలుగా విభజించి, ప్రతీ ప్రాంతానికి ఒక ప్రత్యేక వ్యూహం, ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. రాష్ట్రానికి అతి ముఖ్యమైన ఒఆర్ఆర్ లోపలి 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో కలుపుతూ చట్టపరమైన మార్పులు చేసింది. ఈ వ్యూహం ద్వారా ఈ ప్రాంతంలో ఒక ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరగడానికి అవకాశం ఉంది. జిహెచ్ఎంసి ప్రాంతాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్ వ్యవస్థీకరించారు. ఇదే విధంగా ఇతర శాఖలను పునర్ వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు మెరుగైన సేవలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగాంగా పోలీస్ వ్యవస్థను నాలుగు కమిషనరేట్లుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com